www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కలకలమా.. కకావికలమా!


కట్టా రామచంద్రారెడ్డి


కడారి సత్యనారాయణ రెడ్డి

అబూజ్‌మడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి, కడారి మృతి

ఇద్దరు సీసీలు ఒకే ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం గత పాతికేళ్లలో ఇదే తొలిసారి 14

మావోయిస్టు పార్టీలో అంతర్గత సంక్షోభం!?

సోనూ స్థానంలో అధికార ప్రతినిధిగా 'కోసా'

వికల్ప్‌తో కలిసి 'సాయుధ పంథా'పై తొలి ప్రకటన

అది వెలుగు చూడకముందే ఇద్దరూ ఎన్‌కౌంటర్

ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు ఒకేచోట ఎలా?

తాజా పరిణామాలపై భిన్న వాదనలు, అనుమానాలు

మంగళవారం | 23-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 159 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: విదియ తె.4:52 తదుపరి తదియ, నక్షత్రం: హస్త మ.1:40 తదుపరి చిత్త, వర్జ్యం: రా.10:32-12:18, దుర్ముహూర్తం: ఉ.8:31-9:19, రా.10:03-10:49, అమృతఘడియలు: ఉ.7:06-8:51, రాహుకాలం: మ.3:00-సా.4:30, సూర్యోదయం: 6:07, ,సూర్యాస్తమయం: 6:07 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

దిగిరాని నిత్యావసరాలు

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గలేదు. ఇప్పటికే ఉన్న స్టాక్ క్లియర్ అయ్యేంత వరకు కొత్త శ్లాబులు అమలు చేయలేమని వ్యాపారులు చెబుతున్నారు. ఎక్కడా తగ్గించిన ధరల బోర్డులు కనిపించలేదు. ఎంఆర్‌పీ లేనివాటిపై జీఎస్టీ తగ్గింపు ప్రభావం లేదు.

వాహనాలు మరింత 'జోరు'

కార్ల ధరలు రూ.60 వేల నుంచి రూ.1.9 లక్షల వరకు, ద్విచక్ర వాహన ధరలు రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకు తగ్గాయి. దీంతో రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో వాహనాల షోరూమ్‌లు కళకళలాడాయి. రేట్లు భారీగా తగ్గడంతో కొనుగోళ్లు జోరందుకున్నాయి.

ఎలక్ట్రానిక్స్.. ఓకే

ఏసీ, టీవీ, డిష్ వాషర్ల ధరలు తగ్గాయి. ఆయా వస్తువులపై రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు ధరలు తగ్గించారు. పలు ప్రాంతాల్లో టీవీలు కొనుగోలు చేయడానికి వినియోగదారులు ఆసక్తి చూపారు.

మందులు.. మార్పు లేదు

మందుల ధరల తగ్గింపుపై జీఎస్టీ ప్రభావం అంతగా కనిపించలేదు. రాష్ట్రంలో చాలా చోట్ల పాత ధరలకే విక్రయించారు.

ఇదీ కారణం!

కేంద్ర ప్రభుత్వం పలు నిత్యావసర సరుకులు, మందులు తదితర వస్తువులపై జీఎస్టీ తగ్గించినా.. తొలిరోజు సోమవారం చాలా చోట్ల ధరలు తగ్గలేదు. పాత స్టాక్ ఉండటం, వాటికి పాత జీఎస్టీ చెల్లించి కొనుగోలు చేసినందున.. వాటి విక్రయాలు పూర్తయ్యేవరకు ధరలు తగ్గించలేమని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ పూర్తి కాలేదని మరికొందరు అంటున్నారు.

కొన్నిటికే పండగ!



తొలి రోజు జీఎస్టీ వరాలపై మిశ్రమ ప్రభావం

పూర్తిస్థాయిలో అమల్లోకి రాని కొత్త శ్లాబులు

తగ్గని నిత్యావసర వస్తువుల ధరలు

కార్లు, బైకులపై మాత్రం భారీగా తగ్గింపు

వాహనాల కొనుగోళ్లతో షోరూమ్‌లు కళకళ

ఎలక్ట్రానిక్ వస్తువులపైనా ధరలు తగ్గింపు

మందులపై మాత్రం ఇంకా పాత ధరలే

కొత్త విధానంపై పాత స్టాక్ ప్రభావం

చాలాచోట్ల కనిపించని ధరల పట్టికలు


అనంతపురంలోని ఓ కార్ల షోరూమ్‌లో వాహనాల కొనుగోలు కోసం వచ్చిన కస్టమర్లు

ఆంధ్రజ్యోతి గ్రాండ్ రిపోర్ట్

'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెల్లడి

గతంలో నాలుగు శ్లాబులు(5, 12, 18, 28 శాతం)గా ఉన్న వస్తు సేవల పన్ను(జీఎస్టీ)ను రెండు శ్లాబులకు (5, 18%) కుదించారు. జీఎస్టీ తగ్గింపుతో చాలారకాల వస్తువుల ధరలు భారీగా తగ్గుతాయన్నారు. ప్రజలకు పెద్దఎత్తున లబ్ధి కలుగుతుందని ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఈ ఏడాది ముందుగానే దసరా, దీపావళి వచ్చాయని అన్నారు. తగ్గించిన జీఎస్టీ దేశ వ్యాప్తంగా సోమవారం అమల్లోకి వచ్చింది. మరి.. కేంద్రం చెప్పినట్టుగా వస్తువుల ధరలు భారీగా తగ్గాయా? ప్రజలకు పండగ వచ్చిందా? ఏయే వస్తువుల ధరలు తగ్గాయి? పాత, కొత్త ధరల్లో వ్యత్యాసం ఎంత? ఏయే వస్తువులకు ధరలు తగ్గలేదు? నిర్మలా సీతారామన్ ఆదేశించినట్టుగా షాపుల వద్ద తగ్గిన ధరలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేశారా?

తొలిరోజు జీఎస్టీ ప్రభావంపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న పరిశీలనాత్మక కథనం..

2లో

జీఎస్టీ జాతర!

అమల్లోకి పన్ను సంస్కరణలు

375కు పైగా వస్తువుల ధరల్లో తగ్గుదల

మధ్యతరగతి, సామాన్యులకు ఊరట

శరన్నవరాత్రుల ప్రారంభం, సెలవులతో పెద్దఎత్తున కొనుగోళ్లు చేపట్టిన ప్రజలు

దేశవ్యాప్తంగా కిటకిటలాడిన మాల్స్

ఢిల్లీలో మార్కెట్లను సందర్శించిన కేంద్ర మంత్రులు నిర్మల, నడ్డా, వైష్ణవ్


ఢిల్లీలోని ఓ దుకాణదారుతో నిర్మల

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు దేశవ్యాప్తంగా సోమవారం అమల్లోకి వచ్చింది. ఫలితంగా టూత్‌పేస్ట్ నుంచి కార్ల దాకా

మిగతా 2వ పేజీలో...



ఇక ఇంటింటా పొదుపు

పండగ

ఈసారి దసరాకు జీఎస్టీ సంస్కరణల జోష్

నవరాత్రుల ప్రారంభంలోనే శుభారంభం

దేశ ప్రజలకు 2.5 లక్షల కోట్ల ప్రయోజనం

రెండు శ్లాబులతో చౌకగా నిత్యావసరాల లభ్యత

పెరిగే పొదుపు సొంతింటి కలలకు పునాది

కొత్త వాహనం కొనొచ్చు..బయట తినొచ్చు

2 కుటుంబంతో విహారయాత్రలకు వెళ్లొచ్చు

రైతులు, మహిళలు,పేదలకు ప్రత్యక్ష, పరోక్ష లబ్ధి

'జీఎస్టీ బచత్ ఉత్సవ్' పేరిట ప్రధాని బహిరంగ లేఖ


13

'పీపీపీ' అంటే ప్రైవేటీకరణ కాదు!

ప్రభుత్వ ఆస్తులను ఎవరికీ అమ్మడం లేదు

2028కల్లా అన్ని మెడికల్ కాలేజీలూ పూర్తి

తన వారి కాంట్రాక్టులు పోతున్నాయనే జగన్ బాధ.. అందుకే అనవసర రాద్ధాంతం

ఇక విద్యాసంవత్సరం ప్రారంభంలోనే డీఎస్సీ

వైసీపీ ఎమ్మెల్యేలు జీతాల కోసం దొడ్డిదారిన దొంగ సంతకాలు చేసి పోతున్నారు

మీడియా చిట్‌చాట్‌లో మంత్రి లోకేశ్

ప్రభుత్వ పాఠశాలల వద్ద 'నో వేకెన్సీ' బోర్డులే లక్ష్యం.. శాసనసభలో లోకేశ్

మెగా డీఎస్సీ సభ 25న

8

పవన్‌కు లోకేశ్ ఆహ్వానం

కి'లేడీ' అరుణపై రౌడీషీట్!?

11

తాజాగా మళ్లీ కస్టడీలోకి తీసుకుని విచారణ

తనకేమీ తెలియదంటూ బుకాయింపు

నేడూ ప్రశ్నించనున్న కోవూరు పోలీసులు

రెండేళ్లలో ఏపీ బ్రాండ్ క్వాంటమ్ కంప్యూటర్

క్వాంటమ్ వ్యాలీగా రాష్ట్రం

టెక్నాలజీ అంటే నాకెంతో ఇష్టం 12

సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో నాతో పోటీ పడే సీఎం దేశంలో లేరు

ఈ మాట ఎస్ఎం కృష్ణ కూడా చెప్పేవారు

ఏఐతో ప్రజా సమస్యల పరిష్కారం

క్వాంటమ్ వ్యాలీతో ఏపీకి పేరొస్తుంది

సెమీ కండక్టర్స్‌లోకీ అడుగుపెడుతున్నాం

పదేళ్లలో ప్రపంచం ఎంతో మారుతుంది

జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో సీఎం

విశాఖలో 2 రోజుల సదస్సు ప్రారంభం


విశాఖలో ఈ-గవర్నెన్స్‌పై సదస్సును ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

దేశీయ ఉత్పత్తులనే కొనండి


రాష్ట్ర ప్రజలకు సీఎం పిలుపు.. భారత ఉత్పాదక రంగాన్ని బలోపేతం చేయండి

'బ్రాండ్ ఇండియా' అభివృద్ధి మన బాధ్యత.. ఇంటింటికీ జీఎస్టీ ప్రయోజనాలు

నెలరోజుల పాటు ప్రచారం.. ఐదుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటు 13

19న అన్ని జిల్లాల్లో దీపావళి సంబరాలు.. శాసనసభలో సీఎం చంద్రబాబు వెల్లడి

రైతు సంక్షేమానికే ప్రాధాన్యం: సీఎం



ఐటీ గురించి మాట్లాడినా నా ప్రతి నిర్ణయం వారి కోసమే

కష్ట సమయాల్లో అండగా ఉంటున్నాం.. ఉచితంగా సూక్ష్మపోషకాలు, 12

భూసార పరీక్షలు.. యూరియా వాడకం తగ్గిస్తే బస్తాకు రూ.800 ప్రోత్సాహకం

నెలలో ఒకరోజు ఎమ్మెల్యేల పొలం బాట.. వ్యవసాయంపై చర్చలో చంద్రబాబు

సొంత ప్రజలపైనే పాక్ బాంబుల దాడి

- కనీసం 30 మంది దుర్మరణం
- మృతుల్లో పిల్లలు, మహిళలు
- ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా ఓ గ్రామంపై 8 బాంబులు జారవేత
- పాక్ వైమానిక దళం నిర్వాకం

ఇస్లామాబాద్, సెప్టెంబరు 22: ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా పాకిస్థాన్ వైమానిక దళం జరిపిన బాంబుల దాడిలో ఆ దేశ ప్రజలు బలయ్యారు. ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో పాకిస్థాన్ వాయుసేనకు చెందిన జేఎఫ్-17 ఫైటర్ జెట్లు ఎనిమిది ఎల్ఎస్-6 బాంబులు జారవిడవడంతో కనీసం 30 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పిల్లలు, మహిళలు కూడా ఉన్నారు. సోమవారం వేకువజామున 2 గంటల సమయంలో తిరా లోయలోని మాత్రె దారా అనే గ్రామంపై దాడులు చేసింది. ఈ దాడుల్లో చాలామంది గాయపడ్డారని స్థానిక మీడియా వెల్లడించింది. కాగా క్షతగాత్రుల పరిస్థితి ఎలా ఉందన్నది తెలియరాలేదు. సంఘటనా స్థలంలో మరణించిన చిన్నారులు సహా పలువురి మృతదేహాలు పడి ఉన్న ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. అక్కడికి సహాయక బృందాలు చేరుకుని శిథిలాల కింద పడి ఉన్న మృతదేహాల కోసం గాలిస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. గతంలో కూడా ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా ఈ ప్రాంతంలో పాక్ జరిపిన వైమానిక దాడుల్లో చాలామంది అమాయకులు మరణించారు. డ్రోన్ల దాడులు చేసినపుడు దేశ పౌరుల ప్రాణాలు, ఆస్తులు కాపాడటానికి తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో పాకిస్థాన్ అధికారులు విఫలమయ్యారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ విమర్శించింది. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 605 ఉగ్రవాద ఘటనలు జరగగా, కనీసం 138 మంది పౌరులు, 79 మంది పోలీసులు చనిపోయారని పోలీసులు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌తో పరార్

పాకిస్థాన్, పీవోకేలోని 9ప్రధాన ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్రవాద సంస్థలు అక్కడి నుంచి తమ స్థావరాలు తరలించాయి. జైష్-ఎ-మొహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ సహా ఉగ్రవాద సంస్థలు అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లో పర్వత ప్రాంతాలతో కూడిన ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో స్థావరాలు ఏర్పాటు చేసుకున్నాయి.

అవి చైనా బాంబులు..

పాక్ వాయుసేన ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఎల్ఎస్-6 బాంబులపై చర్చ మొదలైంది. ఎందుకంటే ఎల్ఎస్-6 (లీఫ్) చైనాలో తయారైన బాంబులు. చైనా ఏరో స్పేస్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ (సీఏఎస్‌టీ) అనుబంధ సంస్థ లుయోయాంగ్ ఎలక్ట్రో ఆప్టిక్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఈవోటీడీసీ) వీటిని అభివృద్ధి చేసింది. ప్రెసిషన్ గైడెడ్ మ్యూనిషన్స్ (పీజీఎం) తరగతికి చెందిన దీన్ని 'థండర్ స్టోన్ బాంబ్' అని కూడా పిలుస్తారు. యుద్ధ విమానాల నుంచి ప్రయోగించే ఈ బాంబులు జీపీఎస్‌ను ఉపయోగించుకుని లక్ష్యాలను ఛేదిస్తాయి. ఎల్ఎస్-6 బాంబు పరిధి దాన్ని జారవిడిచే విమానం ఎత్తు, వేగంపై ఆధారపడి ఉంటుంది. 8 వేల మీటర్ల ఎత్తు నుంచి జారవిడిచినప్పుడు ఇది 40 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదిస్తుంది. 10వేల మీటర్ల ఎత్తు నుంచి వదిలినప్పుడు దీని పరిధి 60 కిలోమీటర్ల వరకూ ఉంటుంది.

లోకం తీరు



పోలీసు రికార్డుల్లో నిందితుల కుల ప్రస్తావన వద్దు

- వాహనాలపై కులాల స్టిక్కర్లు ఉంటే ఫైన్: యూపీ సర్కారు

లఖ్‌నవూ, సెప్టెంబరు 22: ఉత్తరప్రదేశ్‌లో కుల వివక్ష నిర్మూలన లక్ష్యంతో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం పలు చర్యలు ప్రారంభించింది. కుల ఆధారిత వివక్షను నిర్మూలించాలంటూ గత మంగళవారం (ఈ నెల 16)న అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలుకు నడుం బిగించింది. ఇందుకు సంబంధించి ఆదివారం రాత్రి జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. పోలీసు రికార్డులు, పబ్లిక్ నోటీసుల్లో ఇకపై కుల ప్రస్తావన ఉండకూడదు. నిందితుల కులాన్ని పోలీసు రికార్డుల్లో రాయకూడదు. కేసు మెమోలు, అరెస్టు పత్రాలు, పోలీసు స్టేషన్ బోర్డుల్లో వారి కులాలను ప్రస్తావించకూడదు. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్)లో కులం అన్న కాలాన్ని ఖాళీగా ఉంచనున్నారు. రికార్డుల్లో మాత్రం నిందితుడి తండ్రి పేరుతో పాటు తల్లి పేరును కూడా రాయాల్సి ఉంటుంది. వాహనాలపై కులాల పేర్లు, నినాదాలు రాస్తే మోటారు వాహనాల చట్టం ప్రకారం చలాన్లు విధిస్తారు. పట్టణాలు, గ్రామాల్లో కులాల పేర్లను సూచించే ప్రాంతాల బోర్డులు, చిహ్నాలను తొలగించాల్సి ఉంటుంది. రాజకీయ ఉద్దేశాలతో నిర్వహించే కుల సమావేశాలకు అనుమతి ఉండదు. వాటిని ప్రభుత్వం నిషేధించింది. కుల గౌరవాన్ని, కుల విద్వేషాన్ని ప్రేరేపిస్తూ సోషల్ మీడియాలో పెట్టే పోస్టులను నిశితంగా పర్యవేక్షిస్తుంది.

సైనిక చర్య లేకుండానే పీవోకే స్వాధీనం

- మొరాకో పర్యటనలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: ఎటువంటి సైనిక చర్యలు లేకుండానే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను భారత్ స్వాధీనం చేసుకుంటుందని, పీవోకే ప్రజలు 'మేము భారత్‌లో భాగమే' అని చెప్పుకొనే రోజు ఎంతో దూరంలో లేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. సోమవారం మొరాకోలో పర్యటించిన ఆయన ఆ దేశ రక్షణ మంత్రి అబ్దెల్లతిఫ్ లౌడియితో సమావేశం అయ్యారు. సైనిక సహకారానికి సంబంధించిన ఎంవోయూపై ఇరుదేశాల మంత్రులు సంతకాలు చేశారు. అనంతరం అక్కడి ప్రవాస భారతీయులతో ఆయన మాట్లాడారు. "పీవోకే ప్రజలు ప్రస్తుత పాలనతో సంతోషంగా లేరు. వారు స్వేచ్ఛను కోరుకుంటున్నారు. పీవోకే తనంతట తానుగా భారత్‌లో భాగమవుతుంది. మనం పీవోకే మీద దాడి చేసి దాన్ని స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం లేదు" అని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పీవోకేను తిరిగిపొందే అవకాశాన్ని కేంద్రప్రభుత్వం చేజార్చుకుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో రక్షణమంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

వచ్చే ఏడాది భారత్‌కు మరో ఎస్-400

మాస్కో, సెప్టెంబరు 22: భారత్‌తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు వచ్చే ఏడాదికి ఎస్-400 క్షిపణి వ్యవస్థల సరఫరా పూర్తవుతుందని రష్యా రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. 2018లో కుదిరిన ఒప్పందం మేరకు రష్యా ఐదు ఎస్-400 ట్రయంఫ్ గగనతల రక్షణ వ్యవస్థలను భారత్‌కు అందజేయాల్సి ఉంది. ఇప్పటికే నాలుగింటిని అప్పగించగా.. మరొకదానిని వచ్చే ఏడాది అందజేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు రక్షణశాఖ వర్గాలను ఉటంకిస్తూ రష్యా అధికార వార్తాసంస్థ టాస్ వెల్లడించింది. మొత్తం ఐదు ఎస్-400ల విలువ దాదాపు రూ.40 వేల కోట్లు. ఇటీవల పాకిస్థాన్‌తో తలెత్తిన ఉద్రిక్తతల సమయంలో (ఆపరేషన్ సిందూర్‌లో) ఎస్-400లు భారత్‌కు బలమైన దన్నుగా నిలిచిన విషయం తెలిసిందే. దీంతో, మరిన్ని ఎస్-400ల కొనుగోలుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. ఈ మేరకు రష్యాతో చర్చలు కూడా మొదలైనట్లు సమాచారం. మరోవైపు, అత్యాధునిక ఐదో తరం యుద్ధవిమానాలు ఎస్‌యూ-57లను భారత్‌కు సరఫరా చేయటమే గాక, వాటిని భారత్‌లో స్థానికంగా తయారుచేసే అంశంపై రష్యా ఒక ప్రతిపాదనను సమర్పించినట్లుగా టాస్ తెలిపింది.

హైకోర్టు జడ్జీల పనితీరుపై మదింపు అవసరం

- బెయిల్ పిటిషన్లకు వాయిదాలా: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: కొందరు హైకోర్టు న్యాయమూర్తుల పనితీరుపై సోమవారం సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 'కార్యభారం నిర్వహించలేక లక్ష్యాలను చేరుకోలేకపోతున్నార'ని వ్యాఖ్యానించింది. అందువల్ల వారి 'పనితీరును మదింపు వేయాల్సిన అవసరం ఉంద'ని అభిప్రాయపడింది. డెస్కులపై ఫైళ్లు పేరుకుపోకుండా చూసుకోవాలని హితవు చెప్పింది. ఓ క్రిమినల్ కేసులో తాము చేసిన అప్పీళ్లపై తుది వాదనలు విన్న ఝార్ఖండ్ హైకోర్టు ఏళ్ల తరబడి తీర్పును విలువరించడం లేదని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. కొందరు జడ్జీలు రాత్రింబవళ్లు కష్టపడి పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరిస్తున్నారని తెలిపింది. మరికొందరు లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని అభిప్రాయపడింది. రోజుకు ఒక్క క్రిమినల్ కేసునే విచారిస్తానని ఎవరైనా జడ్జి అంటే అర్థం చేసుకోవచ్చని, అదే బెయిల్ మంజూరు కేసులను కూడా రోజుకు ఒక్క దాన్నే విచారిస్తానంటే ఆత్మ పరిశీలన చేసుకోవాల్సి ఉంటుందని చెప్పింది. అందువల్లనే 'పనితీరు మదింపు' ఉండాలని అభిప్రాయపడింది.



విజయవాడ ఉత్సవ్ కార్యక్రమానికి వచ్చిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యను సత్కరిస్తున్న మంత్రులు లోకేశ్, సత్యకుమార్, దుర్గేశ్, పార్థసారథి

సాంస్కృతిక వైభవానికి ప్రతీక బెజవాడ ఉత్సవ్

- దేశవ్యాప్తంగా ఖ్యాతి ప్రతిధ్వనిస్తుంది: అయ్యన్న

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుందని శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మహోత్సవం ప్రపంచంలోనే అతి పెద్ద కార్నివాల్(పండుగ)గా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దే రామ్మోహన్, బోడే ప్రసాద్ సోమవారం అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో అయ్యన్నపాత్రుడును మర్యాదపూర్వకంగా కలిసి విజయవాడ ఉత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు పున్నమి ఘాట్, తుమ్మలపల్లి కళాక్షేత్రం, ఎంజీరోడ్, ఘంటసాల సంగీత కళాశాల, విజయవాడ ఎక్స్‌పో వేదికలపై జరిగే ఈ ఉత్సవం విజయవాడ సాంస్కృతిక గౌరవాన్ని మరింత పెంచుతాయన్నారు. అమ్మవారి దసరా శోభాయాత్రల నడుమ 'ఒక్క నగరం-ఒకే ఉత్సవం' అనే భావనతో వేడుకలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఇక ఇంటింటా పొదుపు పండుగ

ఈసారి దసరాకు జీఎస్టీ సంస్కరణల జోష్.. దేశ ప్రజలకు 2.5 లక్షల కోట్ల ప్రయోజనం

- జీఎస్టీ 2.0 దేశమంతా అమల్లోకి
- 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' పేరిట ప్రధాని బహిరంగ లేఖ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22 : జీఎస్టీ రేట్ల తగ్గింపుతో ప్రతి ఇంటా పొదుపు పెరిగి, వ్యాపారాలకు ఊతం లభించనుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రతి రాష్ట్రం ప్రగతిలో పరుగులు పెడుతుందని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచి దేశమంతా అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో 'జీఎస్టీ బచత్ ఉత్సవ్' పేరిట దేశ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. నవరాత్రుల తొలి రోజు బచత్ ఉత్సవ్‌లో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇటానగర్‌లోని ఇందిరాగాంధీ పార్కు ప్రాంతంలో తాను వ్యాపారులతో జరిపిన సంభాషణ ఫొటోలను 'ఎక్స్'లో ఆయన పంచుకున్నరు. "నవరాత్రులు మొదలయ్యాయి. ప్రతి కుటుంబానికీ ఈ సందర్భంగా మంచి జరగాలని కోరుకుంటున్నాను. దసరా ఈసారి మీ ఇంటికి రెట్టింపు ఆనందాలను తీసుకురానుంది. జీఎస్టీ 2.0 అమలులోకి రావడమే ఇందుకు కారణం. ప్రతి కుటుంబంలో పొదుపు పండుగ మొదలైంది. రైతులు, మహిళలు, యువత, పేదల నుంచి మధ్యతరగతి, వ్యాపారులు, చిన్న వర్తకుల (ఎమ్ఎస్ఎమ్ఈ)ల వరకు.. సమాజంలోని ప్రతి వర్గమూ ఈ సంస్కరణలతో ప్రత్యక్షంగానూ, పరోక్షంగా లబ్ధి పొందనుంది. ప్రతి ఒక్కరికీ వికాసం.. మదుపులో గొప్ప వృద్ధి...ప్రతి రాష్ట్రమూ, ప్రాంత అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్టీ రేట్లను రెండు శ్లాబులకు కుదించడం వల్ల సామాన్యులు వినియోగించే నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా తగ్గుతాయి" అని మోదీ తెలిపారు. ఆహార ఉత్పత్తులు, ఔషధాలు, సబ్బులు, టూత్‌పేస్టులు, బీమా ఇంకా మరి కొన్ని వస్తువులు, సేవలపై జీరో జీఎస్టీ లేదా ఐదుశాతం నామమాత్రం పన్ను మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. వంటింటి ఖర్చులు తగ్గడం మహిళలకు ఊరటని ఇస్తోందన్నారు. గత ఐదేళ్లలో 25 కోట్లమంది దారిద్ర్యరేఖ నుంచి బయటకు వచ్చారని ప్రధాని తెలిపారు. ఆదాయ పన్నుల్లో మినహాయింపుల వల్ల 12 లక్షల వార్షికాదాయంపై పన్ను చెల్లించాల్సిన పని లేదని, దీనివల్ల మధ్యతరగతి బలోపేతమైందని తెలిపారు. "ఆదాయ పన్నుల్లో మినహాయింపులు, జీఎస్టీ సంస్కరణల లబ్ధిని కూడా కలుపుకొంటే దేశ ప్రజలకు 2.5 లక్షల కోట్ల లబ్ధి చేకూరనుంది. ఇంటి ఖర్చుల తగ్గి, పొదుపు పెరగడం వల్ల సొంతిల్లు ఏర్పాటుచేసుకోవచ్చు. కొత్త వాహనాలు, వివిధ రకాల ఉపకరణాలు కొనుగోలు చేయవచ్చు. సరదాగా కుటుంబంతో బయటకు వెళ్లి ఇష్టమైన ఆహారం తీసుకోవచ్చు. విహారయాత్రలకు ప్రణాళికలు రచించవచ్చు" అని ప్రధాని తెలిపారు. జీఎస్టీ ప్రయాణం 2017లో మొదలయిందన్న ఆయన, సాలెగూడులా తయారైన బహు పన్నుల చెల్లింపు చిక్కుల నుంచి వ్యాపారాలకు, పౌరులకు దీనివల్ల ఊరట అందించిందన్నారు. "ఒక దేశం - ఒకే పన్ను". అనేది పన్నుల విధానాన్ని సరళతరం చేయడంతోపాటు ప్రజలకు గొప్ప ఊరట అందించింది. ఈ విధానం దేశాన్ని ఆర్థికంగా సమైక్యపరిచింది. కేంద్ర, రాష్ట్రాల సహకారంతో జీఎస్టీ మండలి ప్రజానుకూల విధానాలనెన్నింటినో రూపొందించింది. పొదుపును ప్రజల చేతుల్లో ఉంచింది" అని శ్లాఘించారు. ఇదంతా 'వికసిత్ భారత్-2047' లక్ష్యసాధనలో భాగంగా ఆత్మనిర్భర్ భారత్‌కు బాటలు వేస్తూ స్థానిక ఉత్పత్తి రంగానికి జీఎస్టీ ఊతం ఇవ్వనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మేడిన్ ఇండియా ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలను ఆయన కోరారు. "మేడిన్ ఇండియా ఉత్పత్తులనే విక్రయించాలని దుకాణదారులను, వ్యాపారులను కోరుతున్నాను. కొనేదీ, అమ్మేదీ స్వదేశీయే కావాలి. స్థానిక ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహిస్తూ, పెట్టుబడుల వాతావరణం ఏర్పడేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి" అని ప్రధాని మోదీ కోరారు.



ఇండీ కూటమి అసంతృప్తి: అశ్వినీ వైష్ణవ్

ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలు, పన్నుల తగ్గింపు పట్ల ఇండీ కూటమి సంతోషంగా లేదని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. యూపీఏ పదేళ్ల పాలనలో పన్నులు తగ్గించలేదని, సంస్కరణలు చేపట్టలేదని విమర్శించారు. యూపీఏ హయాంలో సిమెంట్‌పై 30% పన్ను వసూలు చేస్తే, ఇప్పుడు 18% ఉందని చెప్పారు. శానిటరీ ప్యాడ్లపై యూపీఏ ప్రభుత్వం 13 శాతం ట్యాక్స్ వేయగా, తమ ప్రభుత్వం పన్ను వసూలు చేయట్లేదని తెలిపారు. కాఫీపై పన్ను 30 నుంచి 5 శాతానికి తగ్గిందన్నారు.

జీఎస్టీ జాతర

(మొదటిపేజీ తరువాయి)

375కు పైగా వస్తువుల ధరలు తగ్గాయి. గతంలో 5, 12, 18, 28 శాతంగా ఉన్న పన్ను రేట్లను 5, 18 శాతానికి తగ్గించడంతో 99 శాతం నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయి. నిత్యావసర వస్తువుల తయారీ సంస్థలు, కార్లు, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ సంస్థ లు, ఫార్మా కంపెనీలు ధరలను తగ్గించేశాయి. జీఎస్టీ రేట్ల తగ్గింపునకు ఈ నెల 3న ఆమోదం తెలిపిన జీఎస్టీ మండలి.. ఈ నెల 22 (సోమవారం) నుంచి తగ్గింపు అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి కొనుగోళ్లను వాయిదా వేసుకున్న సామాన్య లు.. షాపింగ్ మాళ్ల బాట పట్టారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడం, విద్యా సంస్థలకు దస రా సెలవులు రావడంతో కుటంబసభ్యులతో కలిసి కొనుగోళ్లు చేపట్టారు. జీఎస్టీ పొదుపు ఉత్సవ ప్రచారంలో భాగంగా కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, జేపీ నడ్డా, అశ్వినీ వైష్ణవ్ తదితరులు ఢిల్లీలోని వ్యాపార సముదాయాలను సందర్శించారు. జీఎస్టీ సంస్కరణలు క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలవుతున్నాయా? లేదా? అని వినియోగదారులను ఆరా తీశారు. లక్ష్మీనగర్‌లో వ్యాపారులు, సామాన్య ప్రజానీకంతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల మాట్లాడారు. ఆమె ఓ స్టేషనరీ దుకాణానికి వెళ్లారు. జీఎస్టీ తగ్గింపుతో చాలా వస్తువుల ధరలు తగ్గాయని.. విద్యార్థులు, తల్లిదండ్రులకు లబ్ధి చేకూరుతుందని దుకాణ యజమాని కేంద్ర మంత్రితో చెప్పారు. ప్రధాని పిలుపు మేరకు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. అమర్‌కాలనీలో వ్యాపారులతో సమావేశమైన జేపీ నడ్డా.. జీఎస్టీ సంస్కరణలు దేశ ప్రజలకు అందేలా చూడాలని కోరారు. నిత్యావసరాల్లో 99 శాతం వస్తువులపై పన్నులు తగ్గాయని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. కాగా, మధ్యతరగతి వర్గాలు దసరా, దీపావళికి భారీగా కొనుగోళ్లు చేపడతారని.. ఫలితంగా ప్రభుత్వానికి పన్ను రాబడి పెరుగుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ప్రింటింగ్ ప్రెస్‌లో దుర్గాపూజ

పాల్గొన్న డైరెక్టర్ వేమూరి ఆదిత్య దంపతులు

బాలానగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా బాలానగర్ డివిజన్, రాజీవ్‌గాంధీ నగర్‌లోని 'ఆంధ్రజ్యోతి' ప్రింటింగ్ ప్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, ఆయన సతీమణి, వైస్ ప్రెసిడెంట్ శ్రుతికీర్తితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల కోసం వచ్చిన డైరెక్టర్ దంపతులను ప్రచురణకర్త శేషగిరిరావు, ప్రింటింగ్ ప్రెస్ డీజీఎంలు రాంప్రసాద్, చిన బాబు, చౌదరి, సిబ్బందితో కలిసి సాదరంగా ఆహ్వానించారు. ఈ పూజల్లో ప్రింటింగ్ స్టోర్స్ మేనేజర్ వైసీ నర్సింహా, అసిస్టెంట్ మేనేజర్లు భానుప్రకాశ్, హరికృష్ణ, మాధవరావు, ఆర్ఎం అనిల్‌కుమార్, సిబ్బంది కే రాజు, సింహాచలం, సురేశ్, బార్గవ, నిర్మల యాదవమ్మ, సాంబ, కిషోర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పూజల అనంతరం ప్రింటింగ్ ప్రెస్ సిబ్బందితో 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య, సతీమణి శ్రుతికీర్తి

విశ్రాంత ఐఏఎస్ అధికారి కేఎస్ శర్మ కన్నుమూత

- ప్రసార భారతి సీఈవోగా సేవలు



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్రసార భారతి సీఈవోగా సేవలు అందించిన కంభంపాటి సుబ్రహ్మణ్య శర్మ (80) ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ శనివారం రాత్రి బంజారాహిల్స్‌లోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. పరిపాలనా రంగంలో కేఎస్ శర్మగా సుపరిచితులైన ఆయన 1968 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టరుగా, కేంద్ర విద్యా శాఖ కార్యదర్శిగా సేవలందించారు. నవోదయ విద్యాలయాల స్థాపనలో ముఖ్య పాత్ర పోషించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కార్యాలయం ముఖ్య అధికారిగానూ పనిచేశారు. ప్రసార భారతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, దూరదర్శన్ డైరెక్టర్ జనరల్‌గా పలు సంస్కరణలకు నాంది పలికారు. దూరదర్శన్ డైరెక్ట్ టు హోమ్ సేవలు శర్మ సారథ్యంలోనే ప్రారంభమయ్యాయి. శ్రీవేంకటేశ్వర భక్తి చానల్ (ఎస్వీబీసీ) వ్యవస్థాపక సీఈవోగా బాధ్యతలు నిర్వర్తించారు. సోమవారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో శర్మ అంత్యక్రియలు పూర్తయ్యాయి.

ఆ భారతీ రెడ్డి వేరు

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భారీ మద్యం కుంభకోణాన్ని దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వైఎస్ అనిల్ రెడ్డి సంస్థలు, నివాసాలలో ఇటీవల సోదాలు చేసింది. రెండు కంపెనీలలో డైరెక్టర్‌గా ఉండి వైదొలగిన వైఎస్ భారతీ రెడ్డి మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి బంధువు అని తేలింది. ఆ రోజు లభించిన సమాచారంలోని డైరెక్టర్ల జాబితాలో 'వైఎస్ భారతీ రెడ్డి' అని పేరు ఉండటంతో 'ఆంధ్రజ్యోతి'లో పొరపాటున జగన్ సతీమణి వైఎస్ భారతీ రెడ్డిగా ప్రచురితమైంది.

కొన్నిటికే.. 'పండగ'!

తొలిరోజు జీఎస్టీ వరాలపై మిశ్రమ ప్రభావం

గ్రేటర్ విశాఖలో..

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా తీసుకువచ్చిన నూతన శ్లాబుల అమలు విశాఖలో అంతంతమాత్రంగానే ఉంది. తగ్గిన ధరలతో కూడిన బోర్డులను ఎక్కడా ఏర్పాటు చేయలేదు. కొద్దిచోట్ల మాత్రం 'తగ్గించిన జీఎస్‌టీ రేట్లు వర్తింపజేస్తున్నాం' అంటూ బోర్డులు పెట్టారు కానీ ధరల వివరాలేవీ కనిపించలేదు. పాలు, పాల ఉత్పత్తులు ధరలు మినహా నిత్యావసర సరుకుల ధరలను ఎక్కడా తగ్గించలేదు. కొన్ని రిటైల్ స్టోర్లు, మాల్స్‌లో జీఎస్టీ శ్లాబులు తగ్గించినట్టు బోర్డులు పెట్టినా, గతంలో ఉన్న ధరలకే విక్రయిస్తున్నారు. మందుల ధరలను కూడా జీఎస్టీ శ్లాబుల్లో మార్పులు చేసి గతంలో విక్రయించిన రేట్లకే అమ్మకాలు సాగిస్తున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాల ధరలు మాత్రం తగ్గాయి. కార్ల ధరలు రూ.60 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు తగ్గించి విక్రయాలు సాగిస్తున్నట్టు చెబుతున్నారు. అలాగే ద్విచక్ర వాహనాల ధరలు రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకు తగ్గినట్టు షోరూమ్ నిర్వాహకులు అమలు చేస్తున్నారు. ఏసీ, టీవీ, డిష్ వాషర్స్ ధరలు తగ్గాయి. ఇప్పటివరకు 28 శాతం జీఎస్టీలో ఉన్న ఈ వస్తువులను ప్రస్తుతం 18 శాతం జీఎస్టీలోకి మార్చి విక్రయాలు సాగిస్తున్నారు. ఆయా వస్తువులపై రూ.2500 నుంచి రూ.5 వేలు వరకు తగ్గిస్తున్నారు. రోగులకు మేలు చేసే ఉద్దేశంతో కొన్నిరకాల మందులపై 12 శాతం ఉన్న జీఎస్టీని కేంద్రం 5 శాతానికి తగ్గించింది. అయితే విశాఖ నగర పరిధిలోని మెడికల్ స్టోర్స్ నిర్వాహకులు మాత్రం ఈ శ్లాబుల అమలును పట్టించుకోవడం లేదు. మధురవాడ ప్రాంతానికి చెందిన ఒకరు సోమవారం షుగర్, బీపీకి సంబంధించిన మందులను కొనుగోలు చేశారు. రూ.818 బిల్లు చేతిలో పెట్టారు. రెండు నెలల క్రితం అంతే మొత్తం బిల్లు చెల్లించారు. బిల్లులో జీఎస్టీ శ్లాబులను 12 నుంచి 5 శాతానికి తగ్గించినట్టు చూపినప్పటికీ, డిస్కౌంట్లను సరిచేసి చేసి పాత రేట్లకు విక్రయించారు. ఈ మెడికల్ స్టోర్ జనరిక్ కావడం గమనార్హం. ఇతర మెడికల్ స్టోర్స్‌లోనూ ఇదే పరిస్థితి.

రాయలసీమలో..

జీఎస్టీ సంస్కరణల అమలుతో అనంతపురం జిల్లాలో ద్విచక్ర వాహనాలు, కార్ల షోరూమ్‌లు కిటకిటలాడాయి. బైక్‌లపై రూ.7 వేల నుంచి రూ.15 వేల వరకు, కార్లపై రూ.50 వేల నుంచి రూ.1.90 లక్షల వరకు ధరల తగ్గుదల కనిపించింది. దీంతో కొందరు వాహనాలను బుక్ చేసుకోగా, మరికొందరు నచ్చిన బైక్, కార్లను డెలివరీ తీసుకున్నారు. అనంతపురం నగరంలోని ఒక్కో బైక్ షోరూమ్‌లో సోమవారం ఒక్కరోజే ఆరు నుంచి పది బైక్‌లను బుక్ చేసుకున్నారు. చాలా షోరూమ్‌లలో 5 బైక్‌ల వరకూ డెలివరీ తీసుకున్నారు. కార్ల షోరూమ్‌లలో 5 నుంచి 10 వరకు బుక్ అయ్యాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల వినియోగదారులు వివిధ రకాల వస్తువులు, వాహనాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. టీవీలపై జీఎస్టీ తగ్గించడంతో విక్రయాలు జోరందుకున్నాయి. ఇక బొలెరో వాహనంపై రూ.95 వేలు తగ్గింది. కడప జిల్లాలో వాహనాలు, టీవీలు, ఎలక్ట్రానిక్స్‌పై జీఎస్టీ తగ్గుదల కనిపించింది. కాగా పాలు, కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరల్లో ఎలాంటి మార్పు కనిపించలేదు. వ్యాపారులు పాత రేట్లకే సరుకులు అమ్ముతున్నారు. వ్యాపారులను ప్రశ్నించగా.. పాత జీఎస్టీ చెల్లించి సరుకులు తీసుకొచ్చామని.. కొత్త సరుకు వచ్చేంత వరకు పాత రేట్లే కొనసాగుతాయని చెప్పారు. అన్నమయ్య జిల్లాలో దాదాపు అన్ని రకాల దుకాణాల్లోనూ ధరల పట్టికలు అందుబాటులో లేవు. తిరుపతి జిల్లాలో తొలిరోజు పెద్దగా ప్రభావం కనిపించలేదు. వ్యాపార సంస్థలు పన్ను తగ్గింపు, ధరల మార్పునకు సంబంధించి సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్‌లో బిజీగా ఉన్నాయి. 90% అమ్మకాలు పాత ధరలతోనే జరిగాయి. ప్రొవిజన్స్ స్టోర్స్, సూపర్ మార్కెట్లు, చిల్లర దుకాణాల వరకూ ఎక్కడా తగ్గించిన ధరలకు విక్రయాలు జరగలేదు. అయితే మెడికల్ షాపుల్లో మాత్రం మందులు తగ్గించిన ధరలతో విక్రయించారు.

కోస్తాంధ్రలో..

జీఎస్టీ సంస్కరణల ప్రభావం నెల్లూరు జిల్లాలో పూర్తిస్థాయిలో కనిపించడం లేదు. జీఎస్టీ ఫలాలు సామాన్యులకు అందేందుకు కొంత సమయం పట్టేలా కనిపిస్తోంది. ప్రధానంగా నిత్యావసరాల విషయంలో ఈ పరిస్థితి ఉంది. సూపర్ మార్కెట్లలో నిత్యావసరాల ధరలు తగ్గినా సాధారణ దుకాణాల్లో పాత సరుకు పేరుతో పాత ధరనే కొనసాగిస్తున్నారు. మరో పది రోజుల వరకూ సరుకు ఉంటుందని, పాత జీఎస్టీ ప్రకారం ఆ సరుకును కొన్నందున, అదే ధరకు అమ్మకపోతే నష్టం వస్తుందని రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు. నెల్లూరులో చాలా చోట్ల వ్యాపారులు తగ్గించిన ధరల బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఏలూరు జిల్లాలో నిత్యావసరాలు, పాల ప్యాకెట్ల ధరలు తగ్గలేదు. కందిపప్పు రూ.110, పెసరపప్పు రూ.110, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.150, పామాయిల్ రూ.115, బెల్లం రూ.60, వెల్లుల్లి పాయలు రూ.150, చింతపండు రూ.300, మినపగుళ్లు రూ.110, పొట్టు పప్పు రూ.90 పాత ధరలకే విక్రయాలు చేశారు. ఎలక్ట్రికల్ ఉపకరణాల ధరలు తగ్గాయి. 2 నుంచి 5 వేల వరకు కొనుగోలుదారులకు లబ్ధి కలుగుతోంది. ఏలూరు నగరంలో పలు దుకాణాల్లో అమ్మకాలు పుంజుకున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఏసీలు, డిష్‌వాష్, వాషింగ్ మెషిన్ల ధరలు తగ్గాయి. వాహనాల షోరూమ్‌లు కొనుగోలుదారులతో సందడి నెలకొంది. జీఎస్టీ తగ్గింపు ప్రభావం తూర్పుగోదావరి జిల్లాలో తొలిరోజు అంతగా కనిపించలేదు. వ్యాపారులు జీఎస్టీ తగ్గింపు బోర్డులు పెట్టలేదు. విజయవాడలో వాహనాలు, ఎలక్ట్రానిక్స్ పరికరాల ధరలు భారీగా తగ్గాయి. తగ్గించిన ధరలు అందుబాటులోకి వచ్చాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ ధరలు రూ.1,76,625 నుంచి రూ.1,62,161కు, రూ.1,49,900 నుంచి 1,37,640కు తగ్గాయి.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

'గుంటూరు మిర్చి'పై దసరా ఎఫెక్ట్!

- పశ్చిమ బెంగాల్‌లో ఉత్సవాల కారణంగా లారీల రాకపోకలపై నిషేధం
- మిర్చియార్డు నుంచి నిలిచిపోయిన ఎగుమతులు
- 50శాతానికి పడిపోయిన అమ్మకాలు
- ధర కూడా క్వింటాకు రూ.800 వరకు తగ్గుదల

గుంటూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు యార్డులో మిర్చి అమ్మకాలపై దసరా నవరాత్రుల ప్రభావం పడింది. ఒక్కసారిగా 50 శాతం అమ్మకాలు తగ్గాయి. పశ్చిమ బంగాల్‌లో దుర్గా పూజ కారణంగా పది రోజులకు పైగా బంగ్లాదేశ్ వెళ్లే లారీల రాకపోకలను నిషేధించడమేన ఇందుకు ప్రధాన కారణమని మిర్చి ట్రేడర్లు చెబుతున్నారు. ఈ పది రోజులు రోజుకు 25 వేల టిక్కీల వరకు విక్రయం కూడా జరగడం కష్టమేనని, అక్టోబరు ఐదో తేదీ తర్వాతనే మళ్లీ అమ్మకాలు ఊపందుకొనే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఎగుమతులు నిలిచిన కారణంగా మిర్చి ధర కూడా క్వింటాల్ రూ.15 వేల లోపునకు పడిపోయింది. మరోవైపు ఈ వారం తర్వాత దసరా మామూళ్ల హడావుడిలో పడి హమాలీలు యార్డుకు వచ్చే పరిస్థితి ఉండదు. ఆ ప్రభావం కొంత ఈ సోమవారమే కనిపించింది. కాగా, సాధారణంగా వేసవి సెలవుల అనంతరం మిర్చియార్డులో ట్రేడింగ్ ప్రారంభమైన తర్వాత నిత్యం 50 వేల టిక్కీల వరకు అమ్మకాలు జరుగుతుంటాయి. రేటు కూడా నిలబడటంతో పాటు క్వింటాల్‌కు ఒక దశలో రూ.16 వేలకు చేరుకున్న పరిస్థితులు ఉండేవి. దాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ అక్టోబరు, నవంబరు నెలల్లో రేటు క్వింటాల్‌కు రూ.20 వేలు దాటుతుందని అంతా ఆశలు పెట్టుకొన్నారు. ఈ కారణంగా యార్డుకు ఒకేసారి సరుకు తీసుకురాకుండా ఆచితూచి తెచ్చి విక్రయిస్తున్నారు. అయితే దసరా ఎఫెక్ట్ మిర్చి అమ్మకాలపై చూపించడం మొదలు పెట్టింది. సాధారణం ఆదివారం సెలవుదినం తర్వాత రోజూ వచ్చే 50 వేల టిక్కీల కంటే కాస్త ఎక్కువ సంఖ్యలోనే రైతులు తీసుకొస్తారు. కానీ, సోమవారం 28 వేల పైచిలుకు టిక్కీలు మాత్రమే విక్రయానికి వచ్చాయి. అంటే దాదాపు సగానికి సగం తగ్గడంతో వచ్చే వారంతం వరకు మార్కెట్ ఇలానే ఉండే అవకాశం ఉందని మిర్చి దిగుమతి వ్యాపారస్థులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. తేజ వంటి వెరైటీలకు సోమవారం క్వింటాల్ రూ.14,800 మాత్రమే లభించింది. దీనిని పరిగణనలోకి తీసుకొంటే దాదాపుగా క్వింటాల్‌కు రూ.800 వరకు ధర తగ్గిందన్నారు. పండగ తర్వాతనే మళ్లీ అమ్మకాలు ఊపందుకొనే అవకాశాలుంటాయని వివరించారు.

అగ్రి సెట్ ఫలితాలు విడుదల

లాంఫాం(తాడికొండ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రిసెట్ ఫలితాలను వీసీ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి సోమవారం విడుదల చేశారు. అగ్రి సెట్‌కు 844 మంది రిజిస్టర్ చేసుకోగా 813 మంది హజరయ్యారని, 753 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ నుంచి ర్యాంక్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చుని సూచించారు.



జీఎస్టీ గురించి వివరిస్తూ వినియోగదారునికి గులాబీ ఇస్తున్న కేంద్ర మంత్రి జితేంద్రసింగ్. చిత్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

జీఎస్టీ తగ్గింపు మధురమైన కానుక

- కేంద్ర మంత్రి జితేంద్రసింగ్

అక్కయ్యపాలెం(విశాఖపట్నం), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన మధురమైన కానుకని కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ అన్నారు. జీఎస్టీపై విశాఖలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఆయన... సామాన్య వినియోగదారులతో పాటు దుకాణాల యజమానులనూ కలసి ముచ్చటించారు. దసరా, దీపావళికి గొప్ప బహుమతిగా సరళీకృత జీఎస్టీని అభివర్ణించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ... అందరూ స్వదేశీ వస్తువులు వినియోగించాలని పిలుపునిచ్చారు.

డీఎస్పీ కార్యాలయం ఎదుట జేసీ నిరసన

- పెద్దారెడ్డిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం

తాడిపత్రి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి నిరసనకు దిగారు. సోమవారం తాడిపత్రిలోని డీఎస్పీ కార్యాలయానికి వెళ్లిన ఆయన, ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరిని ఈ విషయమై ప్రశ్నించారు. కార్యాలయం లోపలికి వస్తే అన్నీ చెబుతానని ఏఎస్పీ అనగా, చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తేనే లోపలికి వస్తానని ప్రభాకర్ రెడ్డి అన్నారు. దీంతో ఏఎస్పీ లోపలికి వెళ్లిపోయారు. ఆయన తీరుకు నిరసనగా ప్రభాకర్ రెడ్డి అక్కడే కుర్చీలో బైఠాయించారు. ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో గుత్తి రోడ్డులోని అశోక్ పిల్లర్ వద్దకు వెళ్లి నిరసన కొనసాగించారు. మంచం తెప్పించుకుని అక్కడే పడుకున్నారు. సాయంత్రం 4:30కు ఎస్పీ జగదీశ్‌తో సీఐలు మాట్లాడి, రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

ఓఎన్‌జీసీకి పెట్రోలియం మైనింగ్ లీజు

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పరిధిలో ఓఎన్‌జీసీకి పెట్రోలియం మైనింగ్ లీజు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండపేట మండలంలోని 1బీ-కేజీ బేసిన్‌లో 20 చదరపు కిలోమీటర్ల మేర ప్రభుత్వం లీజు మంజూరు చేసింది. లీజు కాలాన్ని పదహారున్నర ఏళ్లుగా నిర్ణయించినట్లు గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఉత్తర్వుల్లో (జీఓ 177) పేర్కొన్నారు. లీజు కాలపరిమితి 2024 జూన్ 1 నుంచి 2040 డిసెంబరు 31 వరకు అమల్లో ఉంటుందని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వీసా పిడుగు

ప్రధాని మోదీకి 75వ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేసిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంతలోనే ఇంతపనిచేస్తారని ఎవరూ ఊహించలేదు. భారత్ చేజారిపోయిందని ఇటీవలే నాలుక కరుచుకున్నట్టుగా కనిపించిన ట్రంప్, పక్షం రోజుల క్రితమే ఉభయదేశాల సంబంధాలకు ఏ ఢోకా లేదన్నారు. భారత్–అమెరికా సహజ భాగస్వాములంటూ మోదీ కూడా స్పందించారు. పుట్టినరోజు సందర్భంగా ఇరువురు నేతల మధ్యా సాగిన చక్కని సంభాషణతో ఘర్షణవాతావరణం ఇక పూర్తిగా ఉపశమించినట్టేనని, రెండుదేశాల సత్సంబంధాలకు మార్గం సుగమమైందని అంతా అనుకున్నారు. పైగా, నిలిచిపోయిన వాణిజ్యచర్చలు తిరిగి ఆరంభమై, అవి చక్కగా, సవ్యంగా సాగాయని ఇరుదేశాలు ప్రకటించిన నాడే వీరిద్దరూ ఒకరినొకరు మిత్రమా మిత్రమా అంటూ పలుకరించుకోవడం ఉపశమనాన్ని ఇచ్చింది. రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు శిక్షగా భారత్‌ను రెట్టింపు సుంకాలతో ట్రంప్ బాధించిన దాదాపు నెల తరువాత నేరుగా జరిగిన సంభాషణ ఇది. ఉభయదేశాల భాగస్వామ్యాన్ని సరికొత్త ఎత్తులకు తీసుకుపోదామని నాయకులిద్దరూ సంకల్పం చెప్పుకున్న ఆ టెలిఫోన్ కాల్ ముగియగానే, హెచ్1బి వీసా ఫీజు లక్షడాలర్లకు పెంచి ట్రంప్ ఇంత దెబ్బకొడతారనుకోలేదు.

ట్రంప్‌తో సుదీర్ఘకాలం ఘర్షణ మన ఐటీరంగానికీ, సాంకేతిక నిపుణులకు ముప్పుతేవచ్చునని నిపుణులు ముందుగానే ఊహించారు, హెచ్చరించారు. ఆత్మనిర్భరతే ఈ బాధలన్నింటికీ పరిష్కారమని, కానీ, స్వాతంత్ర్యానంతరం దేశాన్ని ఏలిన కాంగ్రెస్ ఆ దిశగా ప్రయత్నించకుండా ఇంకా ఇతరదేశాలమీదే మనం ఆధారపడేట్టుగా చేసిందని సొంతగడ్డ గుజరాత్‌లో వ్యాఖ్యానించి తప్పంతా కాంగ్రెస్‌మీదకు తోసేశారు మోదీ. అన్నిరంగాల్లో దేశాన్ని సొంతకాళ్ళమీద నిలబెట్టి, ఆర్థిక సంస్కరణలతో, అత్యున్నత సాంకేతిక విద్యతో నిపుణులను తయారుచేసింది కాంగ్రెసేనని ఆ పార్టీ నాయకులు గుర్తుచేస్తున్నారు. తమ మేడిన్ ఇండియాకు, మోదీ మేకిన్ ఇండియాకు మధ్య తేడా వారు గుర్తుచేస్తున్నారు. అత్యంత ప్రతిభగలవారిని దేశంలోకి రాకుండా నిలువరించాలన్న ట్రంప్ ప్రయత్నం అమెరికన్ టెక్ కంపెనీలకు ప్రయోజనం చేకూర్చదన్న విశ్లేషణలను అటుంచితే, పుట్టిన రోజు శుభాకాంక్షలు అందించిన వెంటనే ఈ నిర్ణయాన్ని కూడా ప్రకటించి నరేంద్రమోదీకి అమెరికా అధ్యక్షుడు పెద్దసవాల్ విసిరారు. కప్పం కట్టలేని స్థితిలోకి అమెరికన్ కంపెనీలను నెట్టి, వాటంతట అవే భారత సాంకేతిక నిపుణులను కాలదన్నేట్టు చేయాలనుకుంటున్నారు ఆయన. ఉపరితలంలో వలసల నియంత్రణగా కనిపిస్తున్న ఆర్థిక ఆంక్షలు ఇవి. వైట్ కాలర్ ఉద్యోగులను దెబ్బతీసే, భారతదేశ మధ్యతరగతి కలలను విచ్ఛిన్నం చేసే ఈ నిర్ణయం ద్వారా మోదీమీద స్వదేశంలో వ్యతిరేకత పెంచే ప్రయత్నం ఇది. రష్యా, చైనా అధ్యక్షులతో ఆప్తమిత్రుడు మోదీ చేయి కలిపి, చిరునవ్వులు చిందించిన ఆ దృశ్యం ట్రంప్‌కు బొత్తిగా నచ్చలేదు.

బీజేపీ అస్మదీయ పెట్టుబడిదారులు రష్యా క్రూడ్‌ను శుద్ధిచేసి, విదేశాలకు అమ్ముకొని వేలకోట్లు సంపాదిస్తున్నారని, ముడి చమురు అమ్మిన సొమ్ముతో ఉక్రెయిన్ మీద వ్లాదిమిర్ పుతిన్ భీకరయుద్ధం చేస్తున్నారని ట్రంప్ వాదన. చమురు కొంటున్నందుకు శిక్షగా విధించిన అదనపు పాతికశాతం సుంకం దెబ్బకు మనదేశంలోని చాలా రంగాలు కుదేలవుతున్న నేపథ్యంలో, జీఎస్టీ సంస్కరణలతో ఆ సమ్మెటపోటు నేరుగా తగలకుండా మోదీ ప్రభుత్వం లేపనం పూసే ప్రయత్నం చేసింది. కానీ, సాగుతున్న ఆ వాణిజ్యయుద్ధం సరికొత్తగా మరిన్ని రంగాలకు విస్తరిస్తూండటం ఆందోళన కలిగిస్తోంది. పొరుగుదేశాల్లో నిరుద్యోగయువత తిరుగుబాట్లకు పాల్పడుతున్న దృశ్యాలు చూస్తున్నాం. భారతదేశ ఐటీరంగం, సాంకేతిక నిపుణులు అమెరికా ఆర్థికవ్యవస్థకు ఎంత మేలు చేకూర్చుతున్నారో, ఎలా వెన్నుదన్నుగా ఉన్నారో, ఆ దేశ ఎదుగుదలలో వారి పాత్ర ఏమిటో వివరించిచెప్పాలే తప్ప ట్రంప్‌ను ఆడిపోసుకోవడంవల్ల ప్రయోజనం లేదని కొందరి సలహా. అమెరికా ఆర్థిక ప్రయోజనాల కోసం కాక, ఆ ముసుగులో తన రాజకీయ ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంగా ట్రంప్ నిర్ణయాలు చేస్తాడనీ, తదనుగుణంగా ఆయన వాదనలు, డేటా తయారవుతాయన్నది తెలిసిందే. అటువంటి వ్యక్తి చెవిలో శంఖం ఊది ప్రయోజనం లేదు. న్యాయస్థానాల్లో అమీతుమీ తేలేవరకూ ట్రంప్ సృష్టించే ఈ తరహా వివాదాలను భరించాల్సిందే.

కులంలో కర్ణాటక రాగం!

దేంట్లోనైనా ఒక అంగీకారానికి రావచ్చు కానీ కులాల లెక్కల్లో దాన్ని ఒకపట్టాన సాధించలేం. దేశంలో కులాల లెక్కలు మొదలైన నాటినుంచీ ఈ సమస్య ఉంది. కులాల సంఖ్యను బట్టి పదవులూ, ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం కల్పించటం మొదలైన తర్వాత అదింకా ఎక్కువైంది. తమ ప్రాతినిధ్యం ఇంకా పెరగాలని డిమాండు చేసే ప్రతి కులమూ ఏదో ఒక దశలో అధికారిక లెక్కలతో విభేదించి భిన్నగళం వినిపించటం అన్ని చోట్లా జరిగింది. దీనికి భిన్నంగా ప్రాతినిధ్యం లేని కులాలు తమ సంఖ్యాబలాల గురించి అధికార నివేదికలతో విభేదించింది చాలా తక్కువ. ప్రయోజనాలు లేని దగ్గర వివాదాలు అంతగా రాజుకోవు. వాటాలు పెరగాలన్న పట్టుదలలు ఉన్నచోటే లెక్కలకు ప్రాధాన్యం ఏర్పడుతుంది. ఉన్న వాటాలు కోల్పోకూడదనే ఆరాటం ఉన్నచోటే నివేదికలపై అసంతృప్తులు వ్యక్తమవుతాయి. వీటిని సమాధానపరచి ఏకాభిప్రాయాన్ని సాధించటం కత్తిమీద సామే! కులాల లెక్కల ఆధారంగా అధికారంలో వాటాలను మార్చటమే ప్రధాన లక్ష్యంగా ప్రకటించుకున్న కాంగ్రెస్ పార్టీకి అంతా అనుకున్నట్లు సాగుతోందని చెప్పే పరిస్థితి కనపడటం లేదు.

తెలంగాణలో కులగణనను చేపట్టి, బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ చట్టాలు చేసి, వాటిని అమల్లోకి తీసుకురావటానికి ఎన్ని వ్యూహాలు అనుసరిస్తున్నా అవసరమైన ఆమోదాలు లభించటం లేదు. పకడ్బందీ కులగణనతో వెనుకబాటుతనాన్ని ఖచ్చితంగా నిరూపించే సమాచారాన్ని సేకరించామనీ, సుప్రీంకోర్టు నుంచి ఎటువంటి అభ్యంతరాలు వచ్చే అవకాశం లేదంటూ పదునుగా ఎన్ని వాదనలు చేస్తున్నా కేంద్రం వాటిని పరిగణనలోకి తీసుకుంటోందన్న సంకేతాలూ రావటం లేదు.

తెలంగాణలో పరిస్థితి ఇలా ఉంటే, ఇప్పుడు మరో కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన కర్ణాటకలో కులగణనపై ఆరంభంలోనే వివాదాలు ముసురుకుంటున్నాయి. కోర్టుల్లో కేసులూ పడ్డాయి. తెలంగాణలో లేని విచిత్ర పరిస్థితి కర్ణాటకలో నెలకొంది. సుదీర్ఘకాలంగా రాజకీయ అధికారాన్ని చలాయిస్తున్న రెడ్డి, వెలమ కులాలకు తెలంగాణలో రిజర్వేషన్లు లేవు. కానీ కర్ణాటకలో అలా కాదు. అక్కడ రాజకీయపెత్తనం చలాయిస్తున్న లింగాయత్, వక్కలిగ కులాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉన్నాయి. సొంత పార్టీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన కులగణనలోనే తమ జనాభాను తక్కువ చూపించారని ఈ రెండు కులాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయటంతో కొత్తగా సర్వే చేయాల్సిన పరిస్థితి అక్కడ వచ్చింది. మంత్రివర్గం ఆమోదించిన సర్వే నివేదికనే పక్కన పడేయాల్సిన స్థాయిలో ఒత్తిళ్లు రావటం కులాల లెక్కల చుట్టూ ఆవరించిన రాజకీయాలకు నిదర్శనం. ఉన్న వాటాను కోల్పోకూడదనే పట్టుదలే ఈ రాజకీయాల్లో ప్రధానంగా కనపడుతుంది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 2013లో సామాజిక, ఆర్థిక, విద్యా సర్వేను కాంతరాజ్ సారథ్యంలోని బీసీ కమిషన్‌కు (2014లో) అప్పగించారు. ప్రతి ఇంటికీ తిరిగి సమాచారాన్ని నమోదుచేశారు. అప్పటికి కర్ణాటకలో చేసిన సర్వేలన్నిటిలోకి కాంతరాజ్ కమిషన్ చేసినదే సమగ్రమైంది. రిపోర్టు సిద్ధమైనా దాన్ని ఆమోదించటానికీ, అసెంబ్లీలో ప్రవేశపెట్టటానికీ రాజకీయంగా సంసిద్ధత లేకపోవటంతో అది వెలుగులోకి రాకుండానే ఉండిపోయింది. పైగా కమిషన్ సభ్య కార్యదర్శిగా ఉన్న అధికారి దానిపై సంతకం చేయటానికీ నిరాకరించారు. పైనుంచి ఆదేశాలేకుండా అది జరిగే అవకాశమే లేదు. ఆ తర్వాత జయప్రకాశ్ హెగ్డే (2020–24) నేతృత్వంలోని బీసీ కమిషన్ ఆ నివేదికకు తుదిరూపం ఇచ్చి, సమాచారం మొత్తాన్ని క్రమపద్ధతిలో పెట్టి, పునఃపరిశీలన చేసి ప్రభుత్వానికి సమర్పించింది. 2025 ఏప్రిల్ 11న మంత్రివర్గం దాన్ని ఆమోదించింది. దాంతో విభేదాలు భగ్గుమన్నాయి.



మూడునాలుగు కులాలను తప్ప మిగతావాటన్నిటినీ రిజర్వేషన్లు వర్తించే కేటగిరిలోకి చేర్చటం దేశవ్యాప్తంగా జరుగుతోంది. దశాబ్దాలుగా భూసంపదపైనా, స్థానికపాలనా యంత్రాంగంపైనా ఆధిపత్యం కలిగిన కులాలను కూడా ఆ పరిధిలోకి తీసుకువచ్చారనటానికి కర్ణాటక కంటే నిదర్శనం లేదు. దీన్ని సరిదిద్దే వ్యూహమూ, చతురతా ఉంటేనే రాహుల్ గాంధీ ఆశిస్తున్న అసలుసిసలైన సామాజిక న్యాయం అర్హులైన వర్గాలకు దక్కుతుంది. అది జరగకపోతే కులచైతన్యమూ, కులపోటీలు పెరిగి అసలు లక్ష్యం ఎక్కడికో పోతుంది.

లింగాయతులూ, వక్కలిగలూ అటు కాంతరాజ్ కమిషన్ లెక్కల్నీ, ఇటు హెగ్డే కమిషన్ లెక్కల్నీ అంగీకరించేది లేదని స్పష్టంచేశారు. జనాభాలో 17 శాతం ఉంటామని లింగాయతులూ, 15 శాతం ఉంటామని వక్కలిగలూ వాదిస్తూ రెండు నివేదికలూ అశాస్త్రీయమేనని ప్రకటించారు. కాంతరాజ్, హెగ్డే కమిషన్ల నివేదికల్లో కూడా ఈ రెండు కులాల లెక్కల్లో కొంత తేడా ఉంది. లింగాయతులు 13.6%, వక్కలిగలు 12.2% ఉన్నట్లు కాంతరాజ్ కమిషన్ చెబితే, హెగ్డే కమిషన్ వాటిని 10.9%, 10%కు తగ్గించింది. ఆర్థికంగా, విద్యాపరంగా పైమెట్టున ఉన్న కుటుంబాల్లో సంతాన నియంత్రణ ఎక్కువగా ఉండటం సహజం. కానీ దాన్ని అంగీకరించటానికి లింగాయతులూ, వక్కలిగలూ సిద్ధంగా లేరు. జనాభా సంఖ్య తగ్గిందని అంగీకరిస్తే రిజర్వేషన్ల శాతాన్ని కుదించుకోవాలన్న డిమాండూ వస్తుంది. అందుకే కమిషన్ నివేదికనే తప్పులతడకగా విమర్శించారు.

1990లో ఏర్పాటైన జస్టిస్ చిన్నప్పరెడ్డి కమిషన్ జనాభాలో లింగాయతులు 16%, వక్కలిగలు 12% చొప్పున ఉన్నారని చెప్పి ఉద్యోగాల్లో మాత్రం ఆ రెండు కులాలకు 48% నుంచి 52% వరకూ ప్రాతినిధ్యం ఉందని తెలిపింది. ఈ అతి ప్రాతినిధ్యాన్ని తగ్గించటానికి ఆ కులాలకు 5%, 4% చొప్పున రిజర్వేషన్లు సరిపోతాయని సిఫార్సు చేసింది. ఇరు కులాల జనాభా తగ్గిందని చెప్పిన హెగ్డే కమిషన్ రిజర్వేషన్ల విషయంలో ఉదారతనే చూపించింది. 8%, 7% చొప్పున రిజర్వేషన్లను ఇవ్వాలని సూచించింది. అయినా సంతృప్తి చెందలేదు. పోనీ రాజకీయాధికారం పరంగా ఈ రెండు వర్గాలకు తక్కువ ప్రాతినిధ్యం ఉందా? అంటే అలాంటిదేమీ కనపడదు. 224 మంది ఎమ్మెల్యేలు ఉన్న శాసనసభలో లింగాయతులు 56 మంది, వక్కలిగలు 46 మంది ఉన్నారు. అంటే అసెంబ్లీలో 45.5% సీట్లు ఈ రెండు కులాల చేతుల్లోనే ఉన్నాయి. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పరిధిలోకి రాని లింగాయతులు, వక్కలిగల సంఖ్య చాలా తక్కువ. హెగ్డే కమిషన్ బీసీల రిజర్వేషన్లను 32% నుంచి 51 శాతానికి పెంచాలని సిఫార్సు చేసింది. ఈ 51% లోనే ముస్లింల రిజర్వేషన్లూ ఉన్నాయి. అవి 4% నుంచి 8% పెంచాలని ప్రతిపాదించారు. ఇక ఎస్సీ (17%), ఎస్టీలకు (7%) 2022లోనే వారి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను పెంచారు. మొత్తంమీద రిజర్వేషన్లను 75 శాతానికి హెగ్డే కమిషన్ తీసుకువెళ్లింది. ఇవి కాకుండా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మరో 10 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. అన్నీ కలుపుకొంటే రిజర్వేషన్లు 85 శాతం అయ్యే అవకాశం ఉంది. అయినా చల్లారని అసంతృప్తులతో, కోట్లు ఖర్చుతో తయారైన కాంతరాజ్, హెగ్డే కమిషన్ల నివేదికలు ఎందుకూ కొరగాకుండా పోయాయి. ఇప్పుడు మరో సర్వే ఆరంభమైంది. ఇది పూర్తయి నివేదిక వచ్చినా అది అందరికీ ఆమోదం అవుతుందన్న పూచీలేదు.

హెగ్డే కమిషన్ నివేదిక ప్రకారం చూస్తే రిజర్వేషన్లకు వెలుపల ఉండే జనాభా సంఖ్య ఎక్కువగా ఉండదు. అందులో 17.7 లక్షల మంది ఉన్న బ్రాహ్మణులదే (2.92%) సింహభాగం. రెడ్లు కూడా కర్ణాటకలో ఓబీసీ జాబితాలోనే ఉన్నారు. 10 మంది బ్రాహ్మణ ఎమ్మెల్యేలనూ ఒక రాజ్‌పుత్ ఎమ్మెల్యేనూ మాత్రమే అగ్రకుల ప్రజాప్రతినిధుల జాబితాలో వేయగలం. రెడ్డి ఎమ్మెల్యేలు ఏడుగురున్నా వారు ఆ జాబితాలోకి వస్తారని చెప్పలేం. బ్రాహ్మణ, కమ్మ, మార్వాడీ, ఆంగ్లో ఇండియన్లు మాత్రమే రిజర్వేషన్ల వెలుపల ఉన్నారు. తెలుగు మాట్లాడే ఆర్యవైశ్యులు కూడా ఓబీసీ జాబితాలో ఉన్నారు. ఐశ్వర్యారాయ్, శిల్పాషెట్టీ, సునీల్‌షెట్టీ, రక్షిత్‌షెట్టీ, రిషబ్‌షెట్టీ, అనూష్కాషెట్టీ, కె.ఎల్.రాహుల్, టి.ఎ.పాయ్ (సిండికేట్ బ్యాంకు స్థాపకులు), టి.ఎం.ఎ. పాయ్ (మణిపాల్ యూనివర్సిటీ) లాంటి ప్రముఖులు బంట్ కులానికి చెందినవారు. ఈ కులం కూడా ఓబీసీ జాబితాలోనే ఉంది. కర్ణాటక కోస్తా ప్రాంతంలో బంట్ కులస్థులు సామాజికంగా పైస్థానంలో ఉంటారు. దాన్ని పట్టించుకోకుండా వాళ్లనీ వెనుకబడిన వర్గంగానే పరిగణించారు.

కర్ణాటక చరిత్రను చూస్తే ఒక విచిత్రం కనపడుతుంది. సారవంతమైన దక్షిణ కర్ణాటక అంతా 1947కు పూర్వం మైసూరు సంస్థానం కింద ఉండేది. దేశంలోనే ప్రగతిశీల సంస్థానంగా దానికి పేరుండేది. నిజాం సంస్థానం తర్వాత అదే పెద్దది. వడియారు రాజవంశం పాలనలో ఉండేది. అరసు కులానికి చెందిన వడియార్లకు కర్ణాటక గ్రామాల్లో బలమూ లేదు. బలగమూ లేదు. దేశంలోని ఇతర సంస్థానాధీశులకూ, జమిందార్లకూ స్థానిక కులబలం గణనీయంగానే ఉండేది. వడియార్లకు అది పెద్ద కొరత. 1880ల్లో అరసు కులానికి చెందిన వారు 1000 మందికి కొంచెం అటూఇటూగా ఉండేవారు. కుల, రక్తబంధువులు లేకుండా నెగ్గుకు రావాల్సిన పరిస్థితి ఉండటంతో గ్రామాల్లో పట్టుకలిగి, భూసంపదపై ఆధిపత్యం ఉన్న లింగాయతులు, వక్కలిగల జోలికి వడియార్లు వెళ్లేవారు కాదు. చాలావరకూ వారి ఆధిపత్యానికే గ్రామాలను వదిలేశారు. అక్కడ నుంచి సంప్రదాయంగా వచ్చే శిస్తు లభిస్తే చాలనుకుని తృప్తిపడేవారు. పాలనా యంత్రాంగంలో బ్రాహ్మణ ఆధిపత్యాన్ని మొదటగా ప్రశ్నించింది లింగాయతులూ, వక్కలిగలే. దానికి స్పందనగా వెంటనే లెజ్లీ మిల్లర్ కమిటీని (1918) వడియార్ మహారాజు ఏర్పాటు చేశారు. 1919 జూలైలో ఆ కమిటీ రిపోర్టు ఇచ్చింది. దాని ఆధారంగా 1921 మే 16న జీవో జారీ అయింది. బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. బ్రాహ్మణేతర ఉద్యమానికి మహారాజు తలొగ్గుతున్న దశలో అది నచ్చక అప్పుడు దివాన్‌గా ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య రాజీనామా చేశారు. విశ్వేశ్వరయ్య రాజీనామాతో ఊపందుకున్న రిజర్వేషన్ల అనుకూల రాజకీయాలు ఆనాటి నుంచీ కర్ణాటకను ఏదో విధంగా ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. 2015 నాటి కుల లెక్కలను తిరస్కరించి మళ్లీ లెక్కలు తీయాలనుకోవటమే అందుకు నిదర్శనం. అరసు కులానికి చెందిన వడియార్లు రిజర్వేషన్లకు శ్రీకారం చుడితే అదే కులానికి చెందిన దేవరాజు అరసు 1972లో ముఖ్యమంత్రి పదవిని చేపట్టి లింగాయతు, వక్కలిగేతరుల కులాలకు రాజకీయ పదవుల్లో ప్రాతినిధ్యం పెంచి కొత్త ఒరవడిని సృష్టించారు. సొంత కులబలం లేనిచోట ఇతరకులాల బలం రాజకీయ మనుగడకు అవసరం. ఒకప్పుడు వడియార్లు అదే చేశారు. దేవరాజు అరసూ 50 ఏళ్ల తర్వాతా ఆ ప్రయోగాన్నే తలకెత్తుకున్నారు. గమ్మత్తు ఏమిటంటే మైసూరును పాలించిన అరసు కులస్థులు కూడా ఇప్పటికీ ఓబీసీ జాబితాలోనే ఉన్నారు.



■ రాహుల్ కుమార్

మంత్రివర్గం ఆమోదించిన సర్వే నివేదికనే పక్కన పడేయాల్సిన స్థాయిలో ఒత్తిళ్లు రావటం కులాల లెక్కల చుట్టూ ఆవరించిన రాజకీయాలకు నిదర్శనం. ఉన్న వాటాను కోల్పోకూడదనే పట్టుదలే ఈ రాజకీయాల్లో ప్రధానంగా కనపడుతుంది.

మూడునాలుగు కులాలను తప్ప మిగతావాటన్నిటినీ రిజర్వేషన్లు వర్తించే కేటగిరిలోకి చేర్చటం దేశవ్యాప్తంగా జరుగుతోంది. దశాబ్దాలుగా భూసంపదపైనా, స్థానిక పాలనా యంత్రాంగంపైనా ఆధిపత్యం కలిగిన కులాలను కూడా ఆ పరిధిలోకి తీసుకువచ్చారనటానికి కర్ణాటక కంటే నిదర్శనం లేదు. దీన్ని సరిదిద్దే వ్యూహమూ, చతురతా ఉంటేనే రాహుల్ గాంధీ ఆశిస్తున్న అసలుసిసలైన సామాజిక న్యాయం అర్హులైన వర్గాలకు దక్కుతుంది. అది జరగకపోతే కులచైతన్యమూ, కులపోటీలు పెరిగి అసలు లక్ష్యం ఎక్కడికో పోతుంది.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

విప్లవాగ్నులు రగిల్చిన ఉక్కుమహిళ

అది 1975వ సంవత్సరం అర్ధరాత్రి మందస పోలీస్ స్టేషన్. నెత్తుటి మడుగులో స్పృహతప్పిన మహిళను కొట్టి లేపి, "నీ భర్త ఎక్కడ? మీ దళం డెన్ ఎక్కడ?" అని అడుగుతున్నారు పోలీసులు. "నన్ను మీరు చంపక వదలరని తెలుసు. నా ప్రాణముండగా నా నుంచి ఒక్క విషయం రాబట్టలేరు" అంది ఆ మహిళ. పోనీ కనీసం లొంగిపోతే కలెక్టర్ నీకు ఉద్యోగం ఇస్తారు. మరో పెళ్ళి చేస్తారు, నీ బిడ్డను గొప్ప చదువులు చదివిస్తారు, భూమి కూడా ఇప్పిస్తారు... ఇలా ప్రలోభపెట్టారు. అయినా వినకపోయేసరికి ఆమెను జీప్‌లో ఎక్కించుకొని బుడార్ సింగ్ కొండపైకి తీసుకు వెళ్ళారు. కళ్లకు గంతలు కట్టి, తలకు తుపాకీ గురిపెట్టారు. ఆఖరు అవకాశం, మరోమారు ఆలోచించుకోమన్నారు. "మావో జిందాబాద్... విప్లవం వర్ధిల్లాలి!" అంటూ నినాదాలు ఇచ్చింది ఆమె. ఆమె పేరే పైలా చంద్రమ్మ. చివరకు ఆమెను అరెస్ట్ చేసి, ఆమెపై పార్వతీపురం కుట్ర కేసుతో సహా అనేక తప్పుడు కేసులు మోపి, పదమూడు సంవత్సరాలు జైల్లో పెట్టారు.

శ్రీకాకుళం జిల్లా రాజాం గ్రామంలో చెల్లూరి చిన్నయ్య, కామమ్మ దంపతుల ఎనిమిదిమంది సంతానంలో చంద్రక్క ఆరోవారు. 1948లో జన్మించిన చంద్రక్క పదమూడేళ్ల వయస్సు లోనే అదే గ్రామానికి చెందిన గొరకల రాంబాబు స్ఫూర్తితో బాలల సంఘంలో చేరారు. ఆ తరువాత తెగింపు సంఘంలో చేరారు. అదే రాజాం గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని పని చేస్తోన్న పైలా వాసుదేవరావు చంద్రమ్మకు కమ్యూనిజాన్ని బోధించారు. ఉక్కుమహిళగా తీర్చిదిద్దారు. చిన్న వయస్సు నుంచే చంద్రక్క కూలి రేట్లు పెంచాలని, సారాను బందు పెట్టాలని, సాగు–తాగు నీటి పోరాటాల్లోనూ, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగానూ అనేక ఉద్యమాల్లో చురుగ్గా పనిచేసేది. గరుడ భద్రలో కూలి రేట్ల కోసం జరిగే ఊరేగింపులో భూస్వామి మద్ది కామేషు, అతని గుండాలు పంచాది నిర్మలపై దాడి చేసిన ఘటనకు వ్యతిరేకంగా ఊరి భూస్వాములను ధీరత్వంతో ఎదుర్కొన్న వారిలో చంద్రక్క ఒకరు. 1968లో మద్ది కామేషు పంట కోతలో చంద్రక్క ముందున్నారు. ఆ ఘటన తరువాత పోలీసుల నిర్బంధం కారణంగా పార్టీ ఆదేశాలతో చంద్రక్క అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మొట్టమొదట పుచ్చ అప్పల స్వామి దళంలో చేరారు చంద్రక్క. భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో పాల్గొని ఆస్తులు స్వాధీనం చేసుకొని పేదలకు పంచే రైతాంగ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. పైలా వాసుదేవ్‌ని 1970 మే 24న మందస ఏజెన్సీ కొండల్లో వివాహం చేసుకున్నారు. 1971లో పురిటిగుడ్డు అరుణను గుంటూరు జిల్లా బాపట్ల దగ్గర చింతలపూడి గ్రామంలో కటిక పేదరికంలో ఉన్న అత్తలూరి శేషయ్య, శిరోమణి దంపతులకు ఇచ్చివేశారు.



పైలా వాసుదేవరావు మరణానంతరం సైతం చంద్రక్క ఎంతో అంకితభావంతో పనిచేశారు. తన కళ్ళెదుటే ఎందరో విప్లవ సహచరులు ప్రాణాలు కోల్పోతున్నా ఆఖరి శ్వాస వరకు పోరు బాటలో పయనించారు. నిత్య నిర్బంధాల మధ్య, తుపాకీ మోతల నడుమ సైతం ఎత్తిన ఎర్రజెండాను దించని ధీర పైలా చంద్రమ్మ.

ఆమె 13 సంవత్సరాల జైలుశిక్షకు కారణమైన సంఘటన 1975 మే 24న జరిగింది. మందస మండలం కొండ లోగాం ఏజెన్సీలో జరిగిన సమావేశంపై పోలీసులు దాడి చేశారు. కాల్పుల్లో పైలా వాసుదేవరావు సహా మిగిలిన దళ సభ్యులు తప్పించుకున్నారు. చంద్రక్క పొదల్లో ఇరుక్కుని పోలీసులకు చిక్కింది. ఆమెపై తప్పుడు కేసులు మోపి 13 సంవత్సరాలు జైల్లో పెట్టారు. జైలు నుంచి విడుదలయ్యాక కూడా కాడి వదలని ఆమె పట్టుదల నేటి తరానికి ఎంతో ఆదర్శం.

పైలా వాసుదేవరావు మరణానంతరం సైతం ఆమె ఎంతో అంకితభావంతో పనిచేశారు. తన కళ్ళెదుటే ఎందరో ప్రాణాలు కోల్పోతున్నా పట్టు వదలకుండా ఆఖరి శ్వాస వరకు పోరు బాటలో పయనించారు చంద్రక్క. కరోనా కష్ట కాలంలో ప్రపంచం భయభ్రాంతుల్లో ఉన్న సమయంలో 2020 సెప్టెంబర్ 10న కుమారన్న వర్ధంతి సభను గిరిజన గ్రామంలో నిర్వహించారు. అదే సమావేశం సందర్భంగా కరోనా బారిన పడి సెప్టెంబర్ 23, 2020 న విశాఖపట్నం కేజీహెచ్‌లో చంద్రక్క తుది శ్వాస వీడిచారు. చంద్రక్క మరణంతో శ్రీకాకుళం విప్లవోద్యమానికి నాయకత్వం వహించిన త్యాగాల తరం వెళ్లిపోయినట్లు అయ్యింది. దేశంలో భూస్వామ్య పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద శక్తుల, ఫాసిస్టుల ప్రమాదం పెరుగుతున్న కాలంలో అశేష ప్రజానీకం నూతన ప్రజాస్వామ్య విప్లవం కొరకు పోరాడాల్సిన సమయం ఇది. ఆ దిశగా చంద్రక్క చూపిన పోరుబాట ఒక ఆదర్శం.

• వంకల మాధవరావు
సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు
(నేడు పైలా చంద్రక్క ఐదవ వర్ధంతి)

విజయ్ వర్సెస్ ఉదయనిధి!

ఒక్క చెట్టును గట్టిగా ఊపితే పది మంది నటులు కింద పడతారనీ, పైగా వాళ్లంతా తెల్ల పంచెలు కట్టుకుని రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారనీ తమిళనాడులో సరదాగా వినిపించే ఒక జోక్. నాడు ఎంజీఆర్ దూసుకొచ్చారు. తర్వాత జయలలిత డీఎంకేను గట్టి దెబ్బ కొట్టారు. రజనీకాంత్ వద్దామనుకుని చాలా పర్యాయాలు వెనక్కి తగ్గారు. కమల్ హాసన్ వచ్చారు. ఒంటరిగా ఏమి చేయలేక డీఎంకే పంచన చేరి రాజ్యసభ సీటు తీసుకుని పక్కన కూర్చున్నారు. ఈసారి ఇళయ దళపతి (యువ నాయకుడు) విజయ్ గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చారు. రజనీకాంత్ తర్వాత అగ్రనటుడిగా అందిపుచ్చుకున్న ఇమేజ్‌తో జోసఫ్ విజయ్ చంద్రశేఖర్ తమిళ రాజకీయ యవనికపై అడుగుపెట్టగానే ఆయన అభిమానుల్లో ఒక ఉద్వేగం, ఒక ఉద్రేకం పెల్లుబికింది. డీఎంకే, అన్నాడీఎంకేతో విసిగిపోయిన తటస్థులకు విజయ్ ఆశాకిరణంగా కూడా కనిపిస్తున్నారు.

2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఎంతో దూరం లేవు. అన్నాడీఎంకే ముక్కలైంది. బీజేపీ దూరం జరిగింది. డీఎంకే బలంతో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ మరోసారి సిద్ధమవుతోంది. వీళ్లందరినీ దాటుకుని ముందుకు వెళ్లేందుకు విజయ్ రంగంలోకి దిగారు. ఆయన వచ్చిన టైమ్, టైమింగ్ కూడా ఆమోదయోగ్యంగానే ఉంది. పార్టీ పెట్టిన రెండేళ్ళలోపే ఆయన ఎన్నికలకు వెళ్తున్నారు. అంటే వేడిలో వేడిగా గెలిచెయ్యాలన్నది ఆయన ఆలోచన కావచ్చు.

విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) వ్యవస్థాపన ఒక కీలక సమయంలోనే జరిగింది. అన్నాడీఎంకేలో తీవ్ర విభేదాలతో ఆ పార్టీలో ఐదు గ్రూపులు తయారై మాజీ సీఎం ఎడప్పాడి కె.పళనిస్వామి నాయకత్వానికి ఎసరు వచ్చిన తరుణంలోనే విజయ్ రాజకీయాల్లోకి వచ్చారు. పైగా అన్నాడీఎంకేను చిన్నాభిన్నం చేస్తే మహారాష్ట్ర తరహాలో తాము బలపడే అవకాశం ఉందని బీజేపీ అంచనా వేసుకుంటున్న తరుణంలోనే విజయ్ నేనున్నానని చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తమిళనాట 18శాతం ఓట్లు రావడం కూడా కీలకాంశమే అవుతుంది. ఎంజీఆర్, జయలలిత అభిమానుల్లో ఒక వర్గం ప్రస్తుత అన్నాడీఎంకే నాయకత్వంపై విసుగుచెంది లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటేశారు. ప్రతీసారీ వాళ్లు బీజేపీవైపే ఉండకపోవచ్చు. విజయ్ వైపుకు వాళ్లు తమ దృష్టిని మళ్లించే అవకాశాలు కూడా లేకపోలేదు.

ఎన్నికలకు నాలుగు నెలల సమయం ఉండగానే విజయ్ తన జిల్లాల పర్యటన మొదలు పెట్టారు. తిరుచ్చిలో జరిగిన తొలి పర్యటనతో ఆయన నటుడి నుంచి రాజకీయ నాయకుడిగా పరిణతి చెందుతున్న సంకేతాలను ఇచ్చింది. ఎయిర్‌పోర్టు నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న సభాస్థలికి వెళ్లేందుకు నాలుగు గంటలు పట్టిందంటే అభిమానుల సందోహం ఎంతగా ఉన్నదో అర్థమవుతున్నది. తటస్థులే గాక ఇతర పార్టీల అభిమానులు, ముఖ్యంగా యువకులు, టీనేజర్లు ఎక్కువగా వచ్చారు. తమిళ గ్రామీణ ప్రజానీకం ఈసారి విజయ్ వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారు. దానికి తోడు సినీ గ్లామర్‌తో జనాకర్షణ ఖాయం. అయినా విజయ్‌కు కొన్ని పరిమితులున్నాయి. జెండాలు పట్టుకున్న వాళ్ళంతా అనుకూల ఓటర్లు కాదన్నది ఆయన గుర్తించాలి. గెలిస్తే తాను ఏం చేయబోతున్నానో విజయ్ బహిరంగంగా చెప్పగలిగినప్పుడే జనం ఆకర్షితులవుతారు. తన పార్టీ విధానాలేమిటో ఆయన వివరించగలగాలి. సీఎం స్టాలిన్ సహా, రాజకీయ ప్రత్యర్థులంతా అడుగుతున్నది కూడా అదే. విజయ్ రాజకీయ విధానాలేమిటి అన్నదే వారి తొలి ప్రశ్న.

విజయ్‌కు ఎవరు పోటీ? ఈ ప్రశ్న మదిలో మెదిలిన వెంటనే స్టాలిన్ తనయుడైన తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ గుర్తుకు వస్తారు. తమిళనాడు ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అందరూ ఆయన దిశానిర్దేశం కోసమే ఎదురు చూస్తుంటారని అంతర్గతంగా వినిపిస్తున్న మాట. స్టాలిన్‌కు కూడా వయసు మీరుతున్న తరుణంలో ఏదో ఒక రోజున డీఎంకేకు ఉదయనిధి మాత్రమే వారసుడు అవుతారనే నిర్ణయానికి ఆ పార్టీ నాయకులు, కేడర్ వచ్చారు. అందుకే విజయ్ పార్టీ పెట్టిన వెంటనే డీఎంకే ప్రచార యంత్రాంగం మొత్తం అలర్టయ్యింది. మీడియాలోనూ, సోషల్ మీడియాలోనూ ఉదయనిధికి ఇమేజ్ పెంచే ప్రక్రియ మొదలైంది. ఉదయనిధి చేపట్టే కార్యక్రమాలతో రీల్స్, ప్రోమోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. విజయ్‌ను ఎక్కడా డైరెక్ట్‌గా కౌంటర్ చేయకుండా తెలివిగా వ్యవహరిస్తూ ఉదయనిధిని తమిళనాడుకు ఏకైక నాయకుడిగా నిలబెట్టే చర్యలు మొదలయ్యాయి.

ఉదయనిధికి రాజకీయ అనుభవం ఉంది. కుటుంబ వారసత్వంగా కూడా రాజకీయం రక్తంలో లీనమై ఉంది. రాజకీయాలు చూస్తూ పెరిగిన కారణంగా ఎక్కడ ఎలా మాట్లాడాలో కూడా తర్ఫీదు పొందారు. విజయ్‌కు ఎలాంటి రాజకీయ అనుభవం లేదు. సినిమాల్లో డైలాగులతో ఫేమస్ అయ్యారు. కాకపోతే విజయ్ ధైర్యవంతుడు. ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కోగలరని ఆయనతో బాగా పరిచయం ఉన్న వాళ్లు చెబుతారు.



ఉదయనిధి కూడా తన తాత కరుణానిధి, తండ్రి ఎంకే స్టాలిన్ తరహాలోనే నాస్తికుడు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. విజయ్ అలా కాదు. ఆయన క్రైస్తవుడు. హిందూ మతంపై కూడా గౌరవాభిమానాలున్నాయి. రాష్ట్ర పర్యటన కోసం చెన్నై నుంచి స్పెషల్ ఫ్లయిట్‌లో తిరుచ్చి వెళ్తూ రాహుకాలం చూసుకుని మరీ ముందే బయలుదేరారని ఆయన అభిమానులు చెబుతున్నారు. ఉదయనిధికి రాజకీయ అనుభవం ఉంది. కుటుంబ వారసత్వంగా కూడా రాజకీయం రక్తంలో లీనమై ఉంది. రాజకీయాలు చూస్తూ పెరిగిన కారణంగా ఎక్కడ ఎలా మాట్లాడాలో కూడా తర్ఫీదు పొందారు. విజయ్‌కు ఎలాంటి రాజకీయ అనుభవం లేదు. సినిమాల్లో డైలాగులతో ఫేమస్ అయ్యారు. కాకపోతే విజయ్ ధైర్యవంతుడు. ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కోగలరని ఆయనతో బాగా పరిచయం ఉన్నవాళ్లు చెబుతారు. అయినా ఎన్నికలు వస్తే ఎలా ముందుకు వెళ్లాలి, ఎవరితో పొత్తు పెట్టుకోవాలో విజయ్ ఇంతవరకు నిర్ణయించుకోలేకపోతున్నారు. ఒంటరిగా గెలవడం కష్టమని మాత్రం విజయ్‌కు అర్థమైంది. ఇప్పటికిప్పుడయితే తమిళనాడులోని అన్ని పార్టీలు విజయ్‌ను తమ రాజకీయ ప్రత్యర్థిగానే చూస్తున్నాయి. ఆయనతో పొత్తుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

డీఎంకే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. విజయ్‌ను పెద్ద నాయకుడిగా పరిగణించేందుకు ప్రయత్నించడం లేదు. ఎక్కడా ఉదయనిధి వర్సెస్ విజయ్ అన్న ఆలోచన రాకుండా చూస్తోంది. స్టాలిన్‌కు రాజకీయ వారసుడైనంత మాత్రాన విజయ్‌తో డైరెక్టుగా రింగులోకి దిగాలా అన్నది డీఎంకే ఆలోచన. అటువంటి ప్రచారమే మొదలైతే– అనవసరంగా విజయ్‌కు పబ్లిసిటీ ఇచ్చినట్లవుతుందని వాళ్లకు తెలుసు. అందుకే అన్నాడీఎంకే నేత, మాజీ సీఎం పళనిస్వామిని తమ ప్రధాన ప్రత్యర్థిగా డీఎంకే పరిగణిస్తోంది. ఆయన పదికాలాల పాటు ప్రతిపక్షనేత హోదాలో కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్లుగా ఉదయనిధి ఇటీవల చెప్పుకున్నారు. ఒక గీతను చిన్నదిగా చేసేందుకు మరో పెద్ద గీత గీసినట్లుగా విజయ్‌ను తక్కువ చేసేందుకు పళనిస్వామిని డీఎంకే తమ ప్రత్యర్థిగా నిలబెడుతోంది. వాటన్నింటినీ తట్టుకుని విజయ్ రాజకీయాల్లో రాణిస్తారని కచ్చితంగా చెప్పలేం. ఎందుకంటే ఎంజీఆర్, జయలలిత నాటి పరిస్థితులు వేరు, ఇప్పటి పరిస్థితులు వేరు!

■ ఏ. బొల్లంరాజు
సీనియర్ జర్నలిస్ట్



ముక్కోటి దేవతలు కదలిరాగా, మంగళవాయిద్యాలు మార్మోగగా, ఢమరుక శబ్దాలు, భేరీనాదాలు, పాంచజన్య ప్రణవనాదాలు, భక్తుల జయజయధ్వానాలతో ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువకు ముందే తరలివచ్చిన అశేష భక్తజనం అమ్మ తొలిదర్శనం చేసుకుంది. బాలాదేవిగా కొలువుదీరిన దుర్గమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించింది. నగరోత్సవ వైభవం.. సాంస్కృతిక వైభోగంతో ఇంద్రకీలాద్రి మరింత వెలుగులీనింది.



అమ్మవారి గర్భాలయం నుంచి ఉత్సవ మూర్తిని తీసుకొస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, దేవస్థానం అధికారులు (ఇన్‌సెట్‌లో) బాలాత్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ దర్శనం



బాలా.. నిత్యకల్యాణశీల

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ప్రారంభం

బాలాత్రిపురసుందరిదేవిగా అమ్మ దర్శనం

- తొలి దర్శనానికి తరలివచ్చిన భక్తులు
- వేకువజాము నుంచే కిటకిటలాడిన క్యూలైన్లు
- నయనానందకరంగా నగరోత్సవం
- దేవీ వైభవాన్ని చాటిన సాంస్కృతిక ప్రదర్శనలు



ఇంద్రకీలాద్రిపై క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/చిట్టినగర్): ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామున అమ్మవారికి అర్చకులు స్నపన క్రతువు నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు దేవదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంమంత్రి అనిత తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారు తొలి రోజున మిగతా 6లో..



యాగశాల, పూజా మండపం ప్రారంభం

ఇంద్రకీలాద్రిపై నూతనంగా నిర్మించిన రాతి యాగశాల, పూజా మండపాన్ని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రారంభించారు. కృష్ణాజిల్లాకు చెందిన సంగా నరసింహారావు యాగశాలను నిర్మించారు. ఇక నుంచి చండీహోమం ఇక్కడే నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. పూజా మండపంలో అన్ని పూజలు జరుగుతాయి. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఎక్స్‌అఫీషియో సెక్రటరీ డాక్టర్ హరిజవహర్‌లాల్, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సువాసినీ పూజలో అర్చక స్వామి

సారె సమర్పించిన పోలీసులు

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో తొలి రోజున పోలీసులు అమ్మవారికి సారెను సమర్పించారు. పోలీసుల తరఫున పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు దంపతులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి సారెను తీసుకెళ్లారు. వారికి ఈవో శీనా నాయక్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం ఇచ్చారు.



దుర్గమ్మ సన్నిధిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



ఏపీ, తెలంగాణ బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారత్ ఓవెన్‌ను సన్మానిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి నారా లోకేశ్

అదరహో..

అట్టహాసంగా విజయవాడ ఉత్సవ్ ప్రారంభం

ఉర్రూతలూగించిన మ్యూజికల్ షో • వైవిధ్య భరితంగా కళాప్రదర్శనలు



మ్యూజికల్ షోలో గీతాలు ఆలపిస్తున్న గాయకులు

విజయవాడ ఉత్సవ్ కుర్రకారును ఉర్రూతలూగించింది. వైవిధ్యభరితంగా సాగిన కళాప్రదర్శనలు వారసత్వ కళలకు అద్దం పట్టాయి. మ్యూజికల్ నైట్ యువతలో జోష్‌ను నింపింది. 11 రోజులపాటు సాగే విజయవాడ ఉత్సవ్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. పున్నమిఘాట్ రోడ్డులో మ్యూజికల్ షో, తుమ్మపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో కళా ప్రదర్శనలు అలరించాయి. గొల్లపూడిలో వైబ్రెంట్ ఎగ్జిబిషన్ గేట్లు తెరుచుకున్నాయి. హెలికాప్టర్‌లో గగనతలం నుంచి బెజవాడ అందాలను పలువురు వీక్షించి ఆనంద భరితులయ్యారు.

విజయవాడ సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యువత కేరింతల నడుమ విజయవాడ ఉత్సవ్ సోమవారం అట్టహాసంగా ఆరంభమైంది. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పున్నమి ఘాట్‌లో మ్యూజికల్ షోను ప్రారంభించారు. ఈ షో యువతను ఉర్రూతలూగించింది. హైదరాబాద్‌కు చెందిన శ్రావ్య మానస బృందం సభ్యులు 24 మంది చేసిన నవ దుర్గాదేవి డాన్స్ అలరించింది. వీరు చేసిన శివతాండవానికి వేదిక ఊగిపోయింది. లయబద్ధంగా వారు చేసిన ప్రదర్శన దసరా శోభను తీసుకువచ్చింది. ఆ తర్వాత మూన్ లైట్ సింఫనీ మహారాష్ట్ర బృందం పాడిన హిందీ భక్తి గీతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకొచ్చాయి. ఈ బృందంలో వయోలిన్, వేణు గాన బృందాలు పాటకు తగ్గట్టుగా వినసొంపైన సంగీత సహకారాన్ని అందించారు. భక్తి గేయాలతో ఉత్తర భారత వాతావరణాన్ని విజయవాడకు తీసుకొచ్చారనే మిగతా 6లో..

తగ్గని ధరలు!

పన్ను శ్లాబుల తగ్గింపులో నిర్లక్ష్యం

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో నిత్యావసరాల ధరలను తగ్గించని రిటైలర్లు
- హోల్‌సేల్ వ్యాపారుల నుంచి ప్రయోజనాలు పొందినా.. తగ్గుదల లేదు
- రిటైలర్లపై దృష్టి సారించని తూనికలు, కొలతల శాఖ అధికారులు
- నేటి నుంచి సూపర్ మార్కెట్లలో ధరల తగ్గింపు
- తగ్గిన ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషీన్స్ ధరలు
- ఆటోమొబైల్‌లో కార్లు, ద్విచక్ర వాహనాల ధరలు కూడా..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చినప్పటికీ ఉమ్మడి కృష్ణాజిల్లాలో మాత్రం నిత్యావరాల ధరల్లో తగ్గింపు అమలు కాలేదు. రిటైల్ దుకాణాలు, సూపర్ మార్కెట్లలో కూడా ధరలు తగ్గించలేదు. సూపర్ మార్కెట్లలో మంగళవారం నుంచి అమల్లోకి వస్తుందని యాజమాన్యాలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ మినహాయింపులకు సంబంధించి జీఎస్టీ, తూనికలు, కొలతల శాఖల మధ్య తలెత్తిన సమన్వయలేమి కారణంగా రిటైలర్లు పాత ధరలనే వసూలు చేశారు. బడా రిటైలర్లు ఎలాంటి తగ్గింపును ఇవ్వలేదు. దీంతో సాధారణ పచారీ కొట్లలో కూడా అమలు జరగలేదు. జీఎస్టీ అధికారులు మాత్రం ఖచ్చితంగా అమలు చేయాల్సిందేనని చెబుతున్నారు. రిటైలర్లు హోల్‌సేలర్ల నుంచి ప్రయోజనాలు పొందే మిగతా 6లో..



బాలా త్రిపుర సుందరీదేవి దేవికి ప్రత్యేక పూజలు



కీలాద్రి కిటకిట..

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- తొలిరోజు బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దుర్గమ్మ దర్శనం
- తెలుగు రాష్ట్రాల నుంచి పోటెత్తిన జనం
- దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు తొలి రోజున బాలాత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెలురాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. హైదరాబాద్, నందిగామ, ఇబ్రహీంపట్నం వైపు నుంచి వచ్చే భక్తులు పున్నమిఘాట్‌లో స్నానాలు చేసుకుని కుమ్మరిపాలెం వద్ద ఏర్పాటుచేసిన క్యూ నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల నుంచి, ఏలూరు రోడ్డువైపుగా వచ్చే భక్తులు సీతమ్మపాదాల ఘాట్‌లో స్నానాలు చేసి వినాయకస్వామి గుడి వద్ద ఏర్పాటుచేసిన క్యూ ద్వారా దర్శనం చేసుకున్నారు. కేశఖండన శాలలో అధికసంఖ్యలో భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. ఇబ్రహీంపట్నం మీదుగా వచ్చే భక్తులు తలనీలాలు సమర్పించుకోవడం కోసం కొంచెం ఇబ్బంది పడ్డారు.

కొండపైకి ఉచిత బస్సులు

అమ్మవారిని దర్శించుకోవడం కోసం వచ్చే భక్తుల్లో వృద్ధులు, వికలాంగులు, చిన్నారుల కోసం దాతలు బస్సులను ఏర్పాటుచేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత బస్సులు రద్దీగానే ప్రయాణించాయి.

కిటకిటలాడిన లడ్డూ కౌంటర్లు

మొదటిరోజే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి ఆసక్తి చూపడంతో ప్రసాదం విక్రయించే కౌంటర్లు కిటకిటలాడాయి. 11 భారీ కౌంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ భక్తులతో కౌంటర్లు కిక్కిరిసిపోయాయి. కనీసం అరగంటకుపైగా సమయం పడుతోంది. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల కోసం అదనంగా మరో కౌంటర్‌ను ఏర్పాటు చేశారు.

క్యూలలోనే భక్తులకు అన్నప్రసాదం



కనకదుర్గమ్మ దర్శనం అనంతరం అన్నప్రసాదం స్వీకరించేందుకు భక్తులు కుటుంబ సమేతంగా అన్న ప్రసాద కేంద్రానికి వచ్చారు. అన్నప్రసాద కేంద్రం దగ్గర రద్దీ లేకుండా ఈసారి దేవస్థాన అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. క్యూలో వచ్చే భక్తులకు విస్తర్లలో వంటకాలను వడ్డించారు. ఎంతమంది భక్తులు వచ్చినా తోపులాట, గందరగోళానికి లోనవకుండా అధికారులు ఏర్పాట్లుచేశారు. నాలుగువైపులా నాలుగు కౌంటర్లు ఏర్పాటుచేశారు. బఫే పెట్టి వృద్ధులు, చిన్నారులు కూర్చొని తినడానికి వీలుగా తివాచీలు పరిచారు. కౌంటర్లు ఎక్కువగా ఉండడం వల్ల తోపులాటలు జరగకుండా భక్తులు ప్రశాంతంగా అమ్మవారి ప్రసాదాన్ని ఆరగించారు.

తొలిరోజు ఆదాయం రూ.22.79 లక్షలు

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా మహోత్సవాలలో మొదటిరోజు సోమవారం సాయంత్రం 5.30 వరకు వివిధ రూపాల్లో మొత్తం రూ.22,79,264లు ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వీకే శీనానాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.300లు టిక్కెట్‌ల ద్వారా రూ.9లక్షలు, రూ.100ల ద్వారా రూ.3,10,000లు, రూ. 15 లడ్డూ ప్రసాదం ద్వారా రూ.1,50,000లు, రూ.100ల లడ్డూ ద్వారా రూ.7,70,000లు లభించినట్టు పేర్కొన్నారు. కుంకుమార్చనల రూ.3వేలు టిక్కెట్టు ద్వారా రూ.33వేలు, రూ.5వేలు టిక్కెట్ ద్వారా రూ.5వేలు, చండీహోమం రూ.4వేలు టికెట్ ద్వారా రూ.4వేలు, శ్రీచక్రనవావరణార్చన రూ.3వేలు టిక్కెట్ల ద్వారా రూ.30వేలు, ఖడ్గమాలార్చన రూ.5,116లు టిక్కెట్ల ద్వారా రూ.20,464లు, తలనీలాల రూ.40 టిక్కెట్ల ద్వారా రూ.56,800లు, మొత్తం రూ.22,79,264లు లభించినట్టు ఈవో వివరించారు. రాత్రి 10 గంటల వరకు భక్తులు సుమారు 70వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారని, ఈవో ఆ ప్రకటనలో తెలిపారు.

బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్‌లకు భక్తుల తాకిడి



నగరంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ అన్నిప్రాంతాలు భక్తులతో రద్దీగా మారాయి. అమ్మవారి దర్శనానికి దూరప్రాంతాల నుంచి వచ్చేవారికి వాహనాలను కొండమీదికి అనుమతించరనే విషయం తెలియకపోవడంతో అధికశాతం మంది భక్తులు అక్కడికి చేరుకోవడంతో కొంత రద్దీ ఏర్పడింది.

జల్లు స్నానాల వద్ద..



పాత రాజరాజేశ్వరి పేట : అమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా అధికారులు జల్లు స్నానాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కృష్ణానది ఉధృతంగా ఉన్న నేపథ్యంలో శనైశ్చర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన జల్లు స్నానాల వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. ఐరన్ రైలింగ్‌తో పాటుగా అడుగడుగునా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

పిల్లలు తప్పిపోకుండా..



దసరా ఉత్సవాల్లో చిన్నారులు తప్పిపోకుండా ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్(ఐసీడీఎస్) అధికారులు చర్యలు తీసుకున్నారు. చిన్నారుల చేతులకు ట్యాగ్‌లు వేసి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలను నమోదు చేస్తున్నారు. సీఎంఎస్ యాప్‌కు సదరు ట్యాగ్‌లు అనుసంధానం అవుతాయి. చిన్నారులు తప్పిపోతే యాప్ ద్వారా ఎక్కడ ఉన్నది తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించడం జరుగుతుంది.

అమ్మవారికి పోలీసుల సారె

విజయవాడ/చిట్టినగర్ : దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో తొలిరోజున పోలీసులు అమ్మవారికి సారె సమర్పించారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు దంపతులు వన్‌టౌన్ స్టేషన్ నుంచి ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి సారెను తీసుకెళ్లారు. వారికి ఈవో శీనానాయక్ స్వాగతం పలికారు.

కేశఖండనశాలపై భక్తులు ఫిర్యాదు

సీతమ్మపాదాల వద్ద శనీశ్వరస్వామి దేవాలయానికి ఎదురుగా ఏర్పాటుచేసిన కేశఖండనశాలలో అధిక సంఖ్యలో భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. తలనీలాలకు అధికారులు టోకెన్ ధరను రూ.40గా నిర్ణయించారు. భక్తులు వద్ద చిల్లర లేక రూ.50 ఇస్తే సిబ్బంది మిగిలిన పది రూపాయలు ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. రూ.100 ఇచ్చినా రూ.50 ఇచ్చి పదిరూపాయలు చిల్లర లేదనే సమాధానం చెబుతున్నారని ఆరోపిస్తున్నారు.



వెంకయ్యనాయుడు, సుజనాచౌదరిలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

దుర్గమ్మ సేవలో ప్రముఖులు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు దంపతులు

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రులలో బాలా త్రిపుర సుందరి అలంకారంలో దర్శనం ఇచ్చిన కనకదుర్గమ్మను సోమవారం మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సుజనా చౌదరిలు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించగా, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఈవో శీనా నాయక్ వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.



హోంమంత్రి అనిత

అమ్మవారి దర్శనం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి సుభిక్షంగా ఉండాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. అరాచక శక్తుల నుంచి కాపాడాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ దసరా నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్ రావు దంపతులు, ప్రముఖ సినీ సంగీత దర్శకులు మణిశర్మ, న్యాయమూర్తులు ఉన్నారు.

ఆనందంగా ఉంది : ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ



బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవటం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ అన్నారు. సోమవారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ 41 రోజులపాటు అమ్మవారి దీక్ష చేయటం తనకు అలవాటని చెప్పారు.

ప్రజలందరికీ అమ్మ ఆశీస్సులుండాలి : మణిశర్మ



ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రముఖ సినీసంగీత దర్శకుడు మణిశర్మ అన్నారు. ఆయన తన బృందంతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారని కితాబిచ్చారు.



కుటుంబసభ్యులతో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు



జానపద నృత్య కళాకారులు



ప్రత్యేక కుంకుమార్చనలో భక్తులు



దుర్గమ్మ నగరోత్సవం



వృద్ధులకు రెడ్‌క్రాస్ సేవలు



ఏర్పాట్లపై పోలీసు సిబ్బందికి ఈవో ఆదేశాలు

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

కలెక్టరేట్ : భక్తులు అమ్మవారిని ఆధ్యాత్మికత వాతావరణంలో దర్శించుకుంటున్నారు. పటిష్టమైన ఏర్పాట్లు చేయడం వల్ల ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రోటోకాల్ దర్శనాలకు ప్రత్యేకంగా స్లాట్లు కేటాయించాం. దాదాపు 6వేల మంది పోలీస్ సిబ్బంది విధుల్లో ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భక్తుల భద్రతను పర్యవేక్షిస్తున్నాం.

సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు అమ్మవారిని దర్శించుకున్న హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన జగన్మాతను ఆమె దర్శించుకున్నారు. అనంతరం ఆమె మీడియా పాయింట్లో మాట్లాడుతూ, సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శన భాగ్యం కలిగించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని పేర్కొన్నారు.

- యుద్ధప్రాతిపదికన సమస్యల పరిష్కారం : కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్ : భక్తుల సమస్యలను క్యూ ఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ ద్వారా తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో తొలిరోజు సోమవారం వినాయకుని గుడి ప్రారంభం నుంచి చిన్న రాజగోపురం వరకు కాలినడకన సామాన్య భక్తుల క్యూలైన్‌లో నడిచి వచ్చి భక్తుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఏర్పాట్లు బాగున్నాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. భక్తులు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆహ్లాదకర వాతావరణంలో, ఆధ్యాత్మిక వాతావరణంలో దర్శనం చేసుకొంటున్నారన్నారు. సామాన్య భక్తుల సంతృప్తికర దర్శనమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం సేవలందించాలని ఆదేశించారు. వినాయక టెంపుల్, వీఎంసీ పాయింట్, కేశఖండనశాల, సీతమ్మవారి పాదాలు, పున్నమిఘాట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వైద్య శిబిరాలలో చేసిన ఏర్పాట్లు తనిఖీ చేశారు.

సామాన్య భక్తులకు సులువుగా దుర్గమ్మ దర్శనం

- ఈవో శీనానాయక్, ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ

ఇంద్రకీలాద్రి : దుర్గమ్మను దర్శించుకోవటానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దని, ప్రతిఒక్కరూ క్యూలలో వెళ్లి అమ్మవారిని దర్శించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఈవో శీనానాయక్, ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ ఉద్యోగులకు సూచించారు. సోమవారం ఈవో ఏడీసీపీ కొండపై ఆలయ ప్రాంగణంలో పర్యటించారు. నటరాజస్వామి ఆలయం మెట్ల వద్ద నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వైపు పోలీసులు బారికేడ్లను అడ్డం పెట్టడంతో భక్తులు పెద్దఎత్తున నిలిచిపోయారు. విషయం తెలుసుకున్న ఏడీసీపీ విధుల్లో ఉన్న సిబ్బందిని భక్తులకు ఇబ్బందులు కలిగించకుండా అమ్మవారి దర్శనం అనంతరం బయటకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విధుల్లో ఎస్‌ఐకు ఛాతినొప్పి

ఇంద్రకీలాద్రి : దసరా ఉత్సవాలలో ఘాట్‌రోడ్డులో సోమవారం విధుల్లో ఉన్న అనకాపల్లి జిల్లాకు చెందిన ఎస్.ఐ పి.వి.రమణ (60)కు ఛాతినొప్పి రావటంతో పోలీస్ అధికారులు అతనిని హుటాహుటిన చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పలు టెస్ట్‌లు నిర్వహించారు. ప్రస్తుతం అతను క్షేమంగా ఉన్నట్టు వన్‌టౌన్ సీఐ గురు ప్రకాష్ తెలిపారు.

తగ్గని ధరలు!

(5వ పేజీ తరువాయి)

అవకాశం ఉన్నా కూడా పాత ధరలనే వసూలు చేశారు. తగ్గిన ధరలతో సరికొత్త ఎమ్మార్పీ స్టిక్కర్లను అంటించాల్సి ఉండగా, ఆ పని చేయలేదు. పోనీ స్టిక్కర్లు అంటించటం పెద్ద పని అనుకున్నా తగ్గించి అయినా విక్రయించలేదు. దీనిపై జీఎస్టీ అధికారులను వివరణ కోరగా.. స్టిక్కర్లు అంటించి తగ్గించటమనేది లీగల్ మెట్రాలజీ అధికారుల చూడాల్సిన వ్యవహారమని చెబుతున్నారు. సోమవారం నుంచి తగ్గించాలని ఎప్పుడో ఆదేశాలు ఇస్తే.. చివరి వరకు కూడా ఏ శాఖ పట్టించుకోకపోవటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. నగరంలోని గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్ కమిటీని దీనిపై వివరణ కోరగా.. తాము జీఎస్టీ లేని, మారని నిత్యావసరాలను మాత్రమే సరఫరా చేస్తున్నామని పేర్కొంటున్నారు. ధరలు ఎందుకు తగ్గించలేదని కాళేశ్వరరావు మార్కెట్, ఇతర మార్కెట్లలోని రిటైల్ వ్యాపారులను ప్రశ్నించగా.. కాస్మోటిక్స్, పేస్టులు, సబ్బులు, ప్యాక్ట్ ప్రొడక్ట్స్, లిక్విడ్స్, స్నాక్ ఫుడ్స్ వంటి వాటిని ఆయా కంపెనీల డీలర్లు నెలలో రెండు సార్లు సరుకును ఇస్తారని.. పాత సరుకు తమ దగ్గర ఉన్నందున తగ్గించలేమని చెబుతున్నారు. వాస్తవానికి ఆయా కంపెనీల నుంచి రిటైలర్లు ప్రయోజనాలు పొందుతారు. ఈ విషయం వారికి తెలిసినా వినియోగదారులకు మాత్రం ఇలాంటి సమాధానాలు చెబుతున్నారు. ఇప్పటికైనా జీఎస్టీ, తూనికలు, కొలతలశాఖ అధికారులు రంగంలోకి దిగకపోతే రిటైలర్ల దోపిడీ కొనసాగే ప్రమాదం ఉంది. నిత్యావసరాలకు సంబంధించి పప్పుదినుసులు, బియ్యం వంటి వాటిపై ఇప్పటికే జీఎస్టీ లేదు. వంట నూనెలు, పంచదారపై ఇప్పటికే ఐదు శాతం జీఎస్టీ అమల్లో ఉండటం వల్ల తగ్గింపు లేదు. నిత్యావసరాలలో భాగంగా సబ్బులు, పేస్టులు, స్నాక్ ప్రొడక్ట్స్, లిక్విడ్స్ తదితరాలకు సంబంధించి జీఎస్టీ మినహాయింపులు ఉన్నా తక్షణ తగ్గింపు అమల్లోకి రాలేదు. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ రంగాలకు సంబంధించి మాత్రం తక్షణ తగ్గింపు అమల్లోకి వచ్చింది. కార్లపై రూ.1.20 లక్షల వరకు తగ్గింపు లభించింది. టీవీలపై రూ.4 వేల నుంచి రూ. 10 వేల వరకు, ఏసీలపై రూ.4 వేల నుంచి రూ.10 వేల వరకు, ద్విచక్రవాహనాలపై రూ.7 వేల నుంచి రూ. 9 వేల వరకు, హైయ్యండ్ ద్విచక్రవాహనాలపై రూ.14 వేల వరకు తగ్గింపు లభించింది. తక్షణం తగ్గింపును అమల్లోకి తీసుకురావటం జరిగింది. నగరంలోని విజయ డెయిరీ ఉత్పత్తులకు సంబంధించి వెన్న, నెయ్యి వంటి ఉత్పత్తులపై తక్షణం తగ్గింపు అమల్లోకి వచ్చింది.

ఎన్టీటీపీఎస్ కాలుష్యం వల్ల

చివరకు బూడిదే మిలిగింది

- అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే వసంత ఆవేదన
- అరికట్టేందుకు చర్యలు: మంత్రి గొట్టిపాటి రవికుమార్



ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీటీపీఎస్ నుంచి విడుదలవుతున్న బూడిద కాలుష్యం వల్ల మైలవరం నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఏపీ అస్లెంబీ సమావేశాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బూడిద కాలుష్యంపై ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ, కాలుష్యంతో పాటు ప్లాంట్ వల్ల చివరకు బూడిదే మిగిలిందని, దాన్ని కూడా టెండరింగ్ పెట్టి అమ్మేయడంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కరవయ్యాయన్నారు. స్థానిక లారీ వర్కర్లకు బూడిద లోడింగ్ ఉచితంగా చేయాలని కోరారు. అవసరమైతే స్థానికులకు ఉపాధి కోసం టెండర్ ద్వారా యాష్ పాండ్ నుంచి లభించే రూ.2.8 కోట్లను తానే చెల్లిస్తానని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రూ.119 కోట్ల నిర్వహణ పనులు ప్రారంభించి ఇప్పటి వరకు రూ.50 కోట్లు ఖర్చు పెట్టినట్టు చెప్పారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమాధానమిస్తూ ఎన్టీటీపీఎస్ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటుందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి సూచనల మేరకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. పీసీబీ సూచనల ప్రకారం బూడిద తరలింపుకు ప్రభుత్వం టెండరింగ్ ఏజెన్సీని నియమించిందన్నారు. కాలుష్యాన్నికి చెక్ పెట్టేందుకు కోల్ స్టోరేజ్ షెడ్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఇందుకు రూ.50 కోట్లు ఖర్చవుతుందన్నారు. ఎన్టీటీపీఎస్ కాలుష్య నివారణకు పునరుద్ధరణ, ఆధునీకీకరణలో భాగంగా కొత్త పరికరాలను అమర్చడం కోసం రూ.500 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రజల జీవనోపాధి బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. బూడిద తరలింపుకు స్థానిక ప్రజల ట్రక్కులనే జెన్కో ఉపయోగిస్తుందన్నారు. బూడిద లోడింగ్‌తో పాటు రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ప్రజలకు ఉచితంగా వైద్య సదుపాయాలు అందిస్తున్నామన్నారు.

బాలా.. నిత్యకల్యాణశీల

(5వ పేజీ తరువాయి)

శ్రీబాలాత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది మొదటి రోజు నుంచి భక్తులు ఇంద్రకీలాద్రికి పోటెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి ఏడు గంటల సమయానికి అమ్మవారిని 52,850 మంది దర్శించుకున్నారు. 55,474 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. 977 మంది వీఐపీ కోటాలో దర్శనానికి వచ్చారు. దర్శనానికి గంట సమయం పడుతోంది. మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక కమాండ్ కంట్రోల్‌లో ఏఐ ద్వారా ఎప్పటికప్పుడు గణాంకాలు తీసుకుంటున్నారు. కనకదుర్గమ్మ మంగళవారం శ్రీగాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

అదరహో..

(5వ పేజీ తరువాయి)

సంభాషణ ప్రేక్షకుల మధ్య జరిగింది. వేదికపై ఈ బృందం గానం చేస్తుంటే, వేదిక కింద మార్వాడీలు చేసిన నృత్యాలు, కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నాయి. చివరిగా వాస్కో బృందం చేసిన దాండియా నృత్యం అలరించింది. ఈ బృందంతో కలిసి దేవకీ నందన వాసుదేవ చిత్రం హీరోయిన్ మానస వారణాసి కలిసి దాండియా నృత్యం చేసి ఆకట్టుకుంది. అనంతరం ఇదే బృందం అద్భుతమైన కోలాట ప్రదర్శన ఇచ్చింది. వేదికపై ఈ బృందం కోలాట ప్రదర్శన ఇస్తుంటే.. వేదిక కింద యువత సైతం స్టెప్పులు కలిపారు. ఈ కార్యక్రమాలను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రులు రవీంద్ర, వంగలపూడి అనిత, కొలుసు పార్థసారధి, కలెక్టర్ జి.లక్ష్మీశ, స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు వీక్షించారు. కాగా, గొల్లపూడిలో ఎగ్జిబిషన్ ప్రారంభమైంది.

అసెంబ్లీ వేదికగా



శాసనసభ వర్షాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం అసెంబ్లీలో పలువురు ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమస్యలపై ప్రస్తావించారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో లైబ్రరీ నిర్మాణం జరగాలి

- ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



అవనిగడ్డ : అమరావతిలో స్టేట్ లైబ్రరీ నిర్మాణం మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో జరగాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయాల శాఖకు సమర్థవంతమైన యువనేత నారా లోకేశ్ మంత్రిగా ఉండటంతో గ్రంథాలయాల అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందన్నారు.

పెసరకు గిట్టుబాట ధర ఇవ్వాలి

ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ : పెసర రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి నియోజకవర్గంలోని కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో రైతుల వద్ద మూడు వేలటన్నుల వరకూ పెసల నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాకు రూ.5వేల నుంచి రూ.6 వేలు మాత్రమే ధర లభిస్తుండగా.. ప్రభుత్వం తక్షణమే స్పందించి గిట్టుబాటు ధర అందించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి.

శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాయించండి

- ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా



పామర్రు: నియోజకవర్గ పరిధిలోని హైందవ శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. హిందూ శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.20లక్షలు కేటాయించాలి.



డొంక రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలి

- ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు : రైతు కష్టానికి, ఆహార భద్రతకు అనుబంధంగా ఉన్న డొంక రోడ్లను అభివృద్ధి చేయాలి. గ్రావెల్ లేక డొంక రోడ్ల అభివృద్ధి ఆగిపోయి పొలాల్లోకి రైతులు ఎరువులను తీసుకెళ్లలేక పోతున్నారు. ఇది రైతు ఉత్పత్తి ఖర్చుపై అదనపు భారం మోపుతోంది. లారీ యజమానులు లారీలు నడపలేని స్థితిలో కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి నెలకొంది.

విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం : గన్నవరం విమానాశ్రయ విస్తరణ నిర్వాసితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి. విమానాశ్రయ విస్తరణలో 423 మంది ఇళ్లు కోల్పోగా వారిలో 300 మంది పేద ఎస్సీలు ఉన్నారు. ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఒక్కొక్కరికి తొమ్మిది లక్షల పరిహారంగా ఇవ్వాలి. ఇందు నిమిత్తం రూ.59 కోట్లు కేటాయించాలి. రూ.459 కోట్లతో చేపట్టిన విమానాశ్రయ టెర్మినల్ భవన నిర్మాణం వేగవంతం చేయాలి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128,137, 148
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254



నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

30న ఫన్‌టైం క్లబ్‌లో దాండియా నృత్యం

భారతీనగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం దసరా సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన విజయవాడ ఉత్సవ్ స్ఫూర్తితో ఫన్ టైం క్లబ్ ఆధ్వర్యంలో అరుణకుమారి, ఉమాదేవి సమక్షంలో ఈ నెల 30న దాండియా నృత్యం నిర్వహిస్తున్నట్లు క్లబ్ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.



దాండియా నృత్యం నేర్చుకుంటున్న మహిళలు

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడండి

అధికారులకు కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం



ఘాట్‌లలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం వినాయకుని గుడి, కెనాల్ రోడ్డు, కృష్ణవేణి ఘాట్, భవానీ ఘాట్, పున్నమి ఘాట్, అమరావతి స్నాక్ పాయింట్, క్యూలైన్లో, వాటర్ పాయింట్లు, మరుగుదొడ్ల పాయింట్లు, కేశఖండనశాల ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలని, ప్రతి షిఫ్ట్‌లో సిబ్బంది కచ్చితంగా హాజరు కావాలని అధికారులను ఆదేశించారు. ప్రతి వాటర్ పాయింట్ వద్ద తాగునీరును అధికారులు పర్యవేక్షిస్తూ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి గంట గంటకు రిపోర్ట్ తీసుకుంటూ తాగునీటి కొరత లేకుండా చూసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో డ్రోన్లను వాడుతూ ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, మరుగుదొడ్ల బయట డ్రమ్ములో ఎల్లప్పుడూ నీరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.






త్రిశక్తిపీఠంలో | మొగల్రాజపురం ధనకొండపై | దాసాంజనేయ దేవస్థానంలో | శ్రీ మద్దిరావమ్మ తల్లి

రజిత కవచాలంకృత అలంకారంలో కాళీమాత

కృష్ణలంక, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రుల తొలిరోజైన సోమవారం త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారు రజిత కవచాలంకృత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి కలశస్థాపన, అభిషేకం, శ్రీచక్ర పూజ, చండీహోమం, మూలమంత్ర హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి.వుల్లయ్య, జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, జగన్, దేసు వెంకట బ్రహ్మం, విశ్వేశ్వరయ్య పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరీదేవిగా ధనకొండ అమ్మవారు

మొగల్రాజపురం: శ్రీ విశ్వావసు నామ సంవత్సర దసరా మహోత్సవాలు మొగల్రాజపురం ధనకొండ మీద సోమవారం ప్రారంభం అయ్యాయి. దుర్గా భవానీ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మొదటి రోజు అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తూర్పు నియోజకవర్గంలో దసరా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజైన సోమవారం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు దేవాలయాల వద్ద బారులు తీరారు.

భక్తులు మొదటి రోజు కావడంతో విశేషంగా తరలి వచ్చారు.

గాయత్రీదేవిగా శ్రీమద్దిరావమ్మతల్లి

భారతీనగర్ : గుణదలలోని శ్రీ మద్దిరావమ్మ తల్లి దేవస్థానంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలలో శ్రీ మద్దిరావమ్మ తల్లిని గాయత్రి దేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.● కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనేయ దేవస్థానంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పటమట ఎస్ఎస్ఎం స్కూల్ వద్ద

కౌండిన్య నగరాల దేవీభక్త బృందం ఆధ్వర్యంలో...

రామలింగేశ్వరనగర్:పటమట ఎస్ఎస్ఎం స్కూలు దగ్గర కౌండిన్య నగరాల దేవి భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికపై సోమవారం మొదటి రోజు అమ్మవారు శ్రీ బాలాత్రిపుర దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఉభయ దాతలు చలపాటి వెంకటేశ్వరరావు, కిషోర్ కుమార్, ఝాన్సీ దంపతుల చేతుల మీదుగా పూజా కార్యక్రమం నిర్వహించారు. భక్తులందరికీ లడ్డు ప్రసాద వితరణ చేశారు.

దసరా ఉత్సవ కమిటీ మెంబర్‌గా న్యాయవాది ఏడుకొండలు

విజయవాడ లీగల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల ఉత్సవాలు-2025కు సంబంధించి ఉత్సవ కమిటీ మెంబర్‌గా సీనియర్ న్యాయవాది పడవల ఏడుకొండలును నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు సోమవారం ఏడుకొండలకు అందాయి. న్యాయవాది పడవల ఏడుకొండలకు ఉత్సవ కమిటీలో స్థానం కల్పించడంతో న్యాయవాదులు వి.గురు నాథం, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్సవ్ కమిటీ సభ్యుడిగా పోతంశెట్టి

భారతీనగర్: పటమటకు చెందిన బీజేపీ నాయకుడు పోతంశెట్టి నాగేశ్వరరావును దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఉత్సవ్ కమిటీ సభ్యులుగా నియమించారని జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రైమవేరా సాఫ్ట్‌వేర్‌పై వర్క్‌షాప్

కానూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రైమవేరా సాఫ్ట్‌వేర్‌పై వారం రోజులపాటు జరిగే వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ కొండపల్లి శివాజీ బాబు మాట్లాడుతూ, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ వర్క్‌షాప్ ఎంతగానో ఉపయోగకారిగా ఉంటుందన్నారు.

వైభవంగా స్టెప్ అండ్ స్పిన్-2025

● గర్బా నృత్యం చేసిన వీసీ, ప్రొ. వీసీ, రిజిస్ట్రార్ ● ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కానూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో సోమవారం స్టెప్ అండ్ స్పిన్- ఫన్ ఫిల్డ్ డాన్స్ ఈవెంట్ వైభవంగా జరిగింది. వర్సిటీ సంస్కృతి, కల్చరల్ అండ్ లిటరరీ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఈవెంట్‌లో వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రొ. వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్‌తోపాటు పలువురు ఫ్యాకల్టీ సభ్యులు గుజరాతీ స్టైల్‌లో చేసిన గర్బా నృత్యం ఎంతగానో అకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వర్సిటీలో చదివే విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని డీజే, మ్యూజిక్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దాండియా, కోలాటం, గర్బా వంటి సంప్రదాయ నృత్యాలతో విశ్వవిద్యాలయం ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ముందుగా కార్యక్రమాన్ని వీసీ వెంకటేశ్వరరావు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో కల్చరల్ కమిటీ కన్వీనర్ బి. నీలాంబరం, కో-కన్వీనర్ డాక్టర్ పావని పాల్గొన్నారు.



కానూరు సిద్ధార్థ వర్సిటీలో నృత్యం చేస్తున్న వీసీ, ప్రొ. వీసీ, రిజిస్ట్రార్

హిందీ భాష పట్ల యువత ఆసక్తి చూపాలి

గుణదల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ భాషకూ లేని ప్రాధాన్యత హిందీకి ఉందని ప్రముఖ సాహితీవేత్త ఖాదర్ మోహద్దీన్ అన్నారు. మాచవరంలోని హిందీ కళాశాలలో హిందీ దినోత్సవ ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సాహితీవేత్త ఖాదర్ మోహద్దీన్ మాట్లాడుతూ హిందీ భాష ధారాళంగా మాట్లాడటం వస్తే దేశంలో ఎక్కడైనా రాణించేందుకు అవకాశం ఉంటుందని, అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. హిందీ భాష పట్ల యువత ఆసక్తి కనబర్చాలని కోరారు. హిందీ భాషలో ప్రావీణ్యత కనబర్చిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హిందీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ జుబేర్ అహ్మద్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



హిందీ భాష ముగింపు కార్యక్రమంలో వక్తలు

డేటా వాలీ లండన్ ఇంటర్న్‌షిప్‌కు పీబీ సిద్ధార్థ విద్యార్థులు

మొగల్రాజపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాలలో ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులు లండన్‌కు చెందిన డేటా వాలీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు బి. సంజయ్, జె.ఉమామహేశ్వరరావు, ఏ.గాయత్రీ, ఎంసీఏ విద్యార్థులు బి.వంశీకృష్ణ, ఎన్. వెంకటేష్‌లకు ఫ్లట్టర్ మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌లో ఆరునెలలు శిక్షణ ఇచ్చి తరువాత ఉద్యోగంలో నియమిస్తారని తెలిపారు. విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డేటా వాలీ ఇండియా డైరెక్టర్ (ఆపరేషన్స్) కె.అనుపమ, ఉపాధి నియామక అధికారి ఎ.ప్రేమ్‌కుమార్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ జంపాల, హెచ్‌వోడీ డాక్టర్ టిఎస్ రవికిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తదితరులు

సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఫౌండేషన్ కోర్సు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ఏడుకొండలరావు

ప్రభుత్వాసుపత్రి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో నూతనంగా చేరిన ఎంబీబీఎస్ 2025 విద్యార్థుల కోసం ఫౌండేషన్ కోర్సు తరగతులు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ఏడుకొండలరావు, అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రశాంతి, కోఆర్డినేటర్ డాక్టర్ సుల్తానాలు సంయుక్తంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో సుమారు 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్లు ప్రశాంతి, సుల్తానాలు కోర్సు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

ఆదర్శప్రాయుడు ప్రభుకిషోర్

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్



మాట్లాడుతున్న కృష్ణాజిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

బెంజిసర్కిల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్త ప్రభుకిషోర్ అందరికి ఆదర్శప్రాయుడని కృష్ణాజిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్ అన్నారు. వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ ప్రభు కిషోర్ పుట్టినరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ విజయవాడ జూబ్లీ హరిత, వరుణ్ మోటార్స్ సంయుక్తంగా పలు సేవా కార్యక్రమాలను బెంజిసర్కిల్ సమీపంలోని వరుణ్ మోటార్స్ ఆవరణలో సోమవారం నిర్వహించారు. తొలుత క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గద్దె అనురాధ, పుట్టగుంట సతీష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.హరిత, లయన్స్ క్లబ్ విజయవాడ జూబ్లీ హరిత అధ్యక్షుడు కొటా ఫణీంద్ర, కార్యదర్శి కాకాని శ్రీనివాస్, యోగా గురువు అంకాల సత్యనారాయణ, లయన్స్ క్లబ్ సభ్యులు, వరుణమోటార్స్ సిబ్బంది పాల్గొన్నారు.

తొలిదశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే మంచి ఫలితాలు

● పీడియాట్రిక్ హేమాటో, అంకాలజిస్ట్ డాక్టర్ వీణా అక్కినేని



విజయవాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):పిల్లల్లో క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించి చికిత్స చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని పీడియాట్రిక్ హేమాటో, అంకాలజిస్ట్ డాక్టర్ వీణా అక్కినేని అన్నారు. చైల్డ్‌హుడ్ క్యాన్సర్ అవగాహన నెల(సెప్టెంబరు) సందర్భంగా రెయిన్‌బో చిల్డ్రర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం డెకాథ్లాన్‌లో పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రెయిన్‌బో చిల్డ్రన్ ఆసుపత్రి తరఫున సమాజంలో అవగాహన పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొని క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులకు మద్దతు తెలిపారు.

బస్సులో జాకీలు చోరీ చేసిన వ్యక్తికి దేహశుద్ధి

బస్టేషన్: విజయవాడ డిపో బస్సులోని జాకీలను దొంగిలించిన అటెండర్‌ను హైదరాబాద్‌లో ఆర్టీసీ ఉద్యోగులు పట్టుకుని దేహశుద్ధి చేసిన సంఘటన రెండురోజుల క్రితం జరిగింది. విజయవాడ డిపోకు చెందిన బస్సు ప్రయాణికులతో హైదరాబాద్ వెళ్లింది. డ్రైవర్ బస్సును పార్కింగ్ చేసి తన చాంబర్‌కు వెళ్లాడు. బస్సులో అటెండర్‌గా పనిచేస్తున్న వ్యక్తి బస్సులో ఉన్న జాకీలను దొంగిలించి విక్రయించాడు. ఈ వ్యవహారాన్ని గమనించిన అక్కడ ఆర్టీసీ ఉద్యోగులు అతనిని పట్టుకుని దేహశుద్ధి చేసి డబ్బులను తీసుకుని అధికారులకు అప్పగించారు. విజయవాడ డిపో అధికారులు విచారణ చేపట్టారు.

జీఎస్టీ సంస్కరణలు విప్లవాత్మక మార్పు: జగన్



జీఎస్టీ 2.0 సంస్కరణలను సరళమైన పన్ను వ్యవస్థగా, విప్లవాత్మకమైన మార్పుగా వైసీపీ అధ్యక్షుడు జగన్ అభివర్ణించారు. వస్తుసేవలు.. పన్నుల సరళీకృత విధానం ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని.. జీఎస్టీ శ్లాబుల సవరణతో ప్రజలకు మేలు కలుగుతుందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ ట్వీట్‌పై రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ తీవ్రంగా స్పందించారు. ఇన్నేళ్లుగా మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులను పెంచేసి జనాలను దోచుకున్న విషయంపై ఎందుకు మాట్లాడలేదని జగన్‌ను 'ఎక్స్' వేదికగా నిలదీశారు. ప్రజలపై మోదీ మోయలేనంతగా భారాలను వేస్తుంటే ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. కేసులకు భయపడే ఆయన్ను విమర్శించేందుకు జగన్ భయపడుతున్నారని పేర్కొన్నారు.

రేపు వైసీపీ సమన్వయకర్తలతో జగన్ భేటీ

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ వైసీపీ సమన్వయకర్తలతో సమావేశం కానున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేసే ఉద్దేశంతో.. బుధవారం మధ్యాహ్నం తాడేపల్లి ప్యాలెస్‌లో ఏర్పాటుచేసిన ఈ భేటీకి 175 అసెంబ్లీ.. 25 లోక్‌సభ స్థానాల సమన్వయకర్తలు హాజరవుతారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కూడా రావాలని జగన్ ఆదేశించారు.

25న డీఎస్సీ సభ.. పవన్‌కు లోకేశ్ ఆహ్వానం

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసే డీఎస్సీ సభను ఈ నెల 25న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సభకు హాజరు కావాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను మంత్రి నారా లోకేశ్ ఆహ్వానించారు. సోమవారం అసెంబ్లీలో పవన్‌ను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయకపోగా, మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు ప్రత్యర్థులు 106 కేసులు వేశారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. దీనివల్ల ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగుల కలలు సాకారమయ్యాయని తెలిపారు.

ప్రైవేటు డిగ్రీ కాలేజీల బంద్

» ఫీజు బకాయిల కోసం యాజమాన్యాల డిమాండ్

ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు డిగ్రీ కాలేజీల సంఘం సోమవారం నుంచి సమ్మెలోకి దిగింది. పలు యాజమాన్యాల పరిధిలోని కాలేజీలు.. విద్యా సంస్థలను మూసివేసి బంద్‌కు మద్దతు తెలిపాయి. ఈ నెల 27 వరకు బంద్ కొనసాగిస్తామని సంఘం ప్రతినిధులు కె.గుండారెడ్డి, పి.జయరాం, పి.పెద్దిరోజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సెలవుల అనంతరం అక్టోబరు 6 నుంచి విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలు చేపడతామన్నారు. గత 16 నెలలుగా ఫీజు బకాయిలు విడుదల చేయలేదని, దీంతో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని తెలిపారు. బంద్‌కు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపాయన్నారు.

జాషువా జయంతి ఘనంగా నిర్వహిద్దాం: మాధవ్

మహాకవి గుర్రం జాషువా జయంతిని రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని ఏపీ బీజేపీ నిర్ణయించింది. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, 'సెప్టెంబరు28న జాషువాజయంతి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలి. విజయవాడలో ఆయనను ఘనంగా గుర్తు చేసుకోవాలి. గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించి తెలుగు నేలకే వన్నెతెచ్చిన ఆధునిక తెలుగు కవి ఆదర్శాల గురించి ఈ తరానికి తెలియజెప్పాల్సిన బాధ్యత ఉంది' అని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ ఆర్‌డీ విల్సన్, ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ, పలువురు నేతలు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలంకరణతో కాంతులీనుతున్న తిరుమల శ్రీవారి ఆలయం

బ్రహ్మోత్సవాల్లో

సామాన్యులకే ప్రాధాన్యం


» అన్ని విభాగాల సమన్వయంతో సమగ్ర ప్రణాళిక

» మాడ వీధుల్లో భక్తుల భద్రతకు పెద్దపీట

» నిఘాపై రియల్ టైం మానిటరింగ్

» 'ఆంధ్రజ్యోతి'తో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్

(తిరుమల-ఆంధ్రజ్యోతి)



కలియుగ వైకుంఠం తిరుమల బ్రహ్మోత్సవ సంరంభానికి సిద్ధమైంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా శ్రీవేంకటేశ్వరస్వామి వారి దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ప్రణాళిక మేరకు బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరుగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న వివరాలు..

ఎలాంటి ఇబ్బందులు లేకుండా..

తిరుమల పవిత్రత కాపాడుకుంటూ సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దానికి అనుగుణంగా బోర్డు సభ్యులు, అధికారులందరం కలిసి నిర్ణయాలు తీసుకున్నాం. ఎస్ఎస్‌డీ (స్లాటెడ్ సర్వదర్శనం) టోకెన్ల కోటా పెంపుతో పాటు ఆన్‌లైన్ రూ.300 దర్శన టికెట్లు అధికంగా ఇచ్చాం. నేరుగా తిరుమలకు వచ్చే సామాన్య భక్తులకే అధిక సంఖ్యలో గదులు కేటాయించేలా చర్యలు చేపట్టాం. వాహన సేవలు వీక్షించేందుకు మాడవీధుల్లోకి వచ్చే, వెలుపల ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదాల వితరణ, 110 మందితో వైద్య సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించాం. పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయడంతో పాటు సరిపడా తాత్కాలిక టాయిలెట్లను ఏర్పాటు చేశాం.

పటిష్ఠ భద్రత

సెక్యూరిటీ పేరుతో మాడ వీధుల్లోకి భక్తులు ప్రవేశించే సమయంలో ఇబ్బందులు పెట్టకూడదని నిర్ణయించాం. భద్రత కల్పనలో లోపాలు లేకుండా దాదాపు 6 వేల మందితో సేవలందించాలని ఆదేశాలిచ్చాం. గరుడ సేవ రోజు అదనంగా మరో 1,300 మంది బందోబస్తులో భాగస్వాములు కానున్నారు. దాదాపు 3 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. వీటిద్వారా రియల్ టైంలో మానిటర్ చేస్తాం. కమాండ్ కంట్రోల్ రూం నుంచి అన్నిటినీ నిరంతరాయంగా పరిశీలిస్తుంటారు.

సమన్వయ లోపాలకు చెక్

టీటీడీ, పోలీసు, విజిలెన్స్ అధికారులతో కొన్ని బృందాలను ఏర్పాటు చేశాం. వారు మాడ వీధుల్లోని గ్యాలరీల వద్ద సెక్టార్ల వారీగా విధులు నిర్వహిస్తారు. భక్తులతో నేరుగా మాట్లాడతారు. ముందస్తు ప్రణాళికలను అమలుచేస్తారు. శ్రీవారి సేవకులు కూడా గ్యాలరీల్లోనే ఉంటూ భక్తులకు సేవలందించడంతో పాటు ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొస్తారు. ఈసారి సమన్వయ లోపానికి ఆస్కారం లేదు.

4 వేల వాహనాలకు పార్కింగ్ సిద్ధం

4 వేల వాహనాలకు సరిపడా పార్కింగ్ ప్రదేశాలను తిరుమలలో సిద్ధం చేశాం. అంతకు మించి వస్తే తిరుపతిలోని పార్కింగ్ ప్రదేశాలకు మళ్లిస్తాం. వారికి ఆయా ప్రదేశాల్లో బస్సులు అందుబాటులో ఉంటాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ 1,900 ట్రిప్పులు, గరుడ సేవ రోజున మూడు వేల ట్రిప్పులను తిప్పేందుకు ఆర్టీసీ ప్లాన్ చేసింది.

పూర్వ జన్మ సుకృతం

రెండవసారి టీటీడీ ఈవోగా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు. ఒక్కసారి ఈవో కావడమే పూర్వ జన్మ సుకృతంగా భావిస్తారు. అలాంటిది నేను రెండోసారి ఈవో అయ్యాను. మొదటిసారి ఈవోగా నియమితమైనప్పుడు చాలా మంది నార్త్ ఇండియన్, సౌత్ ఇండియన్ అంటూ చర్చలు పెట్టారు. కానీ రెండోసారి ఈవోగా వస్తుంటే చాలా మంది స్వాగతించారు. ఇప్పటికే నాలుగు బ్రహ్మోత్సవాలు పూర్తిచేసిన అనుభవంతో ఐదో బ్రహ్మోత్సవాన్ని వైభవంగా, వివాదరహితంగా నిర్వహిస్తాననే గట్టి నమ్మకముంది.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు

నేడు అంకురార్పణ

తిరుమల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరుగనుంది. సాయంత్రం ఆలయంలో సేనాధిపతి విష్వక్సేనుడిని అలంకరించి తిరుచ్చిపై నాలుగు మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఆయన బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించిన తర్వాత రంగనాయక మండపంలో ఆస్థానం నిర్వహిస్తారు. అనంతరం యాగశాలలో అర్చక స్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ (బీజవాపం) నిర్వహిస్తారు. దీంతో స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకలు మొదలవుతాయి. ఇక, బుధవారం సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణం జరుగుతుంది. రాత్రి పెద్ద శేష వాహనంతో బ్రహ్మోత్సవాల వాహన సేవలు ప్రారంభమవుతాయి. కాగా, శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

రేపు తిరుమలకు ఉప రాష్ట్రపతి

ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం తిరుమలకు రానున్నారు. ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ బుధవారం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి రోడ్డుమార్గాన తిరుమల చేరుకుంటారు. రాత్రికి తిరుమలలో బసచేసి మరుసటి రోజు శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారు.

కార్నర్ పాయింట్స్ నుంచి దర్శనం

మాడ వీధుల్లోని గ్యాలరీల్లో 1.80 నుంచి దాదాపు 2 లక్షల మంది కూర్చుని వాహన సేవలను వీక్షించే అవకాశముంటుంది. రెండేళ్ల నుంచి మాడవీధుల్లోని నాలుగు కార్నర్ పాయింట్ల నుంచి భక్తులను క్యూలైన్ ద్వారా అనుమతించి దర్శనం కల్పిస్తున్నాం. అయితే గతేడాది ఇలా క్యూలైన్‌లోకి ప్రవేశించే సమయంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. ఈసారి 45 నిమిషాల పాటు వాహనాన్ని కార్నర్ పాయింట్లలో ఉంచి హోల్డింగ్ పాయింట్ల ద్వారా భక్తులను అనుమతించి దర్శనం చేయిస్తాం. గతేడాది ఈ పాయింట్ల ద్వారా 16 వేల మందికి దర్శనం చేయిస్తే ఈసారి దాదాపు 30 వేల మందికి దర్శనం చేయించేలా ప్రణాళిక రూపొందించాం.

చిన వెంకన్నకు రూ.కోటి విరాళం



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో కొలువైన శ్రీవారి ఆలయంలో అద్దాల మండపం నిర్మాణానికి రూ.కోటి విరాళం సోమవారం అందింది. అనకాపల్లికి చెందిన ఫారెస్ట్ రేంజ్ విశ్రాంత అధికారి బొండాడ కొండలరావు ఈ విరాళం చెక్కును ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తికి అందజేశారు. దాతను ఈవో సత్కరించారు.

శ్రీవారికి రూ.1.8 కోట్ల బంగారు పతకాలు





తిరుమల: తిరుమల శ్రీవారికి సోమవారం రూ.1.8 కోట్ల విలువైన బంగారు పతకాలు, వెండి తట్టలను శ్రీసంస్థాన్ గోకర్ణ పర్తగాళి జీవోత్తమ మఠాధిపతి విద్యాధీశతీర్థ స్వామిజీ విరాళంగా అందజేశారు. ఆలయంలో టీటీడీ పేష్కార్ రామకృష్ణకు 15 బంగారు పతకాలు, రెండు వెండి తట్టలను అందజేశారు.





మరో రూ.కోటి విలువైన పతకాల విరాళం

తిరుమల: చెన్నైకు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు సాధారణ రాళ్లు పొదిగిన తొమ్మిది బంగారు పతకాలను శ్రీవారికి విరాళంగా అందజేశారు. సుమారు రూ.కోటి విలువైన వీటిని సోమవారం శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో అధికారులకు అందజేశారు. వీటిని శ్రీవారి ఉత్సవమూర్తులకు అలంకరించనున్నారు.

శైలపుత్రిగా భ్రమరాంబ దర్శనం



శ్రీశైలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు భ్రమరాంబికా అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం భృంగి వాహనంపై స్వామి, అమ్మవార్లు విహరించారు.

సీబీఎస్సీ సీటు ఇస్తామని మోసం

ఆకాష్ ఇనిస్టిట్యూట్ నిర్వాకం ● పటమట పీఎస్‌లో ఫిర్యాదు

విజయవాడ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సీబీఎస్సీ బైపీసీలో చేర్పించుకుని ఆకాష్ ఇన్స్‌స్టిట్యూట్ నిర్వాహకులు మోసం చేశారని ఓ మహిళ పటమట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పటమటకు చెందిన శ్రీదేవి తన కుమార్తెను ఇంటర్ బైపీసీ సీటుకోసం బెంజిసర్కిల్‌లోని ఆకాష్ ఇనిస్టిట్యూట్‌లో 2024 జూలైలో చేర్పించి రూ.75వేలు ఫీజు చెల్లించారు. నెల తర్వాత తరగతులు మొదలవుతాయని చెప్పారు. నెల పూర్తయినా తరగతులు మొదలు కాకపోవడంతో ప్రశ్నించేసరికి విజయవాడ, హైదరాబాద్‌లో సీబీఎస్సీ లేదని, బెంగళూరులోనే ఉందని అక్కడికి ట్రాన్స్‌ఫర్ చేస్తామన్నారు. లెటర్ ఇవ్వమని అడిగితే అటువంటిదేమీ లేదని నేరుగా ఇనిస్టిట్యూట్‌కు వెళ్లి చేరమని నిర్వాహకులు చెప్పారు. వారు చెప్పినట్టు నవంబరులో బెంగుళూరు ఇనిస్టిట్యూట్‌కు వెళ్లి అడగ్గా అడ్మిషన్ నెంబరు నమోదవ్వలేదన్నారు. ఇక్కడి వాళ్లను సంప్రదిస్తే చెల్లించిన ఫీజులో రూ.50 వేలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కుమార్తె ఏడాది చదువుతోపాటు డబ్బు కోల్పోయామని, వారిపై కఠిన చర్యలు తీసుకుని ఫీజు మొత్తాన్ని ఇప్పించాలని పోలీసులకిచ్చిన ఫిర్యాదులో కోరారు.

సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా

బాధ్యతలు స్వీకరించిన భార్గవతేజ్



కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా అమిలినేని భార్గవ్‌తేజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు, అదనపు కమిషనర్ జీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం సీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది భార్గవ్‌తేజకు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.





కూలిన ఇంటి గోడ, గాయపడిన యువతిని పరీక్షిస్తున్న డాక్టర్

ఇంటి గోడకూలి నలుగురికి గాయాలు

తిరువూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతి నగర్‌లోని 7వ వార్డులో సోమవారం తెల్లవారుజామున, ఇంటి మట్టి గోడ కూలడంతో నలుగురు గాయపడ్డారు. కొన్నిరోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు పెంకుటిల్లు మట్టిగోడ నాని కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన మునలం పుల్లారావు, నాగమణి దంపతులతో పాటు వారి కుమారుడు మహేష్ స్వల్పంగా గాయపడగా, కుమార్తె భార్గవి తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రుల్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్గవికి కంటివద్ద తీవ్ర గాయమవడంతో పట్టణానికి చెందిన కంటివైద్యుడు సూరపనేని జయసింహా పరీక్షించారు. ప్రమాదంతో యువతికి పక్కటెముకలు దెబ్బతినడంతో, మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. 7వ, వార్డు కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు (బీరువాలబాబు) టీడీపీ నేతలు తాళ్లూరి రామారావు, వైద్యశాల కమిటీ డైరెక్టర్ ఆకుల ప్రసాదు, టీడీపీ పట్టణాధ్యక్షుడు మల్లెల శ్రీనివాస్, పర్వతం శ్రీను, మోదుగు వెంకటేశ్వరరావులు క్షతగాత్రున్ని పరామర్శించారు.

సంగమంలో విజయనర్తనం

అంగరంగ వైభవంగా ప్రారంభమైన సాంస్కృతికోత్సవం

- పవిత్ర సంగమానికి భారీగా తరలివచ్చిన జనసందోహం
- దసరా ఉత్సవాల సందర్భంగా సంగమ ప్రాంతంలో ఉత్సవాలు
- ప్రతిరోజూ అమ్మవారి అలంకారాలతో ప్రత్యేక పూజలు
- సాయంత్రం వీనులవిందైన సాంస్కృతిక ప్రదర్శనలు
- కొండపల్లి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ధూమ్‌ధామ్‌గా వేడుకలు





విజయవాడ కల్చరల్/ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాలను పురస్కరించుకుని పవిత్ర సంగమంలో కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విజయనర్తనం' సాంస్కృతిక ప్రదర్శనలు అంగరంగవైభవంగా ప్రారంభమైంది. భారీగా వచ్చిన వీక్షకులకు కనువిందైన సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్యాలు, జానపద నృత్యాలు మైమరపించాయి. నాట్యాచార్య సప్పా శివకుమార్ బృందం, మావులూరి త్రినాథాచారి, పావని, నరేంద్ర విద్యార్థులు ప్రదర్శించిన నాట్యంశాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. పవిత్ర సంగమంలో అమ్మవారిని ఈరోజు బాలా త్రిపుర సుందరగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయనర్తనం పేరిట దసరా సాంస్కృతిక ఆధ్యాత్మిక మహోత్సవాలు అక్టోబరు 2 వరకు జరుగుతాయని కొండపల్లి మునిసిపల్ కమిషనర్ రమ్యకీర్తన చెప్పారు. ఈ ఉత్సవాలను సోమవారం సాయంత్రం మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చరిత్రలో ఎప్పుడూ జరగనంత గొప్పగా ఎన్టీఆర్ జిల్లాలో దసరా ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. దేశ సంస్కృతికి ఆచారాలకు కళలే చిహ్నాలన్నారు. కలలను ప్రోత్సహించడం వల్ల మన సంస్కృతిని వారసత్వానికి అందించినవాళ్లమవుతున్నామన్నారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికిలపూడి శ్రీనివాసరావు, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు.

జీఎస్టీ సంస్కరణలతో ఆటోమొబైల్ రంగానికి ఊతం

● వరుణ్ గ్రూప్ డైమండ్ జూబ్లీ వేడుకల్లో సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో ఆటోమొబైల్ రంగం మరింత అభివృద్ధి చెందడానికి ఉపకరిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. వరుణ్ గ్రూప్ డైమండ్ జూబ్లీ వేడుకలు సోమవారం విజయవాడలోని వరుణ్ నోవాటెల్‌లో జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రబాబు మాట్లాడుతూ ఏపీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, భవిష్యత్తులో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఒక సంస్థ 75 ఏళ్ల ప్రస్థానమంటే చాలా గొప్ప విషయమన్నారు. 'కృష్ణా జిల్లా వాళ్లు తెలివైన వారు. ఒకప్పుడు విజయవాడ నగరం ఎంతో మంది గొప్పవారిని ప్రపంచానికి అందించింది. ఇక్కడున్న గొప్పవారంతా ప్రపంచమంతా వివిధ రంగాల్లో విస్తరించారు. అమరావతి నిర్మాణంతో మళ్లీ ప్రపంచంలో ఉన్నవారంతా తిరిగి ఇక్కడికి వస్తారన్న నమ్మకం ఉంది. అమరావతి అభివృద్ధికి తోడ్పడతారన్న నమ్మకం ఉంది.' అని చంద్రబాబు పేర్కొన్నారు. వరుణ్ గ్రూప్ అధినేత ప్రభు కిశోర్ జీవిత చరిత్ర ద విన్నరియన్ పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు, సీఎం సతీమణి భువనేశ్వరి పాల్గొన్నారు.

ప్రతి ఏడాది 7లక్షల మంది పేదలకు వైద్యసేవలు: చైర్మన్ ప్రభుకిషోర్



భారతీనగర్: వరుణ్ గ్రూప్ వ్యాపార రంగంతో పాటు సామాజిక సేవలో నూ ముందుంటుంది. అందులో భాగంగా ప్రతి ఏడాది 7లక్షల మంది పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందని వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్ అన్నారు. వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్, జాయింట్ ఎండీ వర్ష పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి వరుణ్ గ్రూప్ 75వ వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. చైర్మన్ ప్రభుకిషోర్ మాట్లాడుతూ వరుణ్‌గ్రూప్ తన అద్భుతమైన 75 ఏళ్లు విశిష్టమైన వైభవంగా కొనసాగుతుందన్నారు. ఎండీ వరుణ్‌దేవ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రులు నవరత్నం, కేశవరావు స్మారకార్థం ప్రభుకిషోర్ రాష్ట్రవ్యాప్తంగా హెల్త్‌సెంటర్లు స్థాపించారని, ప్రస్తుతం 9 హెల్త్ సెంటర్లు ఉన్నాయన్నారు.

దుర్గగుడికి 96 మందితో సేవా కమిటీ

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో జరుగుతున్న దసరా మహోత్సవాల సందర్భంగా అటు దేవస్థానానికి, ఇటు భక్తులకు అనుసంధానంగా ఉండి ఉత్సవాలను విజయవంతం చేయటంలో సహకరించటానికి 96 మందితో సేవా కమిటీని నియమిస్తూ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఉత్తర్వులిచ్చారు. పోలవరపు వెంకటరత్నం, దండుబోయిన రవి, తుమ్మల ఆదినారాయణ, తల్లిబోయిన సత్యనారాయణ, ఆరేపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ ఎం శ్రీకాంత్, బొడ్డు నాగలక్ష్మి, కోరుకొండ బట్టార్ శ్రీహరి, చిన్నంరాజు నరసరాజు, హరీష్ వ్యాస్, గూడెల శ్రీనివాసరావు, కోసూరు నవీన్ కుమార్, పడవల ఏడుకొండలు, రాళ్లపల్లి మాధవ్, కే స్రవంత్, ధనేకుల సుబ్బారావు, గూడపాటి పద్మశేఖర్, గాదిరాజు శ్రీనివాసరాజు, వి.వి.కె.నరసింహరావు, జీవన్ కన్నెదార, పాలాసి ఉమామహేశ్వరరావు, చిట్టా నిర్మల, పోకల సురేంద్ర బాబు, లింగం శివప్రసాద్, మోగుదల సుజాతారావు, సుఖాసి సరిత, యు.వి.శివాజీ, సోమి వెంకటేశ్వర్లు, పిల్లా శ్రీనివాస్, తుమ్మలపల్లి హరికృష్ణ, నెలకుర్తి వెంకట్రావ్, కళ్యాణం సూర్యప్రకాశ రావు, బూర కనకారావు, కర్లాటి వెంకటరమణ, దాది మురళి, పి.వి.సతీష్ (సి.ఎ), పి.మల్లికార్జున, గుర్రం కొండ, పేరాబత్తుల రమణ, సముద్రాల ప్రసాద్, వక్కలగడ్డ పవన్ కుమార్, కాకు మల్లికార్జున్ యాదవ్, బెవర మురళీకృష్ణ, ఆదిత్య, దొడ్ల రాజా, పోతిన అవినాష్, కత్తెర ప్రదీప్, అవారపు శ్రీనివాసరావు, అడ్డూరి ఉదయ భాస్కర్, పచ్చిపులుసు శివప్రసాద్, ఎలకల అనిల్ కుమార్, సూరగుడి శివలలిత, తిరుపతి అనూష, రెడ్డిపల్లి అనిత, సమ్మెటి నాగమల్లేశ్వరరావు (రాజు), ఏలూరు సాయి శరత్, బావిశెట్టి శ్రీనివాసరావు, ఆకుల రవిశంకర్, లింగం శివప్రసాద్, పొట్లూరి దర్శిత్, వెన్నా శంకరరావు, కె.కల్పన, తోట శ్రీను, పోతంశెట్టి నాగేశ్వరరావు, పాలవలస కోటేశ్వరరావు, పి.లక్ష్మి, రేపాకుల సాయిశ్రీనివాస్, చలసాని రమణ, శాయన శ్రీసత్యనారాయణ, చిట్టా నిర్మల, బడే ధర్మారావు, వెలగపూడి శ్రీనివాసరావు, కటిక వెంకట కోటేశ్వరరావు, దేవరపు మాల్యాద్రి, కటిక రాకేష్ నాథ్, మల్లెపు విజయలక్ష్మి, ఠాకూర్ అజయ్ వర్మ, తిరుపతి అనూష, కె.ఎస్.ఎన్.మూర్తి, లఖినం సాయి ప్రసాద్, ఈ. లలిత్ కుమార్, బి.రామకృష్ణ, డాక్టర్ పి.రేవతి, డి.సునీల్ కుమార్, వి.శ్రీనివాసరెడ్డి, సి.హెచ్.ఎస్.పి.గుప్తా, మోటమర్రి బాబాప్రసాద్, రాజా, సువర్ణ బాలాజీ, తిరుమలరావు, ఆర్.వేణు, సుధాకర్, అనిశెట్టి రామకోటేశ్వరరావు, నిరంజనరావు, దేవి నాగలక్ష్మి ప్రసన్న, దావు నాగరాజులు కమిటీలో ఉన్నారు.

విజయవాడ ఉత్సవ్‌కు సుప్రీం గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని తలపెట్టిన 'విజయవాడ ఉత్సవ్'కు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ భూములతో సంబంధం లేని వ్యక్తులకు అక్కడ నిర్వహించే ఉత్సవాలపై అభ్యంతరం ఎందుకుంటూ సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది. వ్యవసాయ భూములైతే రాష్ట్ర ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు చూసుకుంటారని సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది. విజయవాడ శివారు గొల్లపూడిలో మచిలీపట్నం గొడుగుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం వ్యవసాయ భూములను 'విజయవాడ ఉత్సవ్' పేరిట వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని బూరుగడ్డ సుజయ్ కుమార్, ఎన్ అయోధ్య రామచంద్రరావు హైకోర్టును ఆశ్రయించారు. ఆలయ వ్యవసాయ భూములను వాణిజ్య అవసరాలకు వినియోగించవద్దని హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేసింది. సింగిల్ జడ్జి తీర్పుపై హైకోర్టు సీజే ధర్మాసనం స్టే విధించింది. హైకోర్టు సీజే ధర్మాసనం తీర్పును సుజయ్ కుమార్‌తోపాటు అయోధ్య రామచంద్రరావు సెప్టెంబర్ 19న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.ఆ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసన విచారించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు రంజిత్ కుమార్, నచికేత జోషి వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం హైకోర్టు సీజే ధర్మాసనం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యానికి కారణాలేమీ కనిపించడం లేదని చెబుతూ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

ఎగ్జిబిషన్ నిర్వహణకు తొలగిన అడ్డంకులు: ఎంపీ



ఇబ్రహీంపట్నం: సుప్రీం కోర్టు తాజా ఆదేశాల నేపథ్యంలో గొల్లపూడి ఎగ్జిబిషన్ మైదానంలో ఉత్సవాల నిర్వహణకున్న అడ్డంకులన్నీ పూర్తిగా తొలగిపోయాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఐజీఎం స్టేడియంలో హెలికాప్టర్ రైడ్ ఏర్పాట్లను ఆయన సోమవారం స్వయంగా పరిశీలించి మీడియాతో మాట్లాడారు.

దుర్గా నవరాత్రులు



నేటి అలంకారం
శ్రీ శ్రీ గాయత్రీ దేవి
ఆశ్వయుజ శుద్ధ విదియ, మంగళవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజున విజయవాడలో ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ వారు గాయత్రీ దేవిగా దర్శనమిస్తారు. సమస్త దేవతా మంత్రాలకు గాయత్రీ మంత్రంలో అనుబంధం ఉంది. అందుకే ఆయా దేవతల మూల మంత్రాలతో గాయత్రిని చేర్చి 'రుద్రగాయత్రి', 'లక్ష్మీగాయత్రి', 'విష్ణుగాయత్రి' అని గాయత్రీ మంత్రంతో సంప్రోక్షణ చేసిన తర్వాతే ఆయా దేవతలకు నివేదన చేస్తారు. సకల మంత్రాలకి మూలమైన శక్తిగా, వేదమాతగా ప్రసిద్ధి పొందిన గాయత్రీదేవి ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో ప్రకాశిస్తూ, పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్ఠానదేవత. ఆ తల్లి అధిష్ఠాన దేవత సూర్యభగవానుడు. కాబట్టి గాయత్రీ అమ్మవారిని దర్శించుకోవడం వల్ల సూర్యుడు అనుగ్రహంతో ఆరోగ్యం లభిస్తుందని నమ్మిక. ప్రాతఃకాలంలో గాయత్రి గాను, మధ్యాహ్న కాలంలో సావిత్రి గాను, సాయంసంధ్యలో సరస్వతి గాను ఆమె భక్తుల పూజలు అందుకుంటుంది. గాయత్రీ ఉపాసనతో బుద్ధి తేజోవంతం అవుతుందనీ, గాయత్రీ మంత్ర జపం చతుర్వేద పారాయణ ఫలితాన్నిస్తుందనీ పురాణాలు చెబుతున్నాయి. వరదాభయహస్తాలతో సకల వేద స్వరూపమైన గాయత్రీదేవిని ఆదిశంకరులు అనంతశక్తి స్వరూపంగా అర్చించారు. గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ దుర్గమ్మను ధ్యానిస్తే సకల మంత్ర సిద్ధి, బ్రహ్మజ్ఞానం కలుగుతాయని, పూజించిన వారికి సద్బుద్ధులు కలుగుతాయని, పాపాలు నశిస్తాయని, అజ్ఞానం తొలగిపోతుందని పురాణాలు చెబుతున్నాయి.

నైవేద్యం:
అల్లం గారెలు, ఐదు రకాల పిండివంటలు
అలంకరించే చీర రంగు:
తెలుపు
పారాయణ:
గాయత్రీ మంత్రం

బరువు తగ్గడం కోసం సరైన ఆహారాన్ని ఎంచుకోవడమే కాదు, ఆ ఆహారాన్ని ఎక్కువ సార్లు నమిలి తినాలి. అలాగే ఆహార వేళలు, నిద్రవేళలు కూడా క్రమం తప్పకుండా పాటించగలిగితే, తక్కువ సమయంలో ఎక్కువ బరువును వదిలించుకోవడం కష్టమేమీ కాదని తాజాగా నటుడు మాధవన్ నిరూపించారు. మాధవన్ పాటించిన నియమాల్లో ఎలాంటి రహస్యాలు దాగి ఉన్నాయో వైద్యులు వివరిస్తున్నారు.



ఇలా చేస్తే..
బరువు బలాదూర్

ఉపవాసాలు, వ్యాయామాలు, ఆహార నియమాలు... ఇలా బరువు తగ్గడం కోసం అనేక ప్రయత్నాలు చేసి విసిగిపోయినవాళ్లు, అందుకు అడ్డుపడే ఇతరత్రా అంశాల మీద కూడా దృష్టి పెట్టాలి. బరువు తగ్గకపోగా, కడుపుబ్బరం, అజీర్తి లాంటివి ఇబ్బంది పెడుతున్నప్పుడు ఫుడ్ ఇన్‌టాలరెన్స్, ఫుడ్ అలర్జీలను కూడా పరీక్షించుకోవాలి. అలాగే కొన్ని పదార్థాలు శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతాయి. వీటిలో అత్యధిక చక్కెరను కలిగి ఉండే పదార్థాలు ప్రధానమైనవి. వీటితో కీళ్ల వాపులు, మలబద్ధకం, పొట్టలో వాయువులు, నొప్పులు వేధిస్తాయి. అలాగే ఇన్‌ఫ్లమేషన్ బరువు తగ్గే ప్రయత్నాలకు అడ్డుపడుతూ ఉంటుంది. కాబట్టి ఫ్లేవనాయిడ్లు ఎక్కువగా ఉండే రంగు రంగుల పండ్లు, కూరగాయలు, నట్స్, సీడ్స్ తినాలి. వీటితో ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, బరువు తగ్గే ప్రక్రియ ఊపందుకుంటుంది. అలాగే ఇన్‌ఫ్లమేషన్‌ను ప్రోత్సహించే ఫాస్ట్ ఫుడ్స్, నూనెలో వేయించిన పదార్థాలు, తీయని పానీయాలు తీసుకోవడం మానేయాలి.


రాత్రి భోజనం సాయంత్రమే...

రాత్రి తినే భోజనానికీ ఉదయం తీసుకునే అల్పాహారానికీ మధ్య కనీసం 12 గంటల నిడివి ఉండాలి. కానీ రాత్రి ఆలస్యంగా 12 గంటలకు తిని, ఉదయాన్నే 8 గంటలకే బ్రేక్‌ఫాస్ట్ తీసుకున్నప్పుడు జీర్ణ వ్యవస్థకు సరిపడా విశ్రాంతి అందదు. అలాగే సాయంత్రానికి మన మనసు, శరీరం, అంతర్గత అవయవాలన్నీ విశ్రాంత స్థితిలోకి చేరుకోవడం మొదలుపెడతాయి. కాబట్టి సాయంత్రం వీలైనంత పెందలాడే భోజనం ముగించేయడం మంచిది. ఈ అలవాటును అలవరుచుకోవడం వల్ల తిన్న ఆహారం పూర్తిగా జీర్ణమయ్యే సమయం చిక్కుతుంది.

మూడు భోజనాలు తినొచ్చు

కొంతమంది రోజుకు రెండు భోజనాలు, ఒక భోజనానికే పరిమితమైపోతూ ఉంటారు. కానీ నిజానికి రోజుకు మూడుసార్లు లేదా సాయంత్రం ఐదు గంటలకు ఒక స్నాక్‌తో కలిపి నాలుగు సార్లు తింటూ కూడా బరువు తగ్గొచ్చు. అయితే తిన్న ప్రతిసారీ ఏం తింటున్నామన్నది గమనించుకోవాలి. రోజుకు సరిపడా క్యాలరీలను అందించే ఆహారాన్ని మూడు, నాలుగు భాగాలుగా విభజించుకుని తినడం వల్ల బరువు పెరిగే సమస్య ఉండదు. అదనపు క్యాలరీలు అందించే ఆహారంతోనే అసలు సమస్యంతా! కాబట్టి ఒంటిపూట భోజనంతో, లేదా రెండు పూటల భోజనంతో అవసరానికి మించి ఎక్కువ క్యాలరీలు తీసుకోడానికి బదులుగా మూడు భోజనాలతో తక్కువ క్యాలరీలు పొందుతూ బరువును తగ్గించుకోవచ్చు. అలాగే ఆహారంలోని క్యాలరీలతో పాటు అందే ప్రొటీన్ పరిమాణం మీద కూడా దృష్టి పెట్టాలి. భోజనంలో ప్రొటీన్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.

అన్నం, రోటీలతో పొట్టను నింపేస్తే అవి త్వరగా జీర్ణమై తరచూ ఆకలి వేధిస్తుంది. కాబట్టి సంతృప్తితో పాటు సరిపడా పోషకాలను అందించే కూరగాయలు ఎక్కువగా, అన్నం, రోటీలు తక్కువగా తీసుకోవాలి. అందుకోసం భోజన పళ్లెంలో పావు వంతును మాత్రమే అన్నం లేదా రోటీతో నింపుకోవాలి. ఇంకొక పావు వంతు సలాడ్/కూరగాయలు, పావు వంతు ప్రొటీన్ (చికెన్/చేపలు/గుడ్లు/రాజ్మా, సెనగలు), పావు వంతు పప్పు, పెరుగుతో నింపేయాలి.



నిద్ర.. నీళ్లు

రాత్రుళ్లు ఆలస్యంగా నిద్రపోయినా, సరిపడా నిద్రపోకపోయినా శరీరానికి కోలుకునే సమయం దక్కదు. దాంతో భౌతిక ఒత్తిడి పెరుగుతుంది. ఆలస్యంగా నిద్రపోయేవాళ్లు రాత్రి భోజనం తర్వాత కూడా చిరుతిళ్లు తినే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఆ విధంగా అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరుకుని బరువు పెరుగుతారు. అలాగే తిన్నది పూర్తిగా జీర్ణమవడానికి సరిపడా నీళ్లు అవసరం. కాబట్టి రోజుకు కనీసం రెండు నుంచి రెండున్నర లీటర్ల నీళ్లు తీసుకోవాలి.

ఆహారం నమిలి తినాలి

ఆహారాన్ని హడావుడిగా, ఆదరాబాదరాగా తినేయడం సరికాదు. చక్కగా నమిలి తినడం వల్ల, తినే వేగం తగ్గి, తక్కువ ఆహారం తినగలుగుతాం. అలాగే ఆహారం తింటున్న సంకేతాలు మెదడుకు అంది తక్కువ ఆహారంతోనే సంతృప్తి చెందగలుగుతాం! ఆహారాన్ని చక్కగా నమిలి తినడం వల్ల, జీర్ణాశయానికి శ్రమ తగ్గుతుంది. పోషక శోషణ పెరుగుతుంది.

వ్యాయామం ఇలా...

కండరాలు క్యాలరీలను చక్కగా ఉపయోగించుకోవాలంటే, కండరాలను పెంచే రెసిస్టెన్స్ వ్యాయామాలు చేయాలి. ప్రత్యేకించి బరువు తగ్గాలనుకునేవాళ్లు గుండె వేగాన్ని పెంచే వ్యాయామాలతో పాటు కండరాలు పెరిగే వ్యాయామాలు చేయడం తప్పనిసరి.

ఆరోగ్య సూత్రాలు


నటుడు మాధవన్ అనుసరించిన ఆహార సూత్రాలను మనం కూడా అనుసరించవచ్చు. అందుకోసం పాటించవలసిన నియమాలు ఇవే!

- తింటున్న ఆహారం మీద దృష్టి పెట్టాలి. తినేటప్పుడు ఫోన్లు, టివిలకూ, కబుర్లకూ దూరంగా ఉండాలి. ప్రతి ముద్దనూ ఎక్కువ సార్లు నమిలి తినాలి.
- ఆహార వేళలు కచ్చితంగా పాటించాలి. రోజులో చివరి భోజనం వీలైనంత త్వరగా (సాయంత్రం 6-7 గంటలు) ముగించాలి.
- ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేయొచ్చు. అందుకోసం ఎవరికి వారు వారి జీవనశైలిని బట్టి 12 నుంచి 14 గంటల రాత్రి ఉపవాసం పాటించాలి. మధుమేహులు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలున్నవాళ్లు ఉపవాసం విషయంలో వైద్యుల సలహా తీసుకోవాలి.
- ఆహారంలో కూరగాయలు, పొట్టు తీయని ధాన్యాలు, ప్రొటీన్ పెంచి, పాలిష్ పట్టిన పదార్థాలు, చక్కెర, కొవ్వు పదార్థాలు తగ్గించాలి.
- నడక, రెసిస్టెన్స్ ట్రైనింగ్, సరిపడా నిద్ర, నీళ్లు.. వీటి మీద దృష్టి పెట్టడంతో పాటు, నిద్రకు ముందు స్క్రీన్ టైమ్ తగ్గించాలి. కంటినిండా నిద్రపోవాలి.
- అలర్జీలు, ఇన్‌టాలరెన్స్‌లు ఎవరికి వారు గమనించుకోవాలి. కడుపుబ్బరం, అజీర్తి, అపానవాయువులు, దురదలు లాంటివి వేధిస్తూ ఉంటే వైద్యులను కలవాలి.
- సాధారణంగా బరువు తగ్గడం కోసం, తీసుకుంటున్న క్యాలరీలు, ఖర్చవుతున్న క్యాలరీల మీదే దృష్టి పెడుతూ ఉంటాం. కానీ ఆహారాన్ని ఎలా నములుతున్నాం, ఎంత తింటున్నాం, ఎప్పుడు తింటున్నాం, ఎంత నిద్రపోతున్నాం అన్నది కూడా ముఖ్యం. వీటిని ఎవరికి వారు పరిశీలించుకుని, వైద్యుల సూచనల మేరకు ఆహార, వ్యాయామ నియమాలను పాటించగలిగితే ఆరోగ్యకరమైన తీరులో అధిక బరువును వదిలించుకోవచ్చు.

హరిత శ్యామ్ బి
హెచ్ఓడి ఆఫ్ డైటరీ,
అపోలో హాస్పిటల్స్
జూబ్లీహిల్స్ హైదరాబాద్



అవగాహన



రష్యా, తాజాగా క్యాన్సర్‌ను అడ్డుకునే 'ఎంటెరోమిక్స్' వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసిందనే వార్తలు వింటున్నాం. అయితే ఈ వ్యాక్సిన్‌తో అన్ని రకాల కాన్సర్ల నుంచి శాశ్వత విముక్తి పొందవచ్చా? ఇది నిజం కాదని అంటున్నారు వైద్యులు. ఈ వ్యాక్సిన్ సామర్థ్యం, అడ్డుకునే క్యాన్సర్ రకం గురించి ఇలా వివరిస్తున్నారు.

క్యాన్సర్ టీకాలో నిజమెంత?

ఒక టీకా అందుబాటులోకి రావాలంటే అది కొన్ని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి. ఒక టీకాను సురక్షితమైనదిగా, సమర్థమైనదిగా పరిగణించడం కోసం ప్రి క్లినికల్ స్టడీస్ చేపడతారు. ఈ స్టడీస్‌లో భాగంగా టీకా ప్రభావాన్ని పరిశీలించడం కోసం మొదట జంతువుల మీద పరీక్షించడం జరుగుతుంది. ఈ పరీక్షలో టీకా వల్ల జంతువుల్లో ఎలాంటి దుష్ప్రభావాలూ కనిపించకుండా, సామర్థ్యం కూడా ఉన్నట్టు నిర్ధారణ అయిన తర్వాతే మనుషుల మీద పరీక్షలు చేపట్టడం మొదలుపెడతారు. మనుషుల మీద చేపట్టే పరీక్షలు మూడు దశల్లో కొనసాగుతాయి. ఈ మూడు దశల్లో ఉత్తీర్ణత సాధించగలిగిన టీకా లేదా ఔషధాలను మాత్రమే మార్కెట్లోకి విడుదలవుతాయి. ఈ మూడు దశల్లో ఏ ఏ అంశాలను పరీక్షిస్తారంటే...

మొదటి దశ పరీక్ష: ఈ టీకాను 50 నుంచి 100 మందికి ఇస్తారు. రోగి భద్రతకు సంబంధించిన పరీక్ష ఇది. టీకా ఇచ్చినప్పుడు రోగి క్షేమంగా ఉన్నాడా, లేదా అన్నది ఈ పరీక్షలో పరిశీలిస్తారు. టీకా ఈ పరీక్ష నెగ్గితే, ఆ తర్వాత సామర్థ్యాన్ని పరీక్షిస్తారు

రెండో దశ పరీక్ష: ఇది సామర్థ్య పరీక్ష. ఈ పరీక్షలో టీకా సామర్థ్యంతో పాటు తర్వాతి దశ పరీక్షకు వెళ్లాలా, వద్దా అన్నది నిర్ణయిస్తారు. సదరు టీకాను క్యాన్సర్ నివారణకు ఉపయోగించుకోవచ్చా, లేదా అన్నది ఈ పరీక్షతో నిర్ధారిస్తారు. అలాగే కొత్త టీకాతో కీమోథెరపీ తగ్గించుకునే వీలుందా, లేదా అన్నది కూడా పరీక్షిస్తారు.

మూడో దశ పరీక్ష: ఈ టీకాను సమాజంలోకి ప్రవేశపెట్టినప్పుడు, దీని ప్రభావం గణనీయంగా ఉంటుందా, లేదా అన్నది ఈ పరీక్షలో పరిశీలిస్తారు. ఈ పరీక్షలో ముందు నుంచి వాడుకలో ఉన్న ఔషధాలతో, తాజా టీకాను సరిపోల్చి చూస్తారు. కొత్త టీకా అదనపు ప్రయోజనాన్ని అందించగలుగుతుందా, లేదా అన్నది ఈ పరీక్షలో కనిపెడతారు. అలా అన్ని విధాలా గణాంక విశ్లేషణ చేసిన తర్వాతే టీకాను మనుషులకు ఉపయోగించవచ్చని నిర్ధారిస్తారు. ముందు రెండు పరీక్షల్లో నెగ్గి, మూడో దశలో విఫలమైనా ఈ టీకా అందుబాటులోకి రాదు.

ఎంటెరోమిక్స్ పరిశోధన దశలోనే...

తాజా రష్యా టీకా ఎంటెరోమిక్స్, ఇంకా పరిశోధన దశలోనే ఉందనే విషయం అందరూ గుర్తు పెట్టుకోవాలి. రష్యన్ ఫెడరల్ అండ్ మెడికల్ బయలాజికల్ ఏజెన్సీ, ఎంటెరోమిక్స్‌ను 'ఎమ్ఆర్ఎన్ఎ' వ్యాక్సిన్‌గా ప్రకటించింది. ప్రి క్లినికల్ ట్రయల్‌లో భాగంగా ఈ టీకాను జంతువుల మీద పరీక్షించినప్పుడు, వాటిలో కణితి పరిమాణం తగ్గినట్టు, ఈ టీకాతో జంతువులు సురక్షితంగానే ఉన్నట్టు తేలింది. ఆ తర్వాత మొదటి దశ పరీక్షలో భాగంగా పెద్దపేగు క్యాన్సర్‌తో బాధపడుతున్న 48 మంది రోగులకు మాత్రమే ఈ టీకాను ఇవ్వడం జరిగింది. వీరిలో కూడా ఎటువంటి దుష్ప్రభావాలూ కనిపించలేదు. అయితే ఈ టీకా సామర్థ్యం కచ్చితంగా ఏ మేరకు ఉంటుందన్నది ముమ్ముందు చేపట్టబోయే రెండు, మూడో దశ పరీక్షల్లో మాత్రమే వెల్లడవుతుంది. దీన్నిబట్టి ఒకవేళ ఈ టీకా అన్ని పరీక్షలు ముగించుకుని అందుబాటులోకి వచ్చినా, ఇది అన్ని రకాల క్యాన్సర్లనూ నివారించదనీ, కేవలం పెద్దపేగు క్యాన్సర్‌ను నివారించే సామర్థ్యాన్ని మాత్రమే కలిగి ఉంటుందనే విషయం మర్చిపోకూడదు. అలాగే ఈ టీకా రెండు, మూడో దశ పరీక్షలు పూర్తి చేసుకోవడానికి కూడా కనీసం రెండు నుంచి మూడేళ్ల సమయం పడుతుంది. కాబట్టి అర్థం లేని అపోహలను విశ్వసించకుండా, అన్ని పరీక్షలు ముగించుకుని ఈ టీకా అందుబాటులోకి వస్తుందనే ఆశావహ దృక్పథంతో నడుచుకోవడం ఉత్తమం.

డాక్టర్ సుమంత్ కుమార్ మల్లుపట్టు
సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ అండ్ హెమటో ఆంకాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్.



రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీ

తుంటి కీలు మార్పిడి అంతకంతకూ సులభతరమవుతోంది. తాజాగా 'డైరెక్ట్ యాంటీరియర్ అప్రోచ్' అనే అత్యాధునిక శస్త్రచికిత్సా విధానమొకటి అందుబాటులోకొచ్చింది. పూర్తి తుంటి కీలును మార్చే ఈ రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీ, అన్నివిధాలా సురక్షితమైనదని వైద్యులు అంటున్నారు.

తుంటి కీలు మార్పిడి ఇక సులభతరం

శరీరం ముందు వైపు నుంచి తుంటిని చేరుకుని, కీలును మార్చే సర్జరీ, డైరెక్ట్ యాంటీరియర్ అప్రోచ్. చిన్నపాటి కోతతో, కచ్చితమైన రోబోటిక్ సాంకేతికతతో సాగే ఈ శస్త్రచికిత్సలో భాగంగా వైద్యుల కండరాల మధ్య నుంచి తుంటిని చేరుకుంటారు కాబట్టి కండరాలు, మృదు కణజాలలకు నష్టం జరగకుండా ఉంటుంది.



కచ్చితత్వంతో కూడిన శస్త్రచికిత్స

సిటి స్కాన్స్ ఆధారంగా రోగికి సంబంధించిన ఒక త్రిడి మోడల్‌ను రూపొందించుకుని, వైద్యులు రోబోటిక్ అసిస్టెన్స్ సహాయంతో, సర్జరీకి పూనుకుంటారు. సర్జరీ కంటే ఎంతో ముందుగానే పూర్తి శస్త్రచికిత్సను వైద్యులు ప్రణాళికాబద్ధంగా అంచనా వేసుకుంటారు. దాంతో ఇంప్లాంట్ పరిమాణం, దాన్ని అమర్చే ప్రదేశాల గురించిన కచ్చితమైన ప్రణాళికను రూపొందించుకోగలుగుతారు. అలాగే రోబోట్ వ్యవస్థ, ఎప్పటికప్పుడు అందించే ఫీడ్ బ్యాక్ ఆధారంగా వైద్యులు చికిత్స మీద నియంత్రణను పెంచుకుంటూ, సమర్థమైన ఫలితాన్ని రాబట్టేలా, ఎలాంటి దుష్ప్రభావాలకూ తావు లేని కచ్చితత్వంతో కూడిన చికిత్సను అందించగలుగుతారు.

చిన్న కోత ద్వారా...

ఈ శస్త్రచికిత్స చిన్న కోతతోనే పూర్తయిపోతుంది. కాబట్టి సర్జరీ తదనంతర నొప్పి ఎంతో తక్కువగా ఉంటుంది. అలాగే సర్జరీ నుంచి వేగంగా కోలుకోగలుగుతారు. ఈ ప్రయోజనాలకు తోడు సర్జరీలో ఉపయోగించిన ఇంప్లాంట్ ఆయుష్షు కూడా ఎక్కువగా ఉంటుంది. కండరాల కోత ఉండదు కాబట్టి సర్జరీ తర్వాత రోగులు అన్ని రకాల పనులూ చేసుకోగలుగుతారు.

డాక్టర్ కృష్ణ కిరణ్ ఈచెంపాటి
హిప్ అండ్ నీ రీప్లేస్‌మెంట్ అండ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్,
మెడికవర్ హాస్పిటల్స్, హైదరాబాద్



వ్యాయామం

బరువులు ఎత్తుతున్నారా?

ప్రి మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్, భావోద్వేగాల్లో హెచ్చుతగ్గులు, మొండి కొవ్వులు హార్మోన్ల అవకతవకల ప్రధాన లక్షణాలు. ఇలా హెచ్చుతగ్గులకు లోనయ్యే హార్మోన్లను గాడిలో పెట్టాలంటే మహిళలు తప్పనిసరిగా స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వ్యాయామాలు చేయాలి.

స్ట్రెంగ్త్ ట్రైనింగ్ కేవలం కండరాల వ్యాయామం మాత్రమే కాదు. ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్, ఇన్సులిన్, కార్టిసాల్, టెస్టోస్టిరాన్ హార్మోన్ల క్రమబద్ధీకరణకు ఈ వ్యాయామం అవసరం. బరువులు ఎత్తడం హార్మోన్ చికిత్సతో సమానం. బరువులు ఎత్తడం వల్ల శరీరంలో అదనపు ఈస్ట్రోజన్ తగ్గడంతో పాటు ప్రొజెస్టరాన్ సహజసిద్ధంగా పెరుగుతుంది. ఫలితంగా నెలసరి నొప్పులు, భావోద్వేగాల్లో హెచ్చుతగ్గులు అదుపులోకొచ్చి, నెలసరి కూడా గాడిలో పడుతుంది. అలాగే బరువులెత్తే వ్యాయామాలతో కండరాలు బలపడి, గ్లూకోజ్‌ను నిల్వ ఉంచుకునే సామర్థ్యం మెరుగుపడి, రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. ఇలాంటి ఇన్సులిన్ సంతులనం శక్తిని అందిస్తుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. అండాల విడుదలను క్రమబద్ధం చేస్తుంది. ఆకలిని అదుపులో ఉంచుతుంది. బరువులెత్తే వ్యాయామాలతో నాడీ వ్యవస్థ దృఢపడుతుంది. ఇన్‌ఫ్లమేషన్‌కు గురి కాకుండా ఒత్తిడిని తగ్గించుకునే సామర్థ్యం పెరుగుతుంది. 40 ఏళ్ల వయసు మహిళలు బరువులెత్తే వ్యాయామాలు చేయగలిగితే, ఎముకల సాంద్రత పెరుగుతుంది. పొట్ట కొవ్వు తగ్గుతుంది.కండర క్షీణత తగ్గుతుంది.




విత్తనాలు - ఉపయోగాలు

తెలుసుకుందాం

విత్తనాలు పోషకభాండాగారాలు. ఎన్నో విలువైన పోషకాలు విత్తనాల్లో ఉంటాయి. కాబట్టి వాటిని ఆహారంలో చేర్చుకుంటూ ఉండాలి. ఏ విత్తనాల్లో ఏఏ పోషకాలుంటాయో, వాటితో ఎలాంటి ప్రయోజనాలను పొందవచ్చో తెలుసుకుందాం!

గుమ్మడి: వంద గ్రాముల గుమ్మడి విత్తనాల్లో... ప్రొటీన్ 24.54 గ్రాములు, పిండిపదార్థాలు 17.81 గ్రాములు, కొవ్వులు 45.85 గ్రాములు, 541 కిలో క్యాలరీలు ఉంటాయి. వీటితో నిద్ర మెరుగుపడుతుంది. వీటితో దొరికే జింక్‌తో క్యాన్సర్ నుంచి రక్షణ దక్కుతుంది.

చియా: వీటిలో ప్రొటీన్ 17 గ్రాములు, పిండిపదార్థాలు 42 గ్రాములు, కొవ్వులు 31 గ్రాములు, 486 కిలోక్యాలరీలు ఉంటాయి. వీటితో గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. జీర్ణశక్తి పెరుగుతుంది. వీటిలోని పుష్కలమైన ఒమేగా3 యాసిడ్స్, యాంటీఆక్సిడెంట్స్‌తో ఇన్‌ఫ్లమేషన్ అదుపులోకొస్తుంది



అవిసె: వీటిలో ప్రొటీన్ 18 గ్రాములు, పిండిపదార్థాలు 29 గ్రాములు, కొవ్వులు 42 గ్రాములు, 534 కిలో క్యాలరీలు ఉంటాయి. వీటితో మలబద్ధకం వదులుతుంది. హార్మోన్ల హెచ్చుతగ్గులు అదుపులోకొస్తాయి. జీర్ణశక్తి పెరుగుతుంది.

పొద్దుతిరుగుడు: వీటిలో ప్రొటీన్ 21 గ్రాములు, పిండిపదార్థాలు 20 గ్రాములు, కొవ్వులు 51 గ్రాములు, 584 కిలోక్యాలరీలు ఉంటాయి. గుండె పనితీరు మెరుగుపడుతుంది. వ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

కార్ల షోరూమ్‌లు కళ కళ



జీఎస్‌టీ తగ్గడంతో పోటెత్తిన కస్టమర్లు

మారుతి, హ్యుండయ్ రికార్డు డెలివరీలు.. 50% పెరిగిన చిన్న కార్ల బుకింగ్‌లు

న్యూఢిల్లీ: వాహనాలపై జీఎస్‌టీ తగ్గింపు సోమవారం నుంచి అమలులోకి రావడంతో కార్ల షోరూమ్‌లు కొత్త కళను సంతరించుకున్నాయి. నవరాత్రుల తొలిరోజున తమ కార్ల రిటైల్ విక్రయాలు 25,000-30,000 మించవచ్చని దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్‌ఐ) తెలిపింది. కస్టమర్ల తాకిడితో షోరూమ్‌లు అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచాల్సి వచ్చిందని మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మార్కెటింగ్ అండ్ సేల్స్ పార్థో బెనర్జీ తెలిపారు. కంపెనీ డీలర్‌షిప్‌లకు ఒక్కరోజే 80,000 కస్టమర్ల ఎంక్వైరీలు వచ్చాయన్నారు. జీఎస్‌టీ తగ్గుదలతో చిన్న కార్ల బుకింగ్స్ 50 శాతం పెరిగాయన్నారు. కొన్ని మోడళ్ల వేరియంట్లకు అధిక గిరాకీ నెలకొనడంతో నిల్వలు నిండుకోవచ్చన్నారు. విక్రయాల పరంగా కంపెనీకిదే అత్యుత్తమ రోజని బెనర్జీ పేర్కొన్నారు.

నవరాత్రుల ఆరంభానికి జీఎస్‌టీ తగ్గుదల తోడవడంతో మార్కెట్ సెంటిమెంట్ అత్యంత సానుకూలంగా మారిందని హ్యుండయ్ మోటార్ ఇండియా సీఓఓ తరుణ్ గార్గ్ అన్నారు. జీఎస్‌టీ తగ్గిన తొలి రోజే తమ డీలర్లు 11,000 కార్లను విక్రయించారని, గడిచిన ఐదేళ్లలో కంపెనీకిదే అత్యధిక ఒక్కరోజు అమ్మకాలని ఆయన తెలిపారు. కొత్త కార్ల కొనుగోలు కోసం షోరూమ్‌లకు కస్టమర్ల తాకిడి భారీగా పెరిగిందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) అధ్యక్షులు సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు.

"గడిచిన 3-4 వారాలుగా కస్టమర్ల ఎంక్వైరీలు అనూహ్యంగా పెరిగాయి. దుర్గ నవరాత్రుల తొలి రోజుల విక్రయాలు భారీగా పుంజుకోనున్నాయని" ఆయన పేర్కొన్నారు.

సెకండ్ హ్యాండ్ కార్లకూ భలే గిరాకీ

యూజ్డ్ కార్ల విక్రయాలూ అనూహ్యంగా పెరిగాయని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'కార్స్24' తెలిపింది. రోజువారీ సగటుతో పోలిస్తే, సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు కార్ల డెలివరీలు ఏకంగా 400 శాతం పెరిగాయని తెలిపింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో అధిక విక్రయాలు నమోదయ్యాయని.. అహ్మదాబాద్, బెంగళూరు, పుణె, ముంబై ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయంది. అలాగే, తమ ప్లాట్‌ఫామ్ ద్వారా కారును విక్రయించాలనుకునే సంఖ్య కూడా భారీగా పెరిగిందని కార్స్24 వెల్లడించింది. ఒక్కరోజులో 5,000 వాహనాల తనిఖీలు జరిపామని, గడిచిన నాలుగేళ్లలో ఇదే అత్యధికమని పేర్కొంది.

ఏసీ, టీవీ సేల్స్ జూమ్

జీఎస్‌టీ తగ్గింపుతో నవరాత్రుల తొలిరోజున ఎయిర్ కండీషనర్లు (ఏసీ), టెలివిజన్ (టీవీ) అమ్మకాలు కూడా భారీగా పెరిగాయి. విక్రేతల చౌక డీల్స్‌ను అందిపుచ్చుకునేందుకు కొనుగోలుదారులు ఎగబడ్డారు. ఇతర సోమవారాలతో పోలిస్తే, 22న రెట్టింపు విక్రయాలు జరిపినట్లు హాయర్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస్ సతీశ్ తెలిపారు. జీఎస్‌టీ తగ్గింపునకు ముందే ఈ కంపెనీ ప్రీ-బుకింగ్‌ను ప్రారంభించింది. ఇప్పటివరకు నమోదైన ఎంక్వైరీలను బట్టి చూస్తే, విక్రయాలు భారీగా పెరగనున్నాయని బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ అన్నారు. గత ఏడాది సెప్టెంబరు అమ్మకాలతో పోలిస్తే ఈ నెలలో 20 శాతం వృద్ధి నమోదు కావచ్చని ఆయన అంచనా వేశారు. జీఎస్‌టీ తగ్గిన తొలి రోజున విక్రయాలు 30-35 శాతం పెరిగాయని థాంప్సన్, కొడాక్ వంటి టీవీ బ్రాండ్ల లైసెన్సులు కలిగిన సూపర్ ప్లాస్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ అవనీత్ సింగ్ మార్వా అన్నారు.

పునరుత్పాదక ఇంధన రంగ ఇన్వెస్టర్లకు రూ.1.50 లక్షల కోట్ల ఆదా

పునరుత్పాదక ఇంధనంపై జీఎస్‌టీ తగ్గడంతో ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి 2030 నాటికి రూ.1.50 లక్షల కోట్ల వరకు ఆదా కావచ్చని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ప్రభుత్వం రెన్యువబుల్ ఎనర్జీ పరికరాలపై జీఎస్‌టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. కాగా, 2030 నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 300 గిగావాట్ల మేర పెంచుకోవాలని కేంద్రం భావిస్తోంది. జీఎస్‌టీ తగ్గింపుతో ఇన్వెస్టర్లకు వ్యయం 2-3 శాతం మేర తగ్గినా రూ.1-1.5 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు ఆదా కావచ్చని పేర్కొన్నారు. జీఎస్‌టీ తగ్గింపుతో పీఎం సూర్య ఘర్ పథకం కింద లభించే రూఫ్ టాప్ సోలార్ 3 కిలోవాట్ సిస్టమ్ ధర రూ.9,000-10,500 మేర తగ్గనుంది.

ఐదేళ్లలో రూ.1.70 లక్షలకు బంగారం!?

న్యూఢిల్లీ: గడిచిన ఐదేళ్లలో కొవిడ్ సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో పాటు ఇతర భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితులు, ట్రంప్ సుంకాలు, ఫెడ్ రేట్ల తగ్గుదల వంటి అంశాలు విలువైన లోహాల ధరలను భారీగా ఎగదోశాయి. 2020 సెప్టెంబరు 19న ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.51,619 స్థాయిలో ట్రేడవగా.. ప్రస్తుతం రూ.1.10 లక్షల స్థాయికి చేరింది. అంటే, ఐదేళ్లలో 112 శాతం పెరిగింది. కాగా, అమెరికా ఆర్థిక విధానాలు, ఫెడ్ రేట్లు, భౌగోళిక రాజకీయ అంశాలు వచ్చే ఐదేళ్లలో బంగారం ధరల గమనాన్ని నిర్దేశించనున్నాయని ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ లిమిటెడ్ కరెన్సీ, కమోడిటీ విభాగ ఏవీపీ మనీశ్ శర్మ అన్నారు. 2026 ప్రథమార్ధం చివరి నాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ 4,000 డాలర్లకు (దేశీయంగా రూ.1.20 లక్షలు) చేరవచ్చని భావిస్తున్నారు. వచ్చే 2-5 ఐదేళ్లలో 5,000 డాలర్లకు (రూ.1.50-1.70 లక్షలు) ఎగబాకవచ్చని మనీశ్ శర్మ అంచనా వేశారు.

గోల్డ్.. కొత్త రికార్డ్

పుత్తడి సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర సోమవారం రూ.2,200 పెరిగి రూ.1,16,200కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం కూడా రూ.2,150 పెరుగుదలతో కొత్త ఆల్‌టైమ్ రికార్డు స్థాయి రూ.1,15,650కి ఎగబాకింది. కిలో వెండి ఏకంగా రూ.4,380 పెరుగుదలతో రూ.1,36,380కి చేరింది. సిల్వర్‌కూ ఇది సరికొత్త పతాక స్థాయి.

జీఎస్‌టీ ప్రయోజనాలు నేరుగా వినియోగదారులకే

- దసరా కోసం ప్రత్యేక డిస్కౌంట్స్
- సీఎంఆర్ షాపింగ్‌మాల్ సీఎండీ మావూరి వెంకటరమణ

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ 2.0 ప్రయోజనాలను నేరుగా వినియోగదారులకు అందిస్తున్నట్లు సీఎంఆర్ షాపింగ్‌మాల్ సీఎండీ మావూరి వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రెడీమేడ్ వస్త్రాలపై గతంలో 12 శాతం జీఎస్‌టీ ఉండగా ఇప్పుడు 5 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. దీంతో రూ.2,500 లోపు విలువ కలిగిన రెడీమేడ్ వస్త్రాల కొనుగోలుపై వినియోగదారులకు 6.2 శాతం మేర ప్రయోజనం కలుగుతుందన్నారు. దీన్ని పూర్తిగా వినియోగదారులకే బదిలీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా దసరా పండగను పురస్కరించుకుని సీఎంఆర్ షోరూమ్స్ అన్నింటిలో ప్రత్యేకమైన రాయితీలు అందిస్తున్నట్లు వెంకటరమణ తెలిపారు. ప్రతి రూ.999 కొనుగోలుపై ఒక స్పాట్ గిఫ్ట్, వన్ ప్లస్ వన్ ఆఫర్లు, కాంబో ఆఫర్లు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైదరాబాద్‌లో సీడీకే కేంద్రం విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆటోమోటివ్ రిటైల్ సాఫ్ట్‌వేర్ సరఫరాదారు సీడీకే హైదరాబాద్‌లోని తన కేంద్రాన్ని విస్తరించినట్టు ప్రకటించింది. ప్రస్తుత కేంద్రానికి అదనంగా 50వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల స్థలాన్ని జోడించినట్టు వెల్లడించింది. ఉత్తర అమెరికాలో తమ కార్యకలాపాలు పటిష్ఠం చేయడం లక్ష్యంగా టాలెంట్, టెక్నాలజీలో పెట్టుబడులు పెడుతున్నట్టు కంపెనీ ఎండీ సందీప్ కుమార్ జైన్ తెలిపారు. హైదరాబాద్ కార్యాలయం తమ ప్రధాన విధులకు మద్దతు ఇస్తుందని అన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,12,580 ▲	1,03,200 ▲	1,48,000 ▲
విజయవాడ	1,15,200 ▲	1,08,500 ▲	1,37,200 ▲
విశాఖపట్నం	1,15,570 ▲	1,03,600 ▲	1,48,000 ▲
రాజమండ్రి	1,13,070 ▲	1,03,650 ▲	1,36,300 ▲
ప్రొద్దుటూరు	1,15,200 ▲	1,05,980 ▲	1,37,000 ▲
ముంబై	1,12,155 ▲	1,02,734 ▲	1,32,869 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	125
వరంగల్	110	గుంటూరు	127
కరీంనగర్	110	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	105
కర్నూలు	110	నెల్లూరు	110
విశాఖపట్నం	129	అనంతపురం	110
గోదావరి	125		

మార్కెట్‌కు వీసా షాక్

ఐటీ షేర్లలో భారీ అమ్మకాలు

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బీ వీసాల ఫీజును భారీగా పెంచిన నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ సోమవారం భారీ కుదుపు ఎదుర్కొంది. ప్రధానంగా ఐటీ షేర్లలో అమ్మకాలు మార్కెట్‌ను కుంగదీశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి బ్లూచిప్ షేర్లలో అమ్మకాలు మార్కెట్ పతనానికి ఆజ్యం పోశాయి. ఫలితంగా సెన్సెక్స్ 466.26 పాయింట్ల నష్టంతో 82,159.97 వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 628.94 పాయింట్లు నష్టపోయి 81,997.29 వరకు దిగజారింది. నిఫ్టీ 124.70 పాయింట్ల నష్టంతో 25,202.35 వద్ద ముగిసింది.

ట్రంప్ చర్య కారణంగా ఇన్వెస్టర్ సెంటిమెంట్ అప్రమత్తంగా మారిందని లివ్‌లాంగ్ వెల్త్ వ్యవస్థాపకుడు రీసెర్చ్ అనలిస్ట్ హరిప్రసాద్ అన్నారు. సెన్సెక్స్ షేర్లలో ఎటర్నల్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్ మాత్రమే లాభాలతో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.78%, స్మాల్‌క్యాప్ సూచీ 0.71% నష్టపోయాయి.

నష్టాల్లో ఐటీ షేర్లు

ఐటీ సూచీలు, ఐటీ షేర్లు సోమవారం మార్కెట్ పతనంలో ప్రధాన పాత్ర పోషించాయి. సూచీల్లో ఫోకస్డ్ ఐటీ భారీగా 2.98% నష్టపోగా ఐటీ 2.73%, టెక్ 2.09% నష్టపోయాయి. వీటితో పాటుగా యంత్ర పరికరాలు (0.77%), ఇండస్ట్రియల్స్ (0.75%), ఆటో (0.41%) సూచీలు కూడా నష్టాలతో ముగిశాయి. ఇక ఐటీ రంగానికి చెందిన ఇన్ఫోబీన్స్ టెక్నాలజీస్ గరిష్ఠంగా 8.08%, హెక్సావేర్ 7.08% నష్టపోయాయి. ఎల్‌టీఐ మైండ్‌ట్రీ (4.54%), పెర్సిస్టెంట్ సిస్టమ్స్ (4.19%), టెక్ మహీంద్రా (3.20%), టీసీఎస్ (3.02%), ఇన్ఫోసిస్ (2.61%), విప్రో (2.25%), హెచ్‌సీఎల్ టెక్ (1.84%) నష్టపోయాయి.

తెలంగాణలో కార్నింగ్, ఎస్‌జీడీ ఫార్మా గ్లాస్ ట్యూబింగ్ ప్లాంట్

రూ.500 కోట్లు పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఫార్మా రంగానికి చెందిన కార్నింగ్, ఫ్రెంచ్ కంపెనీ ఎస్‌జీడీ ఫార్మా జాయింట్ వెంచర్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలోని వేముల వద్ద అత్యాధునికమైన గ్లాస్ ట్యూబింగ్ ప్లాంట్‌ను ప్రారంభించాయి. ఈ ప్లాంట్ ఏర్పాటుకు రూ.500 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. సోమవారం లాంఛనప్రాయంగా ప్రారంభించిన ఈ ప్లాంట్‌ను కార్నింగ్‌కు చెందిన అత్యాధునిక వయల్ టెక్నాలజీని, ఎస్‌జీడీ ఫార్మాకు గల వయల్ కన్వర్టింగ్ అనుభవాన్ని జోడించి ఏర్పాటు చేశారు. ఈ కొత్త ప్లాంట్ అత్యున్నత నాణ్యత గల టైప్ 1 బోరోసిలికేట్ గ్లాస్ ట్యూబింగ్‌ను తయారుచేస్తుంది. ఇంజెక్షన్ల ప్యాకేజింగ్‌లో ఉపయోగించే కీలక ఉపకరణం ఈ గ్లాస్ ట్యూబింగ్. అత్యంత కీలకమైన ప్రాంతీయ అవసరాలు తీర్చడంలో కీలక మైలురాయి ఈ ప్లాంట్ ప్రారంభమని కార్నింగ్ లైఫ్ సైన్సెస్ వైస్ ప్రెసిడెంట్, జీఎం క్రిస్ హడ్సన్ అన్నారు. ఉత్పత్తి సామర్థ్య విస్తరణకు, కస్టమర్లకు చేరువగా ఉండేందుకు, సరఫరా వ్యవస్థల స్థానికీకరణకు ఈ ప్లాంట్ ఉపయోగకరంగా ఉంటుందని ఆయన చెప్పారు. ఇంజెక్షన్ల డెలివరీ, స్థానిక ఫార్మా రంగ వృద్ధిలో ఈ ప్లాంట్ క్రియాశీల పాత్ర పోషిస్తుంది.

కార్నింగ్‌తో ఈ జేవీ తమ ప్రపంచ వృద్ధి వ్యూహంలో ఒక కీలక మైలురాయి అని ఎస్‌జీడీ ఫార్మా సీఈఓ ఆలివర్ రోసావు అన్నారు. తెలంగాణలో అత్యాధునిక ప్లాంట్ ఏర్పాటు వల్ల తమ సరఫరా వ్యవస్థ సుస్థిరతతో పాటు అమిత వేగంగా వృద్ధి చెందుతున్న ఫార్మా మార్కెట్లలో ఒకటైన తెలంగాణకు అత్యాధునిక టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చినట్టవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్లాంట్ ద్వారా 150 ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడడంతో పాటు పరోక్షంగా వందలాది ఉద్యోగాలు స్థానికులకు అందుబాటులోకి వస్తాయని కార్నింగ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సుధీర్ పిళ్లై అన్నారు.

స్పోర్ట్స్

పాక్.. పిచ్చి చేష్టలు



సూర్య

ఫర్హాన్, రౌఫ్‌ల వివాదాస్పద తీరు

నివ్వెరపోయిన క్రీడాలోకం

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య దశాబ్దాలుగా ఎన్నో మ్యాచ్‌లను చూసుంటాం. కానీ ఆసియా కప్ సూపర్-4లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మాత్రం దాయాది క్రికెటర్ల ప్రవర్తన అందరినీ షాక్‌కు గురి చేసింది. గ్రూప్ మ్యాచ్‌లో ఆ జట్టు ఆటగాళ్లతో షేక్‌హ్యాండ్‌కు నిరాకరించినందుకే క్రీడల్ని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని పాక్ బోర్డు పెద్దలు, మాజీలు భారత్‌కు ఉపదేశాలిచ్చారు. కానీ దానికి వంద రెట్లు మించినట్టుగా పాక్ ఓపెనర్ ఫర్హాన్, పేసర్ హారీస్ రౌఫ్‌ల చేష్టలున్నాయి. అర్ధసెంచరీ అయ్యాక ఫర్హాన్ బ్యాట్‌ను గన్‌గా మార్చి బుల్లెట్లు పేల్చుతున్నట్టుగా పహల్గామ్ దాడిని గుర్తు చేస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఇక బౌండరీ లైన్ దగ్గర రౌఫ్ భారత అభిమానులను మరింత కవ్వించేలా ప్రవర్తించాడు. ఆపరేషన్ సిందూర్‌లో భారత్‌కు చెందిన ఆరు రఫేల్ విమానాలను కూల్చేశామని అప్పట్లో పాక్ ప్రగల్భాలు పలికింది. దాన్ని ఉదహరిస్తూ.. అతను ప్రేక్షకులకు ఆరు వేళ్లను చూపించాడు. అంతేకాకుండా విమానం కింద పడుతున్నట్టుగా చేతులతో సైగ చేయడం కనిపించింది. అటు రౌఫ్ భార్య ఇవే ఫొటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేసి 'మ్యాచ్ ఓడినా, యుద్ధంలో గెలిచాం' అంటూ భర్తకు వంత పాడింది. ఇక ఫర్హాన్ తన ఫైరింగ్ సంబరాలను నిస్సిగ్గుగా సమర్థించుకున్నాడు. 'గతంలో నేనెప్పుడూ సంబరాలు చేసుకోలేదు. కానీ ఈసారి ఎందుకో చేసుకోవాలనిపించింది. ఎవరేమనుకున్నా నేను లెక్కచేయను' అని తెగేసి చెప్పాడు. వాస్తవానికి గతంలో పాక్ క్రికెటర్ల నుంచి ఇలాంటి మిలిటెంట్ మనస్తత్వాన్ని ఎన్నడూ చూడలేదు. మైదానంలో మాటా మాటా అనుకోవడం వరకే పరిమితమయ్యేది.

పాక్.. మాకు ప్రత్యర్థే కాదు: సూర్యకుమార్

సరైన ప్రత్యర్థి అంటే మైదానంలో నువ్వా.. నేనా? అనే రీతిలో తలపడాల్సి ఉంటుందని, కానీ పాక్ జట్టుతో తమకు పోటీ ఎక్కడుందని భారత కెప్టెన్ సూర్యకుమార్ ప్రశ్నించాడు. 'ఇక నుంచి పాక్ జట్టును మాకు ప్రత్యర్థి అని అనకండి. ఏదేనీ రెండు జట్లు 15 మ్యాచ్‌ల్లో తలపడి 8-7తో ఉంటే అప్పుడు ఓకే. కానీ ఇక్కడ 12-3తో మేం స్పష్టమైన ఆధిక్యంలో ఉన్నాం. ఇక పోటీ ఏముంది?' అని పాక్ విలేకరి అడిగిన ప్రశ్నకు సూర్య సూటిగా జవాబిచ్చాడు.

భారత మీడియాకు భయపడి..

భారత మీడియాను ఎదుర్కొనేందుకు పాక్ క్రికెట్ జట్టు వెనుకంజ వేస్తోంది. గ్రూప్ మ్యాచ్‌లో ఓడాక.. అలాగే యూఏఈతో మ్యాచ్ ముగిశాక కూడా విలేకరుల నుంచి ఎదురయ్యే ప్రశ్నలకు భయపడి పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా మీడియా ముందుకు రాలేదు. ఇప్పుడు రెండో ఓటమి తర్వాత మాత్రం ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చాడు. కానీ కేవలం పాకిస్థాన్ మీడియాకు తప్ప, భారత విలేకరులను ప్రశ్నలను అడిగేందుకు అనుమతించకపోవడం గమనార్హం.



కనేరియా

ఏకే 47కు జవాబుగా బ్రహ్మోస్: డానిష్

భారత్‌తో మ్యాచ్‌లో పాక్ క్రికెటర్ల హింసాత్మక ప్రవృత్తిని ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా తప్పుపట్టాడు. 'ఓపెనర్ ఫర్హాన్ ఏకే 47ను పేల్చినట్టుగా సంజ్ఞ చేశాడు. కానీ అభిషేక్, గిల్ వారిపై ఏకంగా బ్రహ్మోస్ క్షిపణినే పేల్చారు. పాక్ చర్యకు భారత్ ప్రతిచర్య భారీ స్థాయిలో ఉంది. ఇక ఇప్పుడు పాక్ జట్టు ఫఖర్ జమాన్ క్యాచ్‌ను వివాదంగా మార్చేందుకు ప్రయత్నిస్తుంది' అని కనేరియా అన్నాడు.

అందుకే రెచ్చిపోయా: అభిషేక్

పాక్ బౌలర్లను తొలి బంతి నుంచే ఊచకోత కోసిన భారత ఓపెనర్ అభిషేక్ శర్మ జట్టు విజయంలో కీలకమయ్యాడు. అయితే అకారణంగా పాక్ ప్లేయర్లు తమ మీదికి రావడం నచ్చలేదన్నాడు. మ్యాచ్‌లో పేసర్లు షహీన్, రౌఫ్‌లతో అతడికి వాగ్వాదం జరిగిన విషయం తెలిసిందే. 'వారు ఎలాంటి కారణం లేకుండా మాతో అలా ప్రవర్తించారు. నాకిలాంటివి నచ్చవు. అందుకే ప్రతీ బంతిని బాది వారికి సరైన మెడిసిన్ ఇవ్వాలనుకున్నా' అని అభిషేక్ తెలిపాడు.



రౌఫ్

ఫుట్‌బాల్‌లోనూ ఓడించారు

పాక్‌పై భారత్ అండర్-17 విజయం

కొలంబో: క్రీడ ఏదైనా పాకిస్థాన్‌పై భారత్‌దే పైచేయి అని మరోసారి నిరూపితమైంది. తాజాగా శాఫ్ అండర్-17 చాంపియన్‌షిప్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత కుర్రాళ్లు 3-2 తేడాతో పాక్ టీమ్‌పై నెగ్గారు. ఈ రెండు జట్లు ఇదివరకే సెమీస్‌కు అర్హత సాధించాయి. అయితే పాక్ తరపున మహ్మద్ అబ్దుల్లా గోల్ చేశాక కింద కూర్చుని టీ తాగుతున్నట్టుగా నటించడం చర్చనీయాంశమైంది.

భారత పర్యటనకు బోల్ట్

ఫుట్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ బరిలో లెజెండ్



న్యూఢిల్లీ: స్ప్రింట్ లెజెండ్ ఉసేన్ బోల్ట్ భారత అభిమానుల కోసం ఫుట్‌బాలర్ అవతారమెత్తనున్నాడు. వచ్చే నెల ఒకటిన బెంగళూరు ఎఫ్‌సీ, ముంబై ఎఫ్‌సీ మధ్య జరిగే ప్రత్యేక ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో బోల్ట్ ఆడనున్నాడు. అయితే, ఒక్కో హాఫ్‌లో ఒక్కో జట్టు తరఫున ఉసేన్ ఆడనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మేటి ఫుట్‌బాలర్లతోపాటు బాలీవుడ్ ప్రముఖులు కూడా పాల్గొంటారని చెప్పారు.

నాయర్, నితీశ్‌లకు చాన్స్ దక్కేనా?

వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు టీమిండియా ఎంపిక రేపు



కరుణ్ నాయర్, నితీశ్ కుమార్

న్యూఢిల్లీ: ఎనిమిదేళ్ల విరామం తర్వాత ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌కు ఎంపికైన కరుణ్ నాయర్‌కు మరో అవకాశం ఇస్తారా? లేదా? అనేది సస్పెన్స్‌గా మారింది. స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టును సెలెక్షన్ కమిటీ బుధవారం ఎంపిక చేయనుంది. ప్రస్తుతం సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ దుబాయ్‌లో ఉండడంతో.. వర్చువల్‌గా ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారని సమాచారం. గాయం నుంచి కోలుకొన్న కరుణ్ నాయర్ సెలెక్షన్‌కు అందుబాటులో ఉన్నాడు. అయితే, ఇంగ్లండ్ టూర్‌లో కరుణ్ చెప్పుకోదగ్గ రీతిలో ఆడలేక పోయాడు. దీంతో అతడి స్థానానికి తెలుగు ఆటగాడు నితీష్ కుమార్, దేవ్‌దత్ పడిక్కళ్ నుంచి గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. గాయం నుంచి కోలుకొన్న నితీశ్.. ఆస్ట్రేలియా-ఎ టూర్‌కు ఎంపికయ్యాడు. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్ స్థానాలు పదిలంగానే కనిపిస్తున్నాయి. ఇంగ్లండ్ టూర్‌లో గాయపడిన రిషభ్ పంత్ విషయంలో మెడికల్ టీమ్ నివేదిక అందాల్సి ఉంది. అయితే అతను ఫిట్‌గా లేడని, ధ్రువ్ జురెల్‌ను వికెట్ కీపర్‌గా తీసుకోవడం ఖాయమని అంటున్నారు. రెండో వికెట్ కీపర్, మూడో ఓపెనర్‌గా నారాయణ్ జగదీశన్‌కు చాన్సిస్తే.. అభిమన్యు ఈశ్వరన్‌కు చోటు కష్టమే. ఫిట్‌నెస్ ఇబ్బంది లేమీ లేకపోతే జడేజా, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్‌తోపాటు సిరాజ్‌కు చోటు ఖాయమే. తుదిజట్టులో నితీశ్‌కు చాన్సిస్తే.. ప్రసిద్ధ్ కృష్ణ లేదా అక్షర్ పటేల్‌లో ఒకరికి నిరాశ తప్పదు. శ్రేయాస్ అయ్యర్‌కు చోటు కష్టమేనంటున్నారు. వచ్చే నెల రెండు నుంచి అహ్మదాబాద్‌లో విండీస్‌తో తొలి టెస్ట్ జరగనుంది.

ప్రాబబుల్స్ (15): శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, కరుణ్ నాయర్/పడిక్కళ్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), జడేజా, సుందర్, కుల్దీప్, సిరాజ్, ప్రసిద్ధ్, అక్షర్, నారాయణ్ జగదీశన్, నితీశ్ కుమార్, ఆకాష్ దీప్.

'క్యాబ్' అధ్యక్షుడిగా గంగూలీ

కోల్‌కతా: సౌరవ్ గంగూలీ (53) బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్య క్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. సోమ వారం జరిగిన సంఘం సర్వసభ్య సమా వేశంలో ఈ ఎన్నిక జరిగింది. సౌరవ్ అన్న స్నేహశిష్ ఆరేళ్ల పదవీకాలం ముగియడంతో ఈ ఖాళీ ఏర్పడింది. గతంలో 2015-19వరకు ఇదే పదవిలో ఉన్న గంగూలీ, తర్వాత 2019-22 మధ్య కాలంలో బీసీసీఐ అధ్యక్షుడిగానూ వ్యవహరించాడు.

డికాక్.. తిరిగి వన్డేల్లోకి

జొహాన్నెస్‌బర్గ్: వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్ మనసు మార్చుకున్నాడు. అక్టోబరులో పాకిస్థాన్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌తో పాటు మూడు టీ20ల సిరీస్‌కు కూడా సెలెక్టర్లు అతడిని ఎంపిక చేశారు. 2023 వరల్డ్‌కప్ తర్వాత డికాక్ వన్డేలకు గుడ్‌బై చెప్పాడు.



ప్రణయ్



అనుపమ

కొరియా ఓపెన్ బరిలో ప్రణయ్

సువాన్ (కొరియా): నిలకడలేమి ఆట తీరుతో కొద్దికాలంగా ఇబ్బంది పడుతున్న భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ కొరియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు సిద్ధమవుతున్నాడు. మంగళవారం నుంచి మొదలయ్యే ఈ టోర్నీ సింగిల్స్‌లో ప్రణయ్‌తో పాటు యువ షట్లర్ ఆయుష్ శెట్టి, కిరణ్ జార్జ్ కూడా పోటీ పడనున్నారు. భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ ద్వయం ఈ టోర్నీ బరిలో లేకపోవడంతో ప్రణయ్, ఆయుష్‌పైనే పతక అంచనాలు నెలకొన్నాయి. మహిళల సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ, మిక్స్‌డ్ డబుల్స్‌లో మోహిత్, లక్షిత భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

స్మృతి మంధానపై పాట!



తిరువనంతపురం: మరికొద్ది రోజుల్లో ప్రారంభమవనున్న ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో భారత మహిళల జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన సత్తా చాటాలని ఆకాంక్షిస్తూ ప్రొఫెసర్ వశిష్ఠ ఆమెపై పాట రూపొందించారు. కాలికట్‌లోని మలబార్ క్రిస్టియన్ కాలేజీలో హిస్టరీ శాఖ విభాగాధిపతిగా వశిష్ఠ గతంలో పనిచేశారు. ఈ పాటను వశిష్ఠ రాయగా, అతడి శిష్యురాలు సిలు ఫాతిమా ఆలపించారు. ప్రతి భారతీయురాలికి స్మృతి మంధాన ఒక స్ఫూర్తి ప్రదాత అని క్రికెట్‌లో ఆమె దేశానికి అందించిన రికార్డులు చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతాయని ఈ పాటలో వివరించారు.

పాక్ ఫైనల్ చేరేనా?

ఆసియా కప్



దుబాయ్: ఆసియా కప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. గ్రూప్ దశలో తొలిసారి గెలిచిన టీమిండియా.. ఆదివారం జరిగిన సూపర్-4 మ్యాచ్‌లోనూ పాక్‌ను చిత్తు చేసింది. ఈ నేపథ్యంలో ఇండో-పాక్ ముచ్చటగా మూడోసారి అంటే.. ఫైనల్లో తలపడే అవకాశం ఉందా? అనేది చర్చనీయాంశంగా మారింది. సూపర్-4 రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగుతుండడంతో పాక్ పని ఇప్పటికైతే ముగియలేదు. ఇంకా శ్రీలంక, బంగ్లాదేశ్‌తో పాక్ ఆడాల్సి ఉంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో ఒక్కటి ఓడినా.. పాక్ కథ ముగిసినట్టే. మరోవైపు పాక్‌పై గెలిచిన టీమిండియా.. ఇంకొక్క మ్యాచ్‌లో గెలిస్తే చాలు ఫైనల్ బెర్త్ ఖరారవుతుంది. బుధవారం బంగ్లాతో, శుక్రవారం లంకతో భారత్ ఆడాల్సి ఉంది.

చావోరేవో..: సూపర్-4లో భాగంగా మంగళవారం పాకిస్థాన్, శ్రీలంక మధ్య జరిగే మ్యాచ్ ఇరుజట్లకూ చావోరేవోగా భావించాలి. బంగ్లాదేశ్ చేతిలో లంక ఓడగా.. భారత్ చేతిలో పాక్ చిత్తయింది. రెండు జట్లూ తొలి మ్యాచ్‌ల్లో ఓడడంతో.. రెండో మ్యాచ్‌లో తప్పనిసరిగా నెగ్గాల్సిన పరిస్థితి. ఒకవేళ లంక చేతిలో పాక్ ఓడితే.. ఆ జట్టు ఫైనల్ ఆశలు గల్లంతైనట్టే. మరోవైపు లంక పరిస్థితి కూడా ఇదే తరహాలో ఉంది. ఇరుజట్లకూ ఇది కీలక మ్యాచ్ కావడంతో మరింత రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.



వెంకటరామయ్య కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న వెంకయ్యనాయుడు

నూజివీడు సీడ్స్ చైర్మన్ వెంకటరామయ్య కన్నుమూత

నివాళులర్పించిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య



మండవ వెంకటరామయ్య

నూజివీడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నూజివీడు సీడ్స్ లిమిటెడ్(ఎన్ఎస్ఎల్) చైర్మన్ మండవ వెంకటరామయ్య(94) సోమవారం కన్నుమూశారు. కొంత కాలంగా అస్వస్థతతో బా, దపడుతున్న ఆయన ఏలూరు జిల్లా నూజివీడు మండలం తుక్కులూరులోని ఆయన స్వగృహం లో తుది శ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు, ఎన్ఎస్ఎల్ ఎండీ ప్రభాకర్‌రావు తెలిపారు. వెంకటరామయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో ఎంఎస్సీ చేసి తిరిగి స్వగ్రామం వచ్చిన ఆయన, దేశంలో ప్రైవేటు విత్తన రంగం ప్రారంభమైన సమయం... 1973లో నూజివీడు సీడ్స్‌ను స్థాపించారు. ఆ బాటలోనే ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు సైతం నూజివీడు సీడ్స్‌ను అభివృద్ధి పరుస్తూ అనేక పరిశ్రమలను స్థాపించి వ్యాపారాన్ని విస్తరించారు.

వెంకయ్య నివాళి

'వెంకటరామయ్య లేని లోటు తీర్చలేనిది. ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే మనం ఇచ్చే ఘనమైన నివాళి' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. సోమవారం తుక్కులూరులో వెంకటరామయ్య పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, వసంత కృష్ణప్రసాద్, కామినేని శ్రీనివాస్, సుజనా చౌదరి, విశ్రాంత ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు తదితరులు వెంకటరామయ్యకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గండికోటలో డిష్యుం డిష్యుం

రహదారి పనులకు అడ్డగింత.. రిత్విక్ కంపెనీ క్యాంపు ఆఫీసుపై ఎమ్మెల్యే ఆది వర్గీయుల దాడి

- ధ్వంసమైన కంటైనర్ అద్దాలు
- ఆగిన పనులు.. 50 మందిపై కేసు



రిత్విక్ క్యాంపు కార్యాలయంలో చెల్లాచెదురుగా పడిన ప్రింటర్

జమ్మలమడుగు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా, జమ్మలమడుగు నియోజకవర్గంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం గండికోటలో రోడ్డు పనులకు మరోమారు బ్రేక్ పడింది. బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ కంపెనీ ఈ రోడ్డు పనులు చేస్తోంది. అయితే, తమ సమస్యలు పరిష్కరించేదాకా పనులు జరగనివ్వబోమని పేర్కొంటూ ఈ నెల 6న గండికోట గ్రామస్థులు, స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు ఈ పనులను అడ్డుకున్నారు. అప్పటి నుంచి పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం రిత్విక్ కంపెనీ క్యాంపు కార్యాలయంపై దాడి జరిగింది. దాదాపు 6 నుంచి 8 వాహనాల్లో సుమారు 50 మందికిపైగా చేరుకుని పనులను అడ్డుకోవడమేకాక రాళ్లదాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ సిబ్బందితో అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. రిత్విక్ కంపెనీకి సంబంధించిన కాంట్రాక్టర్, సిబ్బందిని స్టేషన్‌కు తరలించారు. కాగా, ముందస్తు ప్రణాళికతోనే ఆది వర్గీయులు అక్కడికి వెళ్లినట్టు తెలుస్తోంది. సిబ్బందిని చితకబాదారని, దాడిని ఎవరూ ఫొటోలు తీయరాదని, ఒకవేళ తీసి బయటపెడితే అంతుచూస్తామని హెచ్చరించినట్టు సమాచారం. పరస్పర ఫిర్యాదులతో 50 మందిపై కేసు నమోదు చేశామని జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేశ్ బాబు తెలిపారు.

కి'లేడీ' అరుణపై రౌడీషీట్!?

- తాజాగా మళ్లీ కస్టడీలోకి తీసుకుని విచారణ
- నేడు కూడా ప్రశ్నించనున్న పోలీసులు

కోవూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పలు నేరాలు, కేసుల్లో ఉన్న నెల్లూరు కి'లేడి' నడిగుంట అరుణపై రౌడీషీట్ తెరవాలని పోలీసులు నిర్ణయించినట్లు తెలిసింది. మరోవైపు కోర్టు అనుమతితో కస్టడీలో విచారించేందుకు పోలీసులు ఆమెను సోమవారం ఒంగోలు జైలు నుంచి నెల్లూరుకు తీసుకొచ్చారు. కోవూరు పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించారు. ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని కోవూరులోని నాగులపట్టు ప్రాంతానికి చెందిన గిరిజన మహిళల నుంచి అరుణ అక్రమంగా నగదు వసూలు చేశారనే అభియోగంతో ఇటీవల పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై సీఐ సుధాకరరెడ్డి, నెల్లూరు సీఐ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఐడీ పార్టీ పోలీసులు అరుణను విచారించారు. చాలా ప్రశ్నలకు తనకేమీ తెలియదని అరుణ సమాధానం ఇచ్చిందని.. ఇంకొన్ని ప్రశ్నలకు సమాధానం దాటవేసినట్లు సమాచారం. సాయంత్రం తిరిగి జైలుకు ఆమెను తరలించారు. మంగళవారం మళ్లీ కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. ఓ అపార్టుమెంటు ఫ్లాటు ఆక్రమణపైనా ఆమెపై కేసు నమోదు కాగా.. అందులో రెండ్రోజుల కిందట బెయిల్ మంజూరైంది. నెల్లూరులో నమోదైన రెండు గంజాయి అక్రమ రవాణా కేసుల్లో, అన్నదమ్ముల ఆస్తి వివాదం కేసులో ఆమె ప్రస్తుతం రిమాండ్‌లో ఉంది.

'హసిని' కేసులో కూడా నిందితురాలే

కొడవలూరు పోలీసుస్టేషన్ పరిధిలోని టపాతోపు వద్ద 9నెలల కిందట జరిగిన హిజ్రా హసిని హత్య కేసులోనూ అరుణ ప్రమేయం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఆమెతోపాటు మరో నలుగురిని నిందితులుగా చేర్చేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఈ నలుగురిలో ఓ న్యాయవాది కూడా ఉన్నట్లు తెలిసింది.



కేంద్ర భూవిజ్ఞానశాఖ సహాయమంత్రి జితేంద్రసింగ్ నుంచి అవార్డు అందుకుంటున్న ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర, అధికారులు

వాతావరణ ముందస్తు హెచ్చరికలు భేష్

- ఐఎండీకి అవార్డు ప్రదానం

విశాఖపట్నం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బహుళ ప్రమాదాలపై ముందస్తు వాతావరణ హెచ్చరికల జారీ వ్యవస్థను రూపొందించి అమలుచేసిన భారత వాతావరణ శాఖ(ఐఎండీ)కు అవార్డు లభించింది. ఉత్తమ ప్రతిభ, పనితీరు, కొత్త ఆవిష్కరణలు చేసిన దేశంలోని పలు విభాగాలకు విశాఖపట్నంలో జరుగుతున్న ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సులో కేంద్ర భూవిజ్ఞాన మంత్రి జితేంద్రసింగ్ సోమవారం అవార్డులను ప్రదానం చేశారు. ఐఎండీ డీజీ మృత్యుంజయ మహాపాత్రతోపాటు శాస్త్రవేత్తలు అన్సాల్ చౌహాన్, ఎంటీ బుషీర్, సుమన్ గుర్జార్ కేంద్ర మంత్రి నుంచి అవార్డు అందుకున్నారు.

కృష్ణానదికి ముంచుకొస్తున్న వరద!

- వరుస అల్పపీడనాలతో ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు
- 25, 26 తేదీల్లో రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో భారీగా వరద ముంచుకొచ్చే ప్రమాదం ఉందని దిగువ రాష్ట్రాలు ఏపీ, తెలంగాణలకు కృష్ణా బేసిన్ ఇన్‌ఫ్లో ఫోర్‌కాస్ట్, వాతావరణ శాఖ హెచ్చరికలు చేశాయి. ఈ నెల 26వ తేదీ నాటికి ఎగువ నుంచి ఏడు నుంచి ఎనిమిది లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఇప్పటికే జలాశయాల్లో నీటిమట్టం దాదాపు గరిష్ఠ స్థాయికి చేరింది. కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయం 98 శాతం నిండింది. శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలకు గాను 206.54 టీఎంసీల(99 శాతం) నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 2,69,426, ఔట్‌ఫ్లో 3,48,135 క్యూసెక్కులు ఉంది. నాగార్జున సాగర్ గరిష్ఠ నీటి పరిమితి 312.65 టీఎంసీలకు గాను 97.90 శాతం మేర నిల్వ ఉంది. సాగర్ నుంచి 3,21,023 క్యూసెక్కులు కిందకు వదిలేస్తున్నారు. పులిచింతలలో 40.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీ నుంచి 3,87,455 క్యూసెక్కుల వరదను దిగువకు వదిలేస్తున్నారు.

నేటి నుంచి 27 వరకు భారీ వర్షాలు

వరుస అల్పపీడనాలు, తీవ్ర వాతావరణ అనిశ్చితి ప్రభావంతో రాష్ట్రంలో ఈనెల 27వ తేదీ వరకూ భారీ వర్షాలు కురవనున్నాయి. కోస్తాలో మంగళ, బుధవారాల్లో పలుచోట్ల భారీవర్షాలు, 25, 26 తేదీల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, 27న భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈశాన్య బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది మంగళవారం నాటికి వాయవ్య బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత ఒడిశా, పశ్చిమ బెంగాల్ మధ్య తీరం దాటి బలహీనపడనుంది. ఉపరితల ద్రోణి ప్రభావంతో కోస్తాలో పలుచోట్ల సోమవారం ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. ఈనెల 25వ తేదీన తూర్పు మధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి 26వ తేదీ నాటికి వాయుగుండంగా బలపడనుందని, ఆ మరుసటిరోజు(27న) ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుందని వాతావరణ శాఖ తెలిపింది. బాపట్ల జిల్లా సూర్యలంక తీరంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించతలపెట్టిన బీచ్ ఫెస్టివల్‌ను రద్దు చేస్తున్నట్లు పర్యాటకశాఖ బాపట్ల జిల్లా అధికారి నాగిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందిద్దాం!

- వేధింపులు లేకుండా పెట్టుబడులను ప్రోత్సహించాలి: డిప్యూటీ సీఎం
- పీసీబీ కార్యక్రమాల్లో యువతకు భాగస్వామ్యముండాలి
- పీసీబీ బాధ్యతలపై అధికారులతో పవన్ చర్చ

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): భావితరాలకు సాధ్యమైనంత స్వచ్ఛమైన గాలి, నీరు అందించే లక్ష్యంతో పని చేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. సోమవారం అమరావతి శాసనసభ భవనంలోని తన చాంబర్‌లో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజతో పవన్ సమావేశమయ్యారు. కాలుష్య నియంత్రణ మండలిపై టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆరోపణలు చేసిన క్రమంలో మండలి సిబ్బంది బాధ్యతలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, 'పీసీబీలో ప్రభుత్వ పర్యవేక్షణ పాక్షికంగా ఉంటుంది. పంచాయతీరాజ్ వంటి శాఖలపై ప్రభుత్వ పర్యవేక్షణ, నియంత్రణ ఉంటుంది. అందుకు భిన్నంగా పీసీబీ నిర్ణయాలు, విధులపై కొన్ని పరిమితులున్నాయి. పీసీబీకి చట్టబద్ధ అధికారాలున్నాయి' అని పవన్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ, 'రాష్ట్రానికి పెట్టుబడులను ప్రోత్సహిస్తూనే, కాలుష్య నియంత్రణకు నిబంధనలు అమలు చేసే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పారిశ్రామికవేత్తలు పారిపోయేలా చేసే పరిస్థితి తేకూడదు. కూటమి పాలన ప్రారంభంలో పీసీబీపై సమీక్షించి, అన్ని విషయాలు నిర్దేశించాం. రాష్ట్రంలో కాలుష్య, పర్యావరణ కార్యక్రమాల్లో యువత, విద్యార్థులను భాగస్వాములను చేయాలి. పీసీబీని అడ్డుపెట్టుకుని, వ్యక్తిగత ప్రయోజనాలను పొందాలని భావించే వారితో జాగరూకతతో వ్యవహరించాలి. పీసీబీ సిబ్బంది, వారి విధులేమిటీ? కాంట్రాక్ట్ సిబ్బంది, బాధ్యతలు ఏమిటీ? పీసీబీకి ఆర్థిక వనరులు ఏమిటి? వాటిని ఆడిట్ ఏ విధంగా చేస్తున్నారు? ఇప్పటి వరకు పీసీబీ పరిశోధన, అభివృద్ధిపై ఏ మేరకు దృష్టి సారించింది? జల, వాయు, శబ్ధ కాలుష్య వివరాలను ప్రాంతాల వారీగా అప్‌డేట్ చేస్తున్నారా? సమాచారం అందుబాటులో ఉంటుందా?' అంటూ పవన్ ప్రశ్నలు సంధించారు. వీటిపై సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు.



సోమవారం రాత్రి కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న మంత్రి ఆనం

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

వింటేజ్ పవన్‌కల్యాణ్



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కించిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్ 'ఓజీ'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఈ నెల 25న చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి తీసుకెళ్లగా, పాటలు సూపర్ హిట్ అయ్యాయి. తాజాగా అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. దాదాపు రెండున్నర నిమిషాల పాటూ సాగిన ఈ ట్రైలర్‌లో పవన్ ఎలివేషన్స్, లుక్స్ ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్ ఇచ్చేలా ఉన్నాయి. వింటేజ్ పవన్‌కల్యాణ్‌ను చూశామని ఫ్యాన్స్ సోషల్‌మీడియా వేదికగా సంబరపడిపోతున్నారు. పోరాట ఘట్టాలు, విజువల్స్, ప్రధాన పాత్రధారుల నటన, సంగీతం ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఇమ్రాన్ హష్మీ, ప్రకాశ్‌రాజ్, ప్రియాంక అరుళ్‌మోహన్, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషించారు.

అమలాపురంలో ఓజీ తొలి టిక్కెట్ రూ.60వేలు



జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన ఓజీ సినిమా ప్రీమియర్ షోకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని ఓ థియేటర్ వద్ద సోమవారం బహిరంగవేలం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఓ యువకుడు రూ.60వేలకు తొలి టిక్కెట్‌ను వేలంపాటలో గెలుచుకున్నాడు. కోనసీమ జిల్లా అల్లవరం మండలం బెండమూర్లంక గ్రామానికి చెందిన గుర్రం కృష్ణ, బీజేపీ రాష్ట్ర నాయకుడు మోకా సుబ్బారావు మధ్య ఈ టిక్కెట్‌కు సంబంధించి బహిరంగ వేలంపాట జనసేన నాయకులు, అభిమానుల సమక్షంలో జరిగింది. మోకా సుబ్బారావు రూ.59వేల వరకు వెళ్లారు. గుర్రం కృష్ణ రూ.60వేలకు పాటలో తొలి టిక్కెట్‌ను దక్కించుకున్నారు.

-అమలాపురం, (ఆంధ్రజ్యోతి)

కొత్త సినిమా కబురు



శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న కొత్త సినిమా వివరాలు సోమవారం ప్రకటించారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. దీని టైటిల్‌ను దసరా రోజున ప్రకటిస్తారు. మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో రాధిక, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే, శత్రు, సాయిచంద్, బ్రహ్మాజీ, ప్రభాస్ శ్రీను, శ్రీకాంత్ అయ్యంగార్, కమెడియన్ సత్య, గుండు సుదర్శన్, మురళీధర్ గౌడ్, సునైనా తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, ఫొటోగ్రఫీ: సాయి శ్రీరామ్, ఎడిటింగ్: చోటా కె ప్రసాద్.

మోదీ జీవన చిత్రం



మలయాళ కథానాయకుడు ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలో క్రాంతి కుమార్ సీహెచ్ తెరకెక్కిస్తోన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బయోపిక్ 'మా వందే'. సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ బేనర్‌పై వీర్ రెడ్డి.ఎం నిర్మిస్తున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్నిస్తూ మోదీ జీవితాన్ని యదార్థ ఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. సోమవారం ఉన్ని ముకుందన్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ చిత్రబృందం ప్రత్యేక పోస్టర్ విడుదల చేసింది. 'ప్రధాని మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని విశేషాలన్నీ ఎంతో సహజంగా సినిమాలో చూపించబోతున్నాం' అని చిత్రబృందం పేర్కొంది.


హాస్య చిత్రాలను ఆదరించాలి

- బ్రహ్మానందం



'ఈ సినిమాలో అందరూ కుర్రాళ్లే. అందుకే వీళ్లందరితో కలసి నటించాలనే ఉద్దేశంతో ఈ సినిమా అంగీకరించా. తమ జీవితం ఎలా ఉన్నా, అందరినీ నవ్వించాలనే సిద్ధాంతంతో జీవిస్తున్నవారు హాస్య నటులు. అందుకే వారిని ఆశీర్వదించండి. హాస్యాన్ని బతికించండి. హాస్యం బతికితే అందరూ ఆనందంగా ఉంటారు. ఆనందంగా ఉంటే మంచి పనులు చేస్తాం. మంచి పనులు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. మంచి ఫలితాలు వస్తే మోక్షం కలుగుతుంది. అందుకే ఇలాంటి మంచి చిత్రాలను అందరూ ఆదరించండి' అని అన్నారు హాస్య నటుడు బ్రహ్మానందం. ప్రియదర్శి నిహారిక ఎన్.ఎం., విష్ణు ఓఐ, రాగ్‌మయూర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్ ప్రధాన పాత్రధారులుగా విజయేందర్ ఎస్ తెరకెక్కించిన చిత్రం 'మిత్రమండలి'. కల్యాణ్ మంతెన, భాను ప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. సినిమా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం నుంచి 'జంబర్ గింబర్ లాలా' అనే పాటను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందంతో పాటు చిత్ర బృందం పాల్గొంది. కథానాయకుడు ప్రియదర్శి మాట్లాడుతూ 'ఏకలవ్య శిష్యుడిగా బ్రహ్మానందం సినిమాలు చూస్తు పెరిగాను. ఈ సినిమా చూసిన వారందరూ కడుపుబ్బా నవ్వుతారని హామీ ఇస్తున్నాను' అని అన్నారు. చిత్ర సమర్పకుడు బన్నీ వాసు మాట్లాడుతూ 'రాబోయే 25 రోజులు సోషల్ మీడియాలో మిత్ర మండలి మాత్రమే కనిపిస్తుంది' అని అన్నారు.

ప్రభాస్ చేతుల మీదుగా..



ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'కాంతారా: చాప్టర్ 1' చిత్ర ట్రైలర్‌ని రెబల్ స్టార్ ప్రభాస్ విడుదల చేశారు. 'నాన్న ఇక్కడే ఎందుకు మాయమయ్యాడు'? అనే సంభాషణతో ట్రైలర్ మొదలవుతుంది. 'ఎప్పుడు మనిషి అధర్మం వైపు వెళ్తాడో... ధర్మాన్ని కాపాడ్డానికి ఈశ్వరుడు తన గణాలని పంపుతూనే ఉంటాడు. ఈ అన్ని గణాలు వచ్చి కొలువైంది ఈ పుణ్య భూమిలో...' అనే సంభాషణలు చిత్రాన్ని తారాస్థాయికి తీసుకెళ్లాయి. ట్రైలర్ చివర్లో ఈశ్వరుడి దర్శనం ఉత్కంఠకు గురిచేసింది. కాగా, రిషబ్‌శెట్టి, హోంబలే ఫిల్మ్స్ కలయికలో వచ్చిన 'కాంతార' బాక్సాఫీసు వద్ద ఘన విజయం సాధించింది. ఇప్పుడు అదే చిత్రానికి ప్రీక్వెల్‌గా రాబోతున్న 'కాంతార:చాప్టర్ 1'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కథానాయకుడు రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించారు. హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. ఈ చిత్రం అక్టోబరు 2న కన్నడతోపాటు తెలుగు, హిందీ, తమిళం, బెంగాలీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

శక్తిమంతమైన పాత్రలో...



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న చిత్రం 'అధీరా'. కల్యాణ్ దాసరి కథానాయకుడిగా శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. సోమవారం ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న ఎస్‌జే సూర్య లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. తలకు కొమ్ములతో రాక్షసుడి లుక్‌లో ఉన్నారాయన. అధీరాతో తలపడే శక్తిమంతమైన ప్రతినాయకుడి పాత్రను ఆయన పోషిస్తున్నట్లు ఈ లుక్ ద్వారా తెలుస్తోంది. ఈ సినిమా ఆశకు మధ్య అంధకారానికి మధ్య యుద్ధమని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్రీనాగేంద్ర తంగల, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

టాలీవుడ్ దర్శకుడు హాలీవుడ్‌కు



తెలుగు, తమిళ, హిందీ సినిమాలు చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకనిర్మాత సత్యారెడ్డి. ఇప్పుడు హాలీవుడ్‌లో ఓ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నారు. 'కింగ్ బుద్ధ' అనే టైటిల్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలను ప్రకటించనున్నారు. ఇటీవలె ఆయన దర్శకత్వం వహించిన 'ఉక్కు సత్యాగ్రహం' సినిమాను పలు భాషల్లోకి అనువదించారు. ఇప్పటిదాకా దాదాపు 55 చిత్రాలకు ఆయన దర్శకనిర్మాతగా వ్యవహరించారు.

క్రైమ్ థ్రిల్లర్



అర్జున్ సర్జా, ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న క్రైమ్ థ్రిల్లర్ చిత్రం 'మఫ్టీ పోలీస్'. దినేశ్ లెట్చుమనన్ దర్శకత్వంలో జి.ఎస్.ఆర్ట్స్ నిర్మిస్తోంది. తాజాగా చిత్రం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. సంభాషణలు, నటీనటుల ప్రదర్శన, స్టైలిష్ మేకింగ్ ఆకట్టుకున్నాయి. త్వరలోనే తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో చిత్రాన్ని విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అభిరామి, రామ్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఇష్టమైన పాత్రలో మరోసారి!



భారతీయ సినీ చరిత్రలో మహిళా ప్రాధాన్యం కలిగిన చిత్రాల సిరీస్‌లో 'మర్దానీ'కి ప్రత్యేక స్థానం ఉంది. సమాజానికి కనువిప్పు కలిగించేలా, కళ్లు తెరిపించేలా అద్భుతమైన కథలతో 'మర్దానీ' చిత్రం వచ్చిన ప్రతిసారీ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటూనే ఉంది. 2014, 2019 సంవత్సరాల్లో వచ్చిన 'మర్దానీ' 'మర్దానీ 2' చిత్రాలు భారీ విజయాన్ని అందుకున్నాయి. ఇప్పుడు 'మర్దానీ 3' రూపుదిద్దుకుంటోంది. యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రత్యేక పోస్టర్‌ను నవరాత్రి శుభారంభంగా సోమవారం విడుదల చేశారు. సీనియర్ హీరోయిన్ రాణీ ముఖర్జీ తనకు ఇష్టమైన డేర్ డెవిల్ పోలీస్ ఆఫీసర్ శివానీ శివాజీరాయ్ పాత్రను మరోసారి పోషిస్తున్నారు. మహిషాసురుడిని చంపిన దుర్గామాత శక్తిని తెలిపే 'అయిగిరి నందిని' శ్లోకంతో రిలీజ్ చేసిన పోస్టర్ అదిరిపోయింది. అభిరాజ్ మినావాలా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌ను ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 27న 'మర్దానీ 3' విడుదలవుతుంది.

ఉత్కంఠభరితం



రామ్‌ప్రసాద్ గురజాడ, అంజలి, శ్రీకాంత్ పెరుమాండ్ల ప్రధాన పాత్రధారులుగా టీ రాము తెరకెక్కిస్తున్న చిత్రం 'గాలి'. ఈ సోషియో ఫ్యాంటసీ చిత్రాన్ని చందా లక్ష్మీనారాయణ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్‌ను, పాటను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా టీ రాము మాట్లాడుతూ 'కలి పురుషుడికి, అమ్మవారికి మధ్య జరిగే భీకర పోరాటమే ఈ చిత్రం. క్షణక్షణం ఉత్కంఠభరితంగా సాగుతుంది' అని అన్నారు.

గుంటూరులో నాలుగు కలరా కేసులు

4 నమూనాల్లో విబ్రియో బ్యాక్టీరియా, 16 నమూనాల్లో ఈ.కోలి

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): భయపడినట్టే గుంటూరులో కలరా నిర్ధారణ అయింది..! జిల్లాలో సోమవారం నాలుగు కలరా కేసులు బయటపడ్డాయి. ఇందులో గుంటూరు నగరంలో మూడు, తెనాలిలో ఒకటి ఉన్నాయి. గుంటూరులో ఐదు రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ 146 మంది డయేరియా బారినపడ్డారు. వీరంతా గుంటూరు జీజీహెచ్‌తో పాటు ప్రైవేటు వైద్యశాలల్లో చేరారు. ఇప్పటి వరకు 62 మంది కోలుకొని డిశ్చార్జి అయ్యారు. ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ఉన్న రోగుల నుంచి 114 నమూనాలను సేకరించి గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ ల్యాబ్‌లో పరీక్షించగా సోమవారం 91 నమూనాల ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో మూడు నమూనాల్లో 'విబ్రియో కలరే' బ్యాక్టీరియా, 16 నమూనాల్లో ఈ.కోలి బ్యాక్టీరియా, ఒకదానిలో షిగెల్లా బ్యాక్టీరియా ఉన్నట్టు నిర్ధారించారు. 71 నమూనాల్లో ఎలాంటి బ్యాక్టీరియా లేదని తేలింది. తెనాలి మండలం అంగలకుదురులో ఒక యువతి కలరా బారిన పడినట్టు ప్రైవేటు వైద్యశాలలో నిర్వహించిన పరీక్షల్లో వెల్లడైంది.

పాత గుంటూరులో ఇంటింటి సర్వే..

కలరా వేగంగా వ్యాపించే అంటువ్యాధి కావడంతో అధికార యంత్రాంగం అప్రత్తమైంది. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్ హుటాహుటిన గుంటూరు కలెక్టరేట్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కలరా ప్రబలిన పాతగుంటూరు బాలాజీ నగర్ ప్రాంతాన్ని హాట్‌స్పాట్‌గా ప్రకటించారు. ఈ ప్రాంతంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. గుంటూరులో ప్రబలిన కలరాకు కలుషిత నీరే ప్రధాన కారణమని భావిస్తున్నారు. వర్షాల కారణంగా నీరు కలుషితమై ఉంటుందని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యవర్గాలు విజ్ఞప్తి చేశాయి.



సోమవారం శాసనసభ ఆవరణలో మంత్రులు, మహిళా ప్రజాప్రతినిధులు గ్రూప్ ఫొటో

శాసనమండలిలో 4 బిల్లులకు ఆమోదం

» కార్మికుల పనిగంటల పెంపు, 'మహిళలకు నైట్ డ్యూటీల' బిల్లును వ్యతిరేకిస్తూ వైసీపీ వాకౌట్

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసన మండలిలో సోమవారం నాలుగు ప్రభుత్వ బిల్లులు ఆమోదం పొందాయి. ఆంధ్రప్రదేశ్ మోటారు వాహనాల పన్నుల సవరణ బిల్లు (2025)ను రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ సభలో ప్రవేశపెట్టారు. గిరిజన కమిషన్ నియామకానికి సంబంధించి కాలపరిమితిని తొలగిస్తూ ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్ సవరణ బిల్లు (2025)ను గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, భిక్షాటనకు సంబంధించి కొన్ని అభ్యంతరకరమైన పదాలను తొలగిస్తూ ఏపీ ప్రివెన్షన్ ఆఫ్ బెగ్గింగ్ అమెండ్‌మెంట్‌బిల్లు (2025)ను సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయులు తరపున పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కార్మికుల పని గంటల పెంపు, మహిళలు రాత్రివేళల్లో కూడా పనిచేయడానికి (నైట్‌డ్యూటీ) అవకాశం కల్పిస్తూ ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సవరణ బిల్లు (2025)ను కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సభ ఆమోదం కోసం ప్రతిపాదించారు. మొదటి మూడు బిల్లులకు ప్రతిపక్ష వైసీపీ సభ్యులు అభ్యంతరం తెలపకపోవడంతో అవి ఏకగ్రీవంగా సభ ఆమోదం పొందాయి. కానీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సవరణ బిల్లును మాత్రం ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. బిల్లును పునఃసమీక్షించాలని వైసీపీ, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. సభలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికుల పని గంటలను పెంచడం వల్ల వారిపై యాజమాన్యాల వేధింపులు ఇంకా ఎక్కువవుతాయన్నారు. దీనికి మంత్రి వాసంశెట్టి సుభాష్ వివరణ ఇస్తూ.. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఐదు రోజుల్లో 48 పని గంటలు పూర్తి చేస్తే.. శని, ఆదివారాల్లో కార్మికులు తమ కుటుంబాలతో ఆనందంగా గడపడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ మార్పులను కూడా న్యాయస్థానం ఆదేశాల మేరకే చేశామని వివరించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ బిగోపిమూర్తి ఈ బిల్లును వ్యతిరేకిస్తూ సభలోనే ప్లకార్డును ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కానీ మండలి ఛైర్మన్ బిల్లు ఆమోదానికి ఓటింగ్ నిర్వహించారు. దీనికి అధికార పార్టీ సభ్యులు మద్దతు పలకడంతో బిల్లు ఆమోదం పొందినట్లు ప్రకటించారు.

మండలిలో పదే పదే వైసీపీ రచ్చ



శాసన మండలిలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

మెడికల్ కళాశాలలపై చర్చ కోసం పట్టు

» చర్చకు సిద్ధమని బీఏసీలోనే ప్రభుత్వం స్పష్టీకరణ

» అయినా తక్షణమే చేపట్టాలంటూ సభలో వైసీపీ డిమాండ్

» విపక్ష సభ్యుల తీరుపైచైర్మన్ అసహనం

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెడికల్ వైద్య కళాశాలల అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని బీఏసీ సమావేశంలోనే ప్రభుత్వం స్పష్టం చేసినా.. ప్రతిపక్ష వైసీపీ మాత్రం శాసనమండలి సజావుగా జరక్కుండా పదేపదే అడ్డుకుంటోంది. సోమవారం మండలి సమావేశం ప్రారంభమైన వెంటనే.. వైసీపీ సభ్యులు మెడికల్ కళాశాలలపై ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ప్రకటించారు. అనంతరం ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అయితే తక్షణమే ఆ అంశంపై చర్చించాలని వైసీపీ సభ్యులు వెల్‌లోకి వెళ్లి నిరసన తెలిపారు. తర్వాత ఛైర్మన్ పోడియం పైకి వెళ్లి నినాదాలు చేశారు. వారి నిరసనల మధ్యే ఛైర్మన్ ప్రశ్నోత్తరాలు కొనసాగించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. వైసీపీ సభ్యులు ఇదే అంశంపై గతంలోనే వాయిదా తీర్మానం ఇచ్చారని, చర్చించాలని బీఏసీలో కూడా నిర్ణయం తీసుకున్నామని గుర్తుచేశారు. రూల్ 64 ప్రకారం ఒకసారి వాయిదా తీర్మానం ఇచ్చిన అంశాన్ని.. మళ్లీ అదే సెషన్‌లో అదే రూపంలో ప్రస్తావించకూడదని.. సదరు నిబంధనలను పరిశీలించి వైసీపీ సభ్యులపై చర్య తీసుకోవాలని కోరారు. సభ సజావుగా జరిగేలా చూడాలని ఛైర్మన్‌ను కోరారు. విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలలపై చర్చ జరపాలని బీఏసీలో తీసుకున్న నిర్ణయాన్ని ఎందుకు పాటించరని ప్రశ్నించారు. తక్షణం చర్చించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలపై చర్చించాలని బీఏసీలోనే నిర్ణయం తీసుకున్నామని.. ఎజెండా ప్రకారం సభను నడవనివ్వాలని.. సభను ఆర్డర్‌లో పెట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు ఛైర్మన్‌ను కోరారు. 'గత ప్రభుత్వంలో మీరే ఛైర్మన్‌గా ఉన్నారు. మేం సభ్యులుగా ఉన్నాం. ఒక్క రోజైనా పోడియం వద్దకు రాలేదు. సభ సజావుగా జరగడానికి ఆర్డర్‌లో పెట్టండి.' అని కోరారు. మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ.. సభను సాగనివ్వకుండా అడ్డుకోవడం సరైందికాదని వ్యాఖ్యానించారు. ఛైర్మన్ స్పందిస్తూ.. రోజూపోడియం ఎక్కడం మంచి పద్ధతి కాదంటూ అసహనం వ్యక్తం చేశారు.అయినా వారు పరిస్థితి మారకపోవడంతో సభను ఉదయం 10.20కి వాయిదా వేశారు. తిరిగి రెండున్నర గంటలకు మధ్యాహ్నం 12.50 గంటలకు ప్రారంభమైంది.

బొత్స గారూ!.. జీఎస్టీ 2.0పై మీ వైఖరేమిటి?

» మండలిలో నిలదీసిన పయ్యావుల

» నిశ్చేష్టుడై నిల్చుండిపోయిన ప్రతిపక్ష నేత



అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బొత్స గారూ! జీఎస్టీ సంస్కరణలు 2.0పై మీ వైఖరి ఏమిటి? అంటూ మంత్రి పయ్యావుల కేశవ్ శాసన మండలిలో సూటిగాప్రశ్నించారు. సోమవారం ఆయన సభలో మాట్లాడుతూ.. 'శాసన సభ వ్యవహారాల సలహా కమిటీ(బీఏసీ) సమావేశంలో జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వాన్ని అభినందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానాన్ని ప్రవేశపెడితే... మీ పార్టీ పరంగా వ్యతిరేకిస్తామని చెప్పారు కదా? కానీ మీరు తీర్మానాన్ని వ్యతిరేకరించలేరు, వ్యతిరేకించరు కూడా. ఎందుకంటే జగన్ జీఎస్టీ సంస్కరణలను విప్లవాత్మకమైన మార్పుగా అభివర్ణించారు. ప్రధానిని ప్రశంసించారు. ఆమేరకు ఈరోజే (సోమవారం) ఎక్స్‌లో స్పం దించారు' అని అన్నారు. కేశవ్ వ్యాఖ్యలపై ఎలా స్పందించాలో తెలియక బొత్స నిశ్చేష్టుడై నిలుచుండిపోయారు. సోమవారం మధ్యాహ్నం శాసన మండలిలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రకటన చేశారు. దీనిపై బొత్స మాట్లాడుతూ.. 'జీఎస్టీ అమలులోకి వచ్చిన 2017 నుంచి ఇప్పటి వరకు దేశ ప్రజల నుంచి రూ.55 లక్షల కోట్లు వసూలు చేశారు. 8 ఏళ్ల తర్వాత సంస్కరణల పేరుతో రూ.2.40 లక్షల మేర ప్రజలపై భారం తగ్గించామంటున్నారు. సంతోషం. అయితే ఉత్తరభారతంలో ప్రజలు తినే పరోటా, చపాతీలపై జీఎస్టీని తీసేశారు. దక్షిణ భారతీయులు తినే ఇడ్లీ, దోశలపై జీఎస్టీ ఉందా? లేదా? అనే దానిపై మంత్రి(పయ్యావుల) స్పష్టత ఇవ్వలేదు" అని అన్నారు. జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలకు అందించడానికి ప్రభుత్వం ఏమైనా మెకానిజాన్ని ఏర్పాటు చేసిందా? అని వైసీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు ప్రశ్నించారు. వీటిపై మంత్రి పయ్యావుల పైవిధంగా స్పందించారు.



విశాఖలో జరిగిన 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

టెక్నాలజీ అంటే నాకెంతో ఇష్టం

సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో నాతో పోటీ పడే సీఎం దేశంలో లేరు

ఈ మాట ఎస్ఎం కృష్ణ కూడా చెప్పేవారు

ఏఐతో ప్రజా సమస్యల పరిష్కారం

సెమీ కండక్టర్స్‌లోకీ అడుగు పెడుతున్నాం

జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో బాబు

విశాఖలో 2 రోజుల సదస్సు ప్రారంభం

క్వాంటమ్ వ్యాలీగా రాష్ట్రం

రెండేళ్లలో ఏపీ బ్రాండ్ క్వాంటమ్ కంప్యూటర్: సీఎం

విశాఖపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలో రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటర్‌ను తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ప్రస్తుతం ప్రపంచంలో ఆరేడు దేశాలు మాత్రమే క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ఉన్నాయని అన్నారు. భవిష్యత్తులో క్వాంటమ్ కంప్యూటింగ్ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ఐటీ, సమాచార శాఖ విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో సోమవారం ప్రారంభించిన రెండు రోజుల 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సుకు ఆయన హాజరై ప్రసంగించారు. 'సివిల్ సర్వీసెస్-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ సదస్సులో ప్రసంగించారు. భారతదేశంలో టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకోవడంలో తనతో పోటీ పడే ముఖ్యమంత్రి ఎవరూ లేరన్నారు. ఇదే మాట మాజీ సీఎం దివంగత ఎస్ఎం కృష్ణ కూడా అనేవారు. "ప్రజలకు సేవలు అందించడంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ చాలా కీలకమైన పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వ శాఖల ద్వారా పౌర సేవలు అందించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాలా బాగా ఉపయోగపడుతుంది. సమాచార సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన పార్టీగా తెలుగుదేశం చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది. తొలుత ఈ-సేవ, ఆ తరువాత మీ-సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు సేవలు అందించాం. ఇప్పుడు మన మిత్ర ద్వారా 751 సేవలు వాట్సాప్ ద్వారానే అందించడానికి ఏర్పాట్లు చేశాం. ప్రధాని మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' అంటూ స్వదేశీ తయారీని ప్రోత్సహిస్తున్నారు. దీనిని అన్ని రంగాలకు విస్తరిస్తాం. పెద్దఎత్తున స్వదేశీ బ్రాండ్లు తయారుచేసి ప్రపంచ దేశాలకు అందించాలని పిలుపునిస్తున్నాను. ఏపీ ప్రభుత్వం 'సంజీవని' పేరుతో ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తోంది. దీన్ని మొదట ఏపీలో అమలు చేసి, ఆపై ఇతర రాష్ట్రాలకూ అందిస్తాం. 'ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త నినాదం'తో ముందుకు వెళుతున్నాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ల ద్వారా ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం ఇస్తాం" అని వెల్లడించారు.

సంస్కరణలతో భారీ రాబడి: కేంద్ర మంత్రి

ప్రభుత్వ కార్యాలయాల పనితీరును మార్చడానికి 2022లో ప్రారంభించిన పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) ద్వారా ఇప్పటి వరకు రూ. 33 వేల కోట్ల ఆదాయం (ఎలక్ట్రానిక్స్ తుక్కు విక్రయం) వచ్చిందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ చెప్పారు. ఆ ఆదాయం మూడు స్పేస్ మిషన్ల బడ్జెట్‌కు సమానమన్నారు. జాతీయ ఈ-గవర్నెన్స్-2025 సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ-గవర్నెన్స్‌లో ఉత్తమ విధానాలు అనుసరించిన కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయి సంస్థలు, గ్రామ పంచాయతీలు, విద్య, పరిశోధన సంస్థలకు ఆయన అవార్డులు ప్రదానం చేశారు. ఆరు విభాగాల్లో 10 స్వర్ణ, 6 రజత పతకాలు, మూడు జ్యూరీ అవార్డులు అందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రసంగిస్తూ.. "ప్రభుత్వ కార్యాలయాల్లో చెత్తను తరలించడం వల్ల ఏడు లక్షల చ.మీ. స్థలం వినియోగంలోకి వచ్చింది. రాత్రిపూట పారిశుధ్య పనులు నిర్వహించడానికి అవుట్ సోర్సింగ్ విధానాన్ని చంద్రబాబే ప్రారంభించారు. 25 ఏళ్లుగా విశాఖతో నాకు అనుబంధం ఉంది. అప్పటికీ ఇప్పటికీ ఎంతో అభివృద్ధి కనిపిస్తోంది. భోగాపురం కేవలం అంతర్జాతీయ విమానాశ్రయంగానే కాకుండా ప్రపంచంలోనే ఉత్తమమైనదిగా ఉండాలని చంద్రబాబు కోరుకుంటున్నారు. శ్రీహరికోటలో అదనపు లాంచ్ ప్యాడ్‌కు ఏర్పాట్లు చేయడం గర్వకారణం"అని చెప్పారు. విశాఖ ఐటీ హబ్‌గా మారడానికి వేగంగా అడుగులు పడుతున్నాయని రాష్ట్ర ఐటీ సెక్రటరీ కాటమనేని భాస్కర్ చెప్పారు. సదస్సులో ఆయన 'ఐటీ హబ్‌గా విశాఖ' అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు.

ఏఐ, క్వాంటమ్ అద్భుత కాంబినేషన్

అమెరికాకు సిలికాన్ వ్యాలీలా.. ఏపీకి క్వాంటమ్ వ్యాలీ పేరు తెస్తుంది. క్వాంటమ్ కంప్యూటింగ్‌కు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను అనుసంధానం చేస్తున్నాం. ఇది అపూర్వమైన కాంబినేషన్. రాబోయే పదేళ్లు చాలా కీలకమైన దశ. ఆ తరువాత ప్రపంచమే మారిపోతుంది. త్వరలో సెమీ కండక్టర్ రంగంలోకి కూడా ఏపీ అడుగు పెడుతుంది. దీనికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుంది. ఏపీలో ప్రస్తుతం శ్రీహరికోటలో స్పేస్ సిటీ, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, విశాఖలో మెడ్‌టెక్ పార్క్, విజయవాడలో క్వాంటమ్ వ్యాలీ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం కమ్యూనికేషన్‌లో 5జీ సేవలు అందుతున్నాయి. త్వరలోనే 6జీకి ఆపై 7జీకి కూడా వెళతాం.

రైతు సంక్షేమానికే ప్రాధాన్యం

ఐటీ గురించి మాట్లాడినా.. నా ప్రతీ నిర్ణయం వారి కోసమే: సీఎం

కష్ట సమయాల్లో అండగా ఉంటున్నాం

లాభసాటి వ్యవసాయానికి చర్యలు

ఉచితంగా సూక్ష్మపోషకాలు, భూసార పరీక్షలు

యూరియా తగ్గిస్తే బస్తాకు రూ.800 ప్రోత్సాహం

రాష్ట్రంలో ఉద్యాన సాగు బాగా పెరగాలి

ఎమ్మెల్యేలు నెలలో ఒక్కరోజు పొలం బాట

అసెంబ్లీలో వ్యవసాయంపై చర్చలో చంద్రబాబు



అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లాభసాటి వ్యవసాయం, రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. తాను ఐటీ గురించి మాట్లాడినా.. తాను తీసుకున్న ప్రతి నిర్ణయమూ రైతులకు ఉపయోగపడేలా చేశానన్నారు. రైతులు యూరియా వాడకం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని సూచించారు. ప్రతి ఎమ్మెల్యే నెలలో ఒక్క రోజైనా పొలం బాట పట్టాలని నిర్దేశించారు. అక్టోబరు నుంచి ప్రతి నెలా అధికారులు, ప్రజాప్రతినిధులు రైతుల దగ్గరకు వెళ్లి, వారి సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేలా యాక్షన్ ప్లాన్ ప్రకటిస్తామని వెల్లడించారు. సోమవారం శాసనసభలో వ్యవసాయ రంగంపై చర్చ సందర్భంగా సీఎం చంద్రబాబు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ మాట్లాడారు. రైతు సంక్షేమానికి, లాభసాటి వ్యవసాయానికి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని చెప్పారు. ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహిస్తామని, సూక్ష్మపోషకాలను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల క్యాన్సర్ వస్తున్నందున రైతులు ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించాలని కోరారు. 'రేషన్, పెన్షన్ల మాదిరిగా పోర్టబులిటీతో వచ్చే సీజన్ నుంచి ఆధార్ అనుసంధానంతో ఎంత ఎరువులు కావాలంటే అంత ఇస్తాం. పొలం దగ్గరకే ఎరువులు పంపుతాం. కానీ యూరియా వాడకం తగ్గించాలి. తగ్గించిన రైతులకు ఒక్కో బస్తాపై కేంద్రం పీఎం ప్రణమ్ పథకం కింద ఇచ్చే రూ.800 ప్రోత్సాహకాన్ని రైతులకే రాయితీగా ఇస్తాం' అని ప్రకటించారు. వ్యవసాయం గిట్టుబాటు కావాలంటే ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని సీఎం స్పష్టం చేశారు.


> 'నేను ఐటీ గురించే మాట్లాడతానని అందరూ అనుకుంటారు. కానీ నేనూ రైతు కుటుంబం నుంచే వచ్చాను. పాలనలో నా శ్రద్ధ అంతా రాజకీయాల కన్నా.. వ్యవసాయ రంగంపైనే ఉంటుంది. రైతు సేవను ఒక పవిత్ర కార్యక్రమంగా భావిస్తున్నాం. రాష్ట్ర రైతాంగానికి ఎన్డీయే ప్రభుత్వం అండగా ఉంటుంది.'
> - సీఎం చంద్రబాబు

ఎగుమతి అవకాశమున్న పంటలతో 'గిట్టుబాటు'

'ప్రతి ఎమ్మెల్యే నెలకో రోజు పొలం దగ్గరకు వెళ్లి రైతులతో మాట్లాడాలి. వచ్చే నెల నుంచి రైతుల దగ్గరకు వెళ్లే కార్యక్రమాన్ని చేపట్టి, వారి సమస్యలు విని పరిష్కరించాలి. మారిన ప్రజల అలవాట్లకు అనుగుణంగా పంటల సాగు విధానం ఉండాలి' అని పేర్కొన్నారు. డిమాండ్ ఉన్న పంటలకే మార్కెట్ ఉంటుందన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా చిరు ధాన్యాలు, ఆయిల్‌పామ్ వంటి నూనెగింజల పంటలపైనా దృష్టి సారించాలని సూచించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దెబ్బకి ఆక్వా రంగం విలవిలలాడుతోందని సీఎం వ్యాఖ్యానించారు. ప్రత్యామ్నాయాలపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. అయినా దేశీయ వినియోగం పెరగాలన్నారు. గతంలో కోడిగుడ్లను ప్రోత్సహించినట్లే.. ఇప్పుడు రొయ్యల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. ఆక్వా రైతులకు సాయపడాలని బ్యాంకర్లతోనూ మాట్లాడుతున్నామని తెలిపారు. ఆక్వా ఉత్పత్తుల కోసం కొత్త మార్కెట్లను అన్వేషిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 35 శాతం జీఎస్డీపీ వ్యవసాయ రంగంపైనే వస్తోందని సీఎం చెప్పారు. 'ఏపీని భవిష్యత్‌లో హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం. ఉద్యాన పంటల్ని 2029 నాటికి 25 లక్షల హెక్టార్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వెనుకబడిన జిల్లాల్లోనూ ఉద్యాన సాగు పెద్ద గేమ్ చేంజర్ అవుతోంది' అని సీఎం చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టామని, కృత్రిమ మేథ ద్వారా మరింత సాంకేతికతను అందిస్తామని తెలిపారు.

రైతులకు అన్ని విధాలుగా అండగా..

ఈ ఏడాది జలాశయాలన్నీ కళకళలాడుతున్నాయని సీఎం అన్నారు. సమర్థ నీటి నిర్వహణ ఫలితంగానే ఈ అవకాశం ఏర్పడిందన్నారు. నెల్లూరులో ఎప్పుడూ ఒకే పంట వేస్తారని, ఈసారి రెండు పంటలు వేశారని చెప్పారు. రైతుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, కొందరు అవాస్తవాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద ఒకేసారి రూ.7 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో వేశాం. ఉల్లి ధర పడిపోతే హెక్టారుకు రూ.50 వేలు ప్రకటించాం. టమాటో ధర పడిపోతే 1,267 టన్నులు కొన్నాం. మామిడి రైతులకు రూ.194 కోట్లు చెల్లించాం. ఉద్యాన రైతులకు 90 శాతం రాయితీతో సూక్ష్మసేద్య పరికరాలు అందిస్తున్నాం' అని చెప్పారు.



దేశీయ ఉత్పత్తులనే కొనండి

» రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి పిలుపు



శాసనసభలో సోమవారం మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేశీయంగా తయారైన ఉత్పత్తులనే రాష్ట్ర ప్రజలు కొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపిచ్చారు. భారత ఉత్పాదక రంగాన్ని పటిష్ఠం చేయాలని కోరారు. అంతర్జాతీయ మార్కెట్లో గట్టి పోటీ ఇచ్చేలా 'బ్రాండ్ ఇండియా'ను అభివృద్ధి చేయడం అందరి బాధ్యతని స్పష్టం చేశారు. దీనివల్ల ఎవరిపై ఆధారపడకుండా దేశ ఆర్థిక వ్యవస్థ స్వయంసమృద్ధి సాధిస్తుందని, భారత సమాజ ఉపాధికి అదొక హామీగా నిలుస్తుందన్నారు. సోమవారం శాసనసభలో జీఎస్టీ ప్రయోజనాలు, ప్రచార కార్యక్రమాలపై సీఎం మాట్లాడారు. 'జీఎస్టీ సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కొత్త దశకు నాంది పలుకుతున్నాయి. పన్ను వ్యవస్థను సులభతరం చేయడం వల్ల పారదర్శకత, ప్రజల ఆదా శక్తి పెరుగుతాయి. ఈ మార్పులు పేదలకు, నూతన మధ్యతరగతికి, మధ్య తరగతికి లాభాన్నిస్తాయి. ప్రగతిశీల ప్రజా విధానాల ద్వారా పేదలు, మధ్యతరగతి వారి జీవితాలు మార్చడమే మా లక్ష్యం. భారత స్వాతంత్ర్య శత వార్షికోత్సవం నాటికి ఆర్థిక అసమానతలు తగ్గించి, బలమైన, సమతుల్యమైన సమాజాన్ని నిర్మించడం మా ఆకాంక్ష. ఈ లక్ష్యానికి సూపర్ జీఎస్టీ, సూపర్ సిక్స్, పీ4 కార్యక్రమాలు శక్తిమంతమైన ఇంధనంగా నిలుస్తాయి. ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్ర వైపునకు నడిపిస్తాయనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం' అని చెప్పారు. ఈ సంస్కరణలు భవిష్యత్ తరాలను మార్చేంత శక్తిమంతమైనవని, వీటికి సమానంగా మరికొన్ని సంస్కరణలు తెచ్చుకోగలిగితే 2047 నాటికి ఇండియా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తయారవుతుందన్నారు. జీఎస్టీ సంస్కరణలతో దేశవ్యాప్తంగా రూ.2.25 లక్షల కోట్ల ప్రయోజనం వస్తే.. రాష్ట్రానికి రూ.8,000 కోట్ల ప్రయోజనం వస్తుందని చెప్పారు. 'ఇంట్లో వాడే వస్తువులకు జీరో పన్ను ఉంటుంది. వినియోగం పెరిగి చిన్న వ్యాపారులకు, ఎంఎస్ఎంఈలకు ఊతమిస్తుంది. ఈ సందర్భంగా ప్రజలందరికీ దసరా, దీపావళి శుభాకాంక్షలు' అని తెలిపారు.

ఇంటింటికీ ప్రచారం..

జీఎస్టీ ఫలాలు ప్రజలందరికీ అందించాల్సిన బాధ్యత తమపై ఉందని సీఎం చెప్పారు. అందుకే ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం కోసం ఐదుగురు మంత్రులతో ఒక కమిటీ వేశామన్నారు. ఇందులో లోకేశ్, పయ్యావుల కేశవ్, అనిత, కందుల దుర్గేశ్, సత్యకుమార్ ఉంటారని తెలిపారు. జీఎస్టీ ప్రయోజనాల గురించి రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ, అన్ని వర్గాలకు చేరవేయడం కోసం సోమవారం నుంచే ప్రచారం ప్రారంభిస్తున్నామని.. నెల రోజులపాటు 65,000 సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. గ్రామ/వార్డు సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఇంటింటి ప్రచారం చేయిస్తామని తెలిపారు. విద్యాసంస్థలు, కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. 'జీఎస్టీ 2.0 వల్ల కుటుంబాల పొదుపు ఎలా పెరిగిందో ఇంటింటికీ ప్రచారపత్రాలు పంచి చైతన్యపరచడం, వ్యవసాయం, ఇతర విభాగాల వారీగా ఎవరెవరికీ ఏ విధంగా ప్రయోజనాలు అందుతున్నాయో అర్థమయ్యేలా చెప్పడం, మానవనరుల అభివృద్ధి, టెక్నాలజీని ప్రజలకు చేరువ చేయడం, ఉపాధి అవకాశాలు, డిజిటల్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రజలను భాగస్వాములు చేయడం, అభివృద్ధి, సంపద సృష్టిపై కార్యక్రమాలు నిర్వహించి స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారంపై అవగాహన కల్పిస్తాం. ఈ నెల 30, అక్టోబరు 1 తేదీల్లో ఎమ్మెల్యేలు కూడా అందుబాటులో ఉంటారు. వ్యవసాయం, ఉద్యానవన, ఉపాధి హామీ, మత్స్యకారులకు వచ్చిన లాభాలను అర్థమయ్యేలా చెబుతాం. ప్రజోపయోగం ఎక్కువగా ఉన్న అంశాలపై రాష్ట్రంలో 850 కేంద్రాల్లో, పరిశ్రమలకు సంబంధించిన అంశాల్లో 200 కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. అక్టోబరు 6వ తేదీన సెలూన్లు, స్పా, యోగా, జిమ్‌ల్లో ప్రచారం చేపడతాం. అక్టోబరు 19న 26 జిల్లాల్లో ప్రభుత్వం తరఫున దీపావళి సంబరాలు నిర్వహిస్తాం. రైతు సేవా కేంద్రాల్లో, గ్రామ/వార్డు సచివాలయాల్లో.. వాణిజ్య పన్నుల అధికారులు, ప్రజాప్రతినిధులను, టీచర్లను నియమించి.. వారి ద్వారా అన్ని వర్గాలకు కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తాం' అని చెప్పారు. డిజిటల్ మాధ్యమాల ద్వారా కూడా ప్రచారం చేస్తామని తెలిపారు.

షెడ్యూల్డ్ ఏరియాలోకి 496 గ్రామాలు



» ప్రతిపాదనలు సిద్ధం చేశాం: మంత్రి సంధ్యారాణి

రాష్ట్రంలో 496 గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతం పరిధిలోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు వచ్చాయని, 50 శాతం కంటే ఎక్కువ గిరిజనుల కలిగిన గ్రామాల వివరాలు తీసుకోవాలని ఐటీడీఏ పీవోలు, కలెక్టర్లకు సూచించామని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. సోమవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో బండారు సత్యనారాయణమూర్తి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని 9 గ్రామ పంచాయతీల్లోని 60 గ్రామాల్లో 25 వేలకు పైగా గిరిజన జనాభా ఉన్నట్లు గుర్తించామన్నారు. బండారు మాట్లాడుతూ రాష్ట్రంలో 600 గిరిజన గ్రామాలు నాన్ షెడ్యూల్ ఏరియాలో ఉన్నాయని, దీంతో ఈ గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని చెప్పారు. కోవూరు నియోజకవర్గంలోని 138 గిరిజన కాలనీలను షెడ్యూల్డ్ ఏరియాలోకి తీసుకోవాలని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. యానాదుల కార్పొరేషన్ ఏర్పాటు హామీని నెరవేర్చాలన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 58 గిరిజన గ్రామాలను ఐటీడీఏ పరిధిలోకి తీసుకోవాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. రోడ్ల పక్కన విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉండే చెట్లను నరికేస్తున్నారా? వాటి రక్షణకు ఏం చర్యలు తీసుకుంటున్నారని జనసేన ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అడిగారు. చెట్ల కొమ్మలను మాత్రమే కత్తిరిస్తున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. ఇబ్రహీంపట్నంలోని థర్మల్ పవర్ స్టేషన్ నుంచి విడుదలయ్యే ఫ్లైయాష్ వల్ల కాలుష్యం ఏర్పడి, ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారంటూ వసంత కృష్ణప్రసాద్ అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి సమాధానం చెప్పారు. థర్మల్ స్టేషన్ నుంచి వచ్చే ఫ్లైయాష్ నిర్వహణ వ్యవస్థల పటిష్ఠతకు ఏపీ జెన్‌కో చర్యలు చేపట్టిందని తెలిపారు.

జూన్‌నాటికి టిడ్కో ఇళ్లు పూర్తి

» పూర్తయినవి ప్రతివారమూ అప్పగింత

» పెండింగ్ పనులకు 7,280కోట్లు కావాలి

» అసెంబ్లీలో మంత్రి నారాయణ వెల్లడి



అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వచ్చే సంవత్సరం జూన్ చివరినాటికి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 2,61,640 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి, మౌలిక సదుపాయాల కల్పన పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. ప్రతి శనివారం పూర్తయిన ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. టిడ్కో ఇళ్లపై సోమవారం శాసనసభలో చేపట్టిన చర్చ సందర్భంగా ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. "2014-19 మధ్యకాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఏడులక్షల మంది పట్టణ ప్రజలకు ఇళ్లు అవసరం అని అంచనా వేశాం. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని 2.61 లక్షలకు కుదించింది. 4.39లక్షల ఇళ్లను ఏకపక్షంగా రద్దుచేసింది. మేం నాడు 2019 మే నాటికి 71వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశాం. ఆ తర్వాత 1.75లక్షల ఇళ్లను, మౌలిక సదుపాయాల పనులను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టింది. ఇళ్లకు సంబంధించి కాంట్రాక్టర్లకు రూ.3100 కోట్లు, అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు రూ.3200 కోట్ల మేర నిధులు అవసరం. ఇతర మౌలిక సదుపాయాల పనులను కూడా కలుపుకొంటే మొత్తం రూ.7,280 కోట్లు అవసరం. ఈ నిధులను వేర్వేరు మార్గాల్లో సమీకరించే ప్రయత్నాలు చేస్తున్నాం. గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లు కడుతున్నప్పుడు తెలుగుదేశం పార్టీ రంగులు వేయాలనే సూచనను చంద్రబాబు తిరస్కరించారు. కానీ ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం... ఆ పార్టీ రంగులు వేసుకుంది. ఉత్తర్వులు లేకుండా వేసిన ఆ రంగులకు నిధులు ఇవ్వలేమని సాంకేతిక కమిటీ స్పష్టంచేసింది' అని చెప్పారు.దీనిపై ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వేయమంటేనే రంగులు వేశారన్నారు.

త్వరలో లబ్ధిదారులకు అప్పగించాలి

టిడ్కో ఇళ్లను వీలైనంత త్వరగా లబ్ధిదారులకు అప్పగించాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... అప్పటి టీడీపీ ప్రభుత్వంలో కేటాయించిన ఇళ్లను వైసీపీ రద్దు చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కావాలనే కొందరికి ఇళ్లు రద్దు చేశారని జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆరోపించారు.

లబ్ధిదారుల పేరుతో జగన్ రుణాలు తీసుకున్నదని వాస్తవం చెప్పినందుకు తనను వైసీపీ సైకో బ్యాచ్ వాట్సాప్, ఇతర మార్గాల్లో పచ్చి బూతులు తిడుతున్నదని బుచ్చయ్య చౌదరి ఆవేదన వ్యక్తంచేశారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

బీజేపీ ఎమ్మెల్యేనని ఇబ్బంది పెడతారా?

» వైసీపీ వ్యక్తి మైనింగ్‌కు కూటమి ఎమ్మెల్యే దన్ను

» అసెంబ్లీలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు ఆరోపణ

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్యేనని తన పక్క నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే, ఇతరులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. గతేడాది జూన్ 4న తాము ఎమ్మెల్యేలుగా ధ్రువీకరణపత్రాలు అందుకుంటే, ఆ మరుసటి రోజే తన నియోజకవర్గంలో జీకే ఇన్‌ఫ్రా అనే వైసీపీ నాయకుడి మైనింగ్ కంపెనీకి అనుమతులు ఇచ్చారని తెలిపారు. వారికి తన పక్క నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. పైగా తాను డబ్బులు అడిగానని, బ్లాక్ మెయిల్ చేశానని దుష్ప్రచారం చేస్తున్నారని వాపోయారు. తనకూ క్వారీలకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు.

జీరో అవర్‌లో సమస్యలు లేవనెత్తిన ఎమ్మెల్యేలు

- గోదావరి-పెన్నా ప్రాజెక్టును పునఃప్రారంభించి పల్నాడు రైతులను ఆదుకోవాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కోరారు. వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టును ఆపేయడంతో వందల కోట్ల విలువైన మెటీరియల్ తుప్పు పడుతోందన్నారు.
- తన నియోజకవర్గంలో యూరియా కొరత ఎక్కువగా ఉందని, ప్రభుత్వం చొరవ తీసుకుని ఎరువులు అందించాలని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి కోరారు.
- అనంతపురంలో ఆర్డీటీ సంస్థ సేవలు తిరిగి కొనసాగేలా చర్యలు తీసుకోవాలని పరిటాల సునీత, బండారు శ్రావణి కోరారు.
- ఇనాం భూముల సమస్యలు పరిష్కరించి రైతులకు హక్కులు కల్పించాలని లోకం నాగ మాధవి కోరారు. వీరికి అన్నదాత సుఖీభవ నిధులు కూడా ఇవ్వలేదని చెప్పారు.
- మార్కాపురంలో మినీ మిర్చి యార్డు నిర్మించాలని నారాయణరెడ్డి కోరారు. అక్కడి రైతులు గుంటూరు వచ్చి మిర్చి అమ్ముకోవాల్సి వస్తోందన్నారు.
- పెసర పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొని రైతులను ఆదుకోవాలని తంగిరాల సౌమ్య కోరారు.
- వైసీపీ హయాంలో చేసిన అడ్డగోలు మ్యాపింగ్ వల్ల చాలా కుటుంబాల్లో రేషన్ ఇబ్బందులు తలెత్తాయని గౌతు శిరీష చెప్పారు. రేషన్ కార్డుల విభజన, పేర్ల తొలగింపునకు అవకాశం కల్పించాలని కోరారు.

'విశాఖ డెయిరీ' నివేదిక గడువు పొడిగింపు

విశాఖ డెయిరీ అక్రమాలపై జరుగుతున్న విచారణ నివేదికను సమర్పించే గడువును ఆరు నెలలు పొడిగించినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. డెయిరీ చైర్మన్ అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగా, 2014-19లో ఆప్కాబ్, డీసీసీబీలు, పీఏసీఎస్‌లలో అవినీతి ఆరోపణలపై విచారణకు ప్రత్యేక సభా సంఘాన్ని పునర్ వ్యవస్థీకరిస్తున్నట్లు వెల్లడించారు.

రబీ నుంచి ఆధార్‌పై ఎరువులు

» అవసరమైతే డోర్ డెలివరీ చేస్తాం.. సభకు రాకుండా.. విమర్శలా?

» యూరియాపై 800 పోస్టులు పెట్టారు

» రైతులు ఆందోళనతో ముందే కొనేశారు

» అసెంబ్లీలో లఘుచర్చలో మంత్రి అచ్చెన్న వెల్లడి



అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు భూసార పరీక్షలు నిర్వహించకుండా.. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన సూక్ష్మపోషకాలను ఎత్తేసిన మాజీ సీఎం జగన్.. శాసనసభకు రాకుండా బయట ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఐదేళ్లు వ్యవసాయ రంగాన్ని, రైతు సంక్షేమాన్ని ఆయన గాలికి వదిలేస్తే.. బడ్జెట్ కేటాయింపులతో పని లేకుండా సీఎం చంద్రబాబు రైతులను ఆదుకుంటున్నారని చెప్పారు. సోమవారం అసెంబ్లీలో వ్యవసాయ రంగంపై ఆయన లఘు చర్చను ప్రారంభించి మాట్లాడారు. 'ఏపీ అంటే అన్నపూర్ణ. 64% జనాభా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారు. రైతులను ఆదుకోవడానికి చంద్రబాబు ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారు. 15% వృద్ధి రేటు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నాం. ఈ ఏడాది 1.23 లక్షల హెక్టార్లలో సాగు పెరిగింది. యూరియా అధికంగా వాడితే క్యాన్సర్ వంటి ముప్పుందని పంజాబ్‌లో తేలింది. కేంద్రం కూడా యూరియా తగ్గించాలని చెప్పింది. అయితే దీనిపై యూరియా ఇవ్వడం లేదంటూ 800 పోస్టులు పెట్టారు. అమెరికా నుంచి కూడా పెట్టిన తప్పుడు పోస్టులతోనే యూరియా దొరకదన్న ఆందోళనతో రైతులు ముందే కొనేశారు. యూరియా ఇవ్వలేని చంద్రబాబు, అచ్చెన్నాయుడు బావిలో దూకాలని జగన్ మాట్లాడాడు. రైతులు కష్టాల్లో ఉన్నారు. సమస్యలు లేవనడం లేదు. ఏవైనా లోపాలుంటే సరిజేసుకుంటాం. అంతే గానీ తప్పుడు మాటలు మాట్లాడతారా? చంద్రబాబు కేంద్ర మంత్రితో మాట్లాడి, డిమాండ్ మేరకు యూరియా తెప్పించారు. ఎక్కడైనా కొరత ఉంటే రవాణా ఖర్చులు భరించి, సరఫరా చేశాం. ఏపీకి కోటా ప్రకారమే యూరియా వచ్చింది. రబీకి కూడా కొరత ఉండదు. రబీ నుంచి ఆధార్‌పై ఎరువులు సరఫరా చేస్తాం. అవసరమైతే డోర్ డెలివరీ ఇస్తాం' అని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఒక్క భూసార పరీక్ష కూడా చేయలేదని చెప్పారు '1,375 ప్రయోగశాలలున్నాయంటారు. ఒక్కటీ పని చేయడం లేదు. ల్యాబ్ అసిస్టెంట్లు లేరు. చాలెంజ్ చేస్తున్నా.. ఒక్కటైనా సక్రమంగా ఉంటే చూపాలి. ల్యాబ్‌లు ఎవరు పెట్టినా ప్రభుత్వ ఆస్తి. వాటిని మేం పునరుద్ధరిస్తాం. ఈ ఏడాది 10.31 లక్షల భూసార పరీక్షల కార్డులిచ్చాం. వైసీపీ హయాంలో ఉచిత పంటల బీమా అని మూడేళ్లు ప్రీమియం కట్టలేదు. ఐదేళ్లూ రబీకి బీమా వర్తింపజేయలేదు. యాంత్రీకరణకు రూపాయి ఖర్చు చేయలేదు. సూక్ష్మసేద్యానికి నిధులివ్వలేదు. ధరల స్థిరీకరణ కింద రూ.8 వేల కోట్లు ఇచ్చానన్న జగన్.. రూపాయి ఖర్చు చేయలేదు. వరి ధాన్యం, రొయ్యలపై సెస్ విధించి, సొమ్మంతా ఇతర అవసరాలకు వాడుకున్న వాళ్లను ఉరితీయాలి. మొత్తం తినేసి, వ్యవసాయ రంగాన్ని భ్రష్టు పట్టించిన వాళ్లా రైతుల గురించి మాట్లాడేది? ప్రజలు బుద్ధి చెప్పినా.. ఇంకా బుద్ధి రాలేదు' అని ధ్వజమెత్తారు.

కేంద్ర పథకాలను వినియోగించాలి..

విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రయోజిత పథకాలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ఇప్పుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూరియా లేదంటూ కారుకూతలు కూస్తున్న జగన్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. కౌలురైతులకు యజమానితో నిమిత్తం లేకుండా రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. పల్నాడు జిల్లాలో సూక్ష్మసేద్యం ద్వారా ఉద్యాన సాగు పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కోరారు. వైట్ గోల్డ్‌గా పేరున్న జీడి మామిడి పరిశ్రమకు ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చేలా చర్యలు తీసుకోవాలని.. జీడి పిక్కలపై సెస్ ఎత్తేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. వ్యవసాయ రంగంలో ఏఐ, డ్రోన్ టెక్నాలజీ పెంచాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ (ఆళ్లగడ్డ) సూచించారు. ఆక్వా రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ (ఆముదాలవలస) కోరారు.

'పీపీపీ'.. ప్రైవేటు కాదు!

» ప్రభుత్వ ఆస్తులను ఎవరికీ అమ్మడం లేదు

» తన వారి కాంట్రాక్టులు పోతున్నాయనే జగన్ బాధ: లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): 'పీపీపీ' విధానం అంటే ప్రైవేటీకరణ కాదని విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. సోమవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో పలు అంశాలపై మీడియాతో మాట్లాడారు. పీపీపీపై వైసీపీది అనవసర రాద్ధాంతమని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుకు విక్రయించడం లేదన్నారు. 2028 నాటికి అన్ని మెడికల్ కాలేజీల నిర్మాణాలను పూర్తి చేస్తామని, పీపీపీ విధానం వల్ల విద్యార్థులకు ఎలాంటి నష్టం కలుగకుండా చూస్తామని స్పష్టం చేశారు. "రోడ్లు, విమానాశ్రయాలు అన్నీ పీపీపీ విధానంలోనే అభివృద్ధి చేస్తున్నాం. మరి వాటన్నింటినీ ప్రైవేటు వారికి కట్టబెట్టేసినట్లేనా?. ఇప్పుడు ఇంత గగ్గోలు పెడుతున్న జగన్.. ఐదేళ్ల కాలంలో 5 మెడికల్ కాలేజీలను కూడా ఎందుకు పూర్తి చేయలేదు? కనీసం తన పులివెందులలోనూ పూర్తి చేయలేకపోయారు" అని అన్నారు. గతంలో చంద్రబాబు ఇంజనీరింగ్ కాలేజీలకు అనుమతి ఇచ్చే సమయంలో అప్పటి కాంగ్రెస్ నేతలు ఇలాంటి విమర్శలే చేశారని, అప్పుడు చంద్రబాబు వెనకడుగు వేసి ఉంటే ఇప్పుడు ఇన్ని ఇంజనీరింగ్ కాలేజీలు వచ్చేవా? అని ప్రశ్నించారు. "ప్రిజనరీకి-విజనరీకి ఉన్న తేడా అదే." అని జగన్‌ను ఎద్దేవా చేశారు. "జగన్ తాను కట్టిన కాలేజీలను చూసి ఆహా.. ఓహో అనాలని అంటున్నారు. అసలు కాలేజీలు ఉంటే కదా అనడానికి. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రైవేటును భాగస్వాములను చేస్తే అది ప్రైవేటీకరణ ఎలా అవుతుంది? తన మనుషులకు ఇచ్చిన కాంట్రాక్టులు పోతున్నాయనే జగన్ భయం. అందుకే గగ్గోలు పెడుతున్నారు." అని దుయ్యబట్టారు. ఇంకా ఏమన్నారంటే..

అక్టోబరు నుంచి పెట్టుబడుల వరద

జగన్ ఐదేళ్ల విధ్వంసం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాం. మరో ఏడాది అయితే కాస్త ఒడ్డున పడతాం. అక్టోబరు నుంచి వరుస పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం. విశాఖలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు త్వరలోనే ప్రారంభమవుతాయి. టీసీఎస్ ఇప్పటికే నియామకాలు మొదలు పెట్టింది. ఈ ఏడాది జనవరిలో అమరావతిలోని విట్ క్యాంపస్‌లో క్వాంటం కంప్యూటర్లను ఏర్పాటు చేస్తాం. తర్వాత పూర్తిస్థాయి భవనాన్ని సిద్ధం చేసి అక్కడికి తరలిస్తాం. పరిశ్రమలు తీసుకువచ్చేందుకు మా వద్ద మూడు మంత్రాలున్నాయి. చంద్రబాబు బ్రాండ్, ఆయన విజన్, సమర్థ నాయకత్వం మొదటిది. రెండోది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, మూడోది.. ఏపీ ప్రభుత్వం పరిశ్రమలను ఆకర్షించడంలో స్టార్టప్ కంపెనీలా శ్రమిస్తుంది. పెట్టుబడుల ఆకర్షణలో ఈ మూడూ మా విజయ రహస్యాలు. జీఎస్టీ-2.0 ఆర్థికవృద్ధికి దోహదపడుతుంది. జీఎస్టీ వల్ల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఆర్థిక పురోగతి ఉంటుంది. ఫలితంగా పన్ను చెల్లింపులు పెరుగుతాయి. జీఎస్టీ-2.0 ప్రయోజనాలపై అక్టోబరు మూడో వారంలో భారీ సదస్సు నిర్వహిస్తున్నాం. దీనికి రావాలని ప్రధానిని కూడా ఆహ్వానించాం.

జగన్ హెలికాప్టర్ ఖర్చు.. 220 కోట్లు


అక్రమనిర్బంధాలకు టీడీపీ వ్యతిరేకం. మా ప్రభుత్వంలో నిర్బంధాలకు తావులేదు. ఉద్యోగుల డీఏ, సరెండర్ లీవులపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. 3 నెలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తాం. ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలోనే డీఎస్సీ నిర్వహిస్తాం. జగన్ ఐదేళ్లలో చేసిన హెలికాప్టర్ ఖర్చు రూ.220 కోట్లుపైచిలుకు. చంద్రబాబు అందులో 10వ వంతు కూడా ఖర్చు చేయకుండానే జగన్ కన్నా ఎక్కువగా తిరుగుతున్నారు.

పరకామణి చోరీపై సిట్!

తిరుమల పరకామణి చోరీపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించి విచారణ చేయిస్తామని లోకేశ్ తెలిపారు. "2023 ఏప్రిల్ 29 రాత్రి 11 గంటలకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, మరుసటి రోజే చార్జిషీట్ వేశారు. పకడ్బందీగా కేసును నిర్వీర్యంచేశారు. ముందుగా చార్జిషీట్ రెడీ చేసుకుని తారీకు మారగానే కోర్టులో వేశారు. శ్రీవారి సొత్తును చోరీ చేస్తే సాదాసీదా నేరం జరిగినట్లు 41(ఏ) కింద నోటీసు ఇచ్చి విచారణ చేసి పంపేశారు. తర్వాత లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. లడ్డూ ప్రసాదంలో ఉపయోగించిన నెయ్యిలో అసలు నెయ్యే లేదని సీబీఐ నిగ్గుతేల్చింది. పరకామణి చోరీపై జగన్‌ను మాట్లాడమనండి. సభకు వచ్చి చర్చించమనండి. కరుణాకర్‌రెడ్డి క్రైస్తవ మతాన్ని ఆచరిస్తారు. అలాంటి వ్యక్తికి టీటీడీ చైర్మన్ పదవి ఎలా ఇచ్చారు." అని ప్రశ్నించారు.

జీతాల కోసం దొంగ సంతకాలు

వైసీపీ హయాంలో చంద్రబాబు సభకు ఎందుకు రావడం లేదో స్పష్టంగా చెప్పి మరీ వెళ్లారు. ఈ రోజు జగన్, ఆయన ఎమ్మెల్యేలు సభకు రాకపోవడానికి కారణం ఉందా?. వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత గురించి మేం మాట్లాడం. వారు సభకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. కనీసం వారి నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించేందుకైనా వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలి. మాకు 23 ఎమ్మెల్యేలే ఉన్నా అసెంబ్లీకి వచ్చాం. మండలిలో మెజార్టీ లేకున్నా హాజరయ్యాం. మమ్మల్ని అవమానించినా వెనుకడుగు వేయలేదు. కానీ వైసీపీ ఎమ్మెల్యేలు జీతాల కోసం దొంగతనంగా వచ్చి సంతకాలు పెట్టి పోతున్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు లేని లోటును కూటమి ఎమ్మెల్యేలే భర్తీ చేస్తున్నారు. ఇది మంచి సంప్రదాయం. నిర్మాణాత్మక విమర్శలు ప్రభుత్వానికి చాలా అవసరం.



ప్రభుత్వ పాఠశాలల వద్ద 'నో వేకెన్సీ' బోర్డులే లక్ష్యం!

- విద్యార్థులతో కళకళలాడేలా సర్కారు స్కూళ్లను మారుస్తాం
- గత ప్రభుత్వ జీవో 117తో 10 లక్షల మంది విద్యకు దూరం
- రాష్ట్రంలో 'వన్ క్లాస్.. వన్ టీచర్'
- వచ్చే రెండేళ్లలో అంతర్జాతీయ స్థాయిలో 'అమరావతి లైబ్రరీ'
- పాఠశాలల మౌలిక వసతులకు దాతల నుంచి విరాళాలు స్వీకరిస్తాం
- స్కూళ్లకు వారి పేర్లు కూడా పెడతాం... శాసన సభలో లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులతో కళకళలాడేలా చేయడంతో పాటు వాటికి వెలుపల 'నో వేకెన్సీ' బోర్డు పెట్టాలన్నదే తన లక్ష్యమని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 100 పాఠశాలల్లో సీట్లు నిండిపోయి.. 'నో వేకెన్సీ' బోర్డులు పెట్టారని చెప్పారు. రాష్ట్రంలోని 42 వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇదే విధమైన పరిస్థితి తీసుకొచ్చేలా పనిచేస్తున్నామన్నారు. శాసనసభలో సోమవారం గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 117పై నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అడిగిన ప్రశ్నకు లోకేశ్ సమాధానమిచ్చారు. "ప్రాథమిక విద్యకు గొడ్డలిపెట్టులా పరిణమించిన జీవో 117, జీవో 85లను రద్దు చేశాం. వాటి స్థానంలో 'వన్ క్లాస్-వన్ టీచర్' విధానం తీసుకొచ్చాం. గత ప్రభుత్వ జీవో 117 కారణంగా 10 లక్షల మంది పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల 'లెర్నింగ్ అవుట్‌కమ్స్'(చదువులో రాణించడం)లో రాష్ట్రం వెనుకబడింది. ప్రాథమిక విద్యకు తీవ్ర నష్టం కలిగించేలా ఉన్న జీవో 117ను రద్దు చేయాలని యువగళం పాదయాత్రలో పలువురు ఉపాధ్యాయులు కోరారు. దీనికి ప్రత్యామ్నాయంగా 'వన్ క్లాస్-వన్ టీచర్' విధానంలో ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. రాష్ట్రంలో మా ప్రభుత్వం రాకముందు కేవలం 1,398 స్కూళ్లలో మాత్రమే 'వన్ క్లాస్-వన్ టీచర్' ఉండగా, మేం వచ్చిన తర్వాత 9,620 పాఠశాలలకు ఈ విధానాన్ని పెంచాం. ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించి గతంలో కేవలం 124 మాత్రమే ఉండగా ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత 729 పాఠశాలలను అప్‌గ్రేడ్ చేశాం. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను దేశానికే మోడల్‌గా మార్చాలని నిర్ణయించాం. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. 'మన బడి-మన భవిష్యత్తు' కింద ప్రక్రియ ప్రారంభమైంది. పాఠశాలల్లో అవసరమైన అదనపు తరగతి గదులు, మౌలిక వసతులపై ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. వీటికోసం ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేసి దాతల ద్వారా పారదర్శక విధానంలో ఎస్ఎంసీల పర్యవేక్షణతో పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. దాతలు ఇచ్చే నిధులను బట్టి ఆయా పాఠశాలలకు వారి పేర్లు పెట్టే ప్రతిపాదన కూడా ఉంది. పాఠశాలలకు ఇప్పటికే 'స్టార్ రేటింగ్' ఇచ్చే ప్రక్రియను ఏర్పాటు చేశాం. 1-స్టార్, 2-స్టార్ పాఠశాలలను మెరుగ్గా తీర్చిదిద్దాల్సిన బాధ్యత శాసన సభ్యులపై ఉంది. మౌలిక సదుపాయలతో పాటు హాజరు, పరీక్షలు, సామర్థ్యంతోపాటు విద్యార్థులు చదువుల్లో రాణించడంపై కూడా శ్రద్ధ పెడుతున్నాం. రాబోయే రోజుల్లో ప్రైవేట్ పాఠశాలల కన్నా మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది, మంచి ఫలితాలు తీసుకురావడానికి కృషి చేస్తున్నాం. విద్యార్థులు చదివే ప్రాథమిక పాఠశాలలు ఒక కిలో మీటరు కంటే ఎక్కువ దూరంలో ఉంటే రవాణా ఖర్చు కింద నెలకు రూ.600 చొప్పున 10 నెలలపాటు తల్లిదండ్రుల ఖాతాల్లో జమచేస్తాం. ఈ ఏడాది దాదాపు 70 వేల మంది విద్యార్థులకు ఈ రవాణా చార్జీలను అందజేస్తాం." అని మంత్రి లోకేశ్ వివరించారు.

విశాఖలో ఆధునిక గ్రంథాలయం

రాష్ట్రంలో లైబ్రరీల అభివృద్ధి, సెస్సు, బకాయిలకు సంబంధించి ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, గణబాబు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ సమాధానమిచ్చారు. ఈ అంశంపై స్వల్పకాలిక చర్చ పెట్టాల్సి ఉందన్నారు. అమరావతిలో రూ.150 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్రస్థాయి గ్రంథాలయ నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ లైబ్రరీ నిర్మాణాన్ని 24 నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రంలో లైబ్రరీలకు సంబంధించి మౌలిక వసతులతో పాటు మ్యానుస్క్రిప్ట్స్(లిఖిత గ్రంథాలు) కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి 'శోభ డెవలపర్స్' సంస్థ రూ.100 కోట్ల విరాళమిచ్చేందుకు ముందుకొచ్చిందని, మరింత మంది దాతల సహకారాన్ని కూడా తీసుకుని గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విశాఖపట్నంలో రూ.20 కోట్లతో ఆధునిక గ్రంథాలయ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గ్రంథాలయాల్లో కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నామని, దీనికిగాను కార్పొరేట్లతో కూడా చర్యలు జరిపామన్నారు.

మంగళగిరిలో మోడల్ లైబ్రరీ

మంగళగిరి నియోజకవర్గంలో మోడల్ లైబ్రరీ నిర్మాణం చివరి దశలో ఉందని, అక్టోబరులో ప్రారంభిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీల నిర్మాణాలను చేపడతామన్నారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన 26 జిల్లా గ్రంథాలయాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రంథాలయ సెస్సు బకాయిలకు సంబంధించి 2022-23లో 40 శాతం, 2023-24లో 45 శాతం, ప్రస్తుత సంవత్సరంలో 52 శాతం మాత్రమే వసూలయ్యాయన్నారు. సీఎం సూచనల మేరకు డిజిటల్ లైబ్రరీలపై దృష్టి సారించామన్నారు. దీనికి సంబంధించిన యాప్‌ను వంద రోజుల్లో ఆవిష్కరిస్తామని తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. లోకేశ్ హయాంలోనే గ్రంథాలయ సమస్య పరిష్కారం కావాలని కోరారు. గతంలో పుస్తకాలు కొనుగోలు చేసినా.. రూ.1.70 కోట్లు బకాయి పెట్టారని, ఆ సొమ్మును చెల్లించాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే సింధూరరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు.



జొన్నగిరికి పసిడిసిరి

కరువుసీమలో బంగారం శుద్ధి కర్మాగారం.. కర్నూలు జిల్లాలో ఏర్పాటుకు సిద్ధమైన 'జియోమైసూర్'



కర్నూలు జిల్లా జొన్నగిరి వద్ద జియో మైసూర్ కంపెనీ ఫ్యాక్టరీ ప్రధాన ద్వారం

200కోట్ల పెట్టుబడి..550 మందికి ఉపాధి

- ఏడాదికి 750 కిలోల నిక్షేపాల వెలికితీత లక్ష్యం
- లీజు విధానంలో 1500 ఎకరాల సేకరణ
- ఈ ఏడాది చివర్లో ప్రారంభానికి సన్నాహాలు

(పత్తికొండ/తుగ్గలి-ఆంధ్రజ్యోతి)

కరువుసీమలో పసిడికాంతులు విరియనున్నాయి. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతానికి బంగారం శుద్ధి కర్మాగారం రానుంది. ఆస్ట్రేలియాకు చెందిన జియోమైసూర్ కంపెనీ తన భాగస్వాములైన డెక్కన్, త్రివేణి కంపెనీలతో కలిసి జొన్నగిరి, పరిసర గ్రామాల్లో ఇప్పటికే పరీక్షలు పూర్తి చేసింది. రైతుల నుంచి భూముల సేకరణ.. కేంద్రం అనుమతులు.. గ్రామసభ తీర్మానాలు.. కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు.. అన్నీ పూర్తిచేసుకుని ఈ ఏడాది చివరకు కర్మాగారంలో పనులు మొదలుపెట్టేందుకు జియోమైసూర్ సిద్ధమవుతోంది. హంద్రీనీవా నుంచి నీరు తీసుకునేందుకు అనుమతులు ఇవ్వడం ద్వారా ఇక్కడ పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తగిన ప్రోత్సాహం అందిస్తోంది. రూ.200 కోట్లతో ఏర్పాటయ్యే ఈ కర్మాగారంలో 550మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనుంది.

మూడు దశాబ్దాల కిందటే..

జొన్నగిరి ప్రాంతంలో మూడు దశాబ్దాల క్రితమే కేంద్ర ప్రభుత్వం పసిడి అన్వేషణ మొదలుపెట్టింది. ఇందుకోసం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) జొన్నగిరి, పగడిరాయి గ్రామాల్లో పరిశోధనలు చేసింది. ఇక్కడ బంగారు నిక్షేపాలు ఉన్నట్లు తేల్చింది. అయితే వాటి వెలికితీతకు చాలా ఖర్చవుతుందని తేలడంతో ఆ ఆలోచనను విరమించుకుంది. ఆతర్వాత 2005లో జియోమైసూర్ రంగంలోకి దిగింది. ఇక్కడ పసిడి పరిశోధనల కోసం అనుమతులు పొందింది. ఆ ప్రాంతంలో తవ్వకాలు చేసి పసిడి నిక్షేపాలను అంచనా వేసే దిశగా పరిశోధనలు చేసింది. ఈ క్రమంలో జొన్నగిరి, పగడిరాయి, బొల్లబానిపల్లె, ఎర్రగుడి గ్రామాలపరిధిలో సుమారు 1,500 ఎకరాల విస్తీర్ణంలో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించింది. ఈ భూములను రైతుల నుంచి లీజుకు తీసుకుంది. ఏడాదికి ఎకరాకు రూ.14 వేలు లీజు చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. ఆ తర్వాత లీజును రూ.18 వేలకు పెంచింది. ఏడాదికి 750 కిలోల పసిడి ఉత్పత్తి లక్ష్యంగా ఏర్పాటయ్యే ఈ పరిశ్రమకు 2023లోనే కేంద్ర ప్రభుత్వం అనుమతులు లభించాయి. ఈ ఏడాది పనులు ప్రారంభిస్తామని జియోమైసూర్ భాగస్వామ్య కంపెనీ 'డెక్కన్' ముఖ్య ప్రతినిధి ఢిల్లీలో ప్రకటించారు.

మండలాలుగా విభజన

లీజులకు తీసుకున్న భూముల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రతి 20 మీటర్లకు ఒకచోట డ్రిల్లింగ్ జరిపారు. అక్కడ బంగారు గని నాణ్యత, లాభనష్టాలపై జరిపిన పరిశోధన సత్ఫలితాలను ఇచ్చింది. దీంతో పూర్తిస్థాయి గోల్డ్ మైనింగ్, ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు జియోమైసూర్ శ్రీకారం చుట్టింది. రోజుకు వెయ్యి టన్నుల మట్టిని యంత్రాలద్వారా జల్లెడ పట్టనుంది. బంగారు గనిలో 1.5 టన్నుల మట్టి నుంచి ఒక గ్రాము బంగారాన్ని ఉత్పత్తి చేయవచ్చునని అంచనా వేస్తున్నారు. కాగా, జొన్నగిరి, పగడిరాయి, ఎర్రగుడి, బొల్లవానిపల్లె గ్రామాల పరిధిలో లీజుకు తీసుకున్న భూములను ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమట మండలాలుగా జియోమైసూర్ కంపెనీ విభజించింది. ఇందులో తూర్పు మండలంలో కార్మాగారం ఏర్పాటు పనులు దాదాపు పూర్తయ్యాయి. అమెరికా, చైనా దేశాల నుంచి యంత్రాలను దిగుమతి చేసుకుంది. రాష్ట్రప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంటనే కర్మాగారాన్ని ప్రారంభిస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

సేవాకార్యక్రమాలు..

బంగారు నిక్షేపాలను గుర్తించిన గ్రామాల్లో కంపెనీ ప్రతినిధులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారు. జొన్నగిరి బాలుర హాస్టల్, పాఠశాల మరమ్మతుల కోసం నిధులను వెచ్చించారు. గ్రామ వైద్య అవసరాల కోసం ప్రత్యేక అంబులెన్స్‌ను ఏర్పాటుచేశారు. పాఠశాల విద్యార్థులకు బస్సుసౌకర్యం ఏర్పాటుచేశారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. భూములు పూర్తిగా కోల్పోయిన రైతు కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలను అందిస్తున్నామని, కొన్ని కుటుంబాల్లో ఇద్దరికి కూడా ఉద్యోగాలను అందించామని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

నాడు సువర్ణగిరి.. నేడు జొన్నగిరి

ప్రాచీన కాలంలో జొన్నగిరి ప్రాంతాన్ని సువర్ణగిరిగా పిలిచేవారని చరిత్రకారులు చెబుతున్నారు. ఇక్కడి భూముల్లో బంగారు నిక్షేపాలు ఉన్నాయని ఆనాడే గుర్తించారేమో..! అందుకే సువర్ణగిరి అని పిలిచేవారని స్థానికులు అంటున్నారు. కాలక్రమేనా సువర్ణగిరి కాస్తా.. సొన్నగిరిగా.. ఆ తరువాత జొన్నగిరి రూపాంతరం చెందింది. అశోకుడి సామ్రాజ్యానికి దక్షిణ ప్రాంత ప్రధాన కార్యాలయంగా జొన్నగిరి ఉండేదని అంటున్నారు. క్రీస్తు పూర్వం మూడో శతాబ్దానికి చెందిన అశోకుని శిలా శాసనాలను జొన్నగిరి సమీపంలో గుర్తించారు. ఆలయానికి సమీపంలో పెద్ద రాతిబావి ఉంది. బంగారు నిక్షేపాలు వెలికితీసేందుకు ఈ బావి తవ్వి ఉండవచ్చని తెలుస్తోంది. చోళుల కాలంలో కూడా జొన్నగిరి ప్రాంతంలో బంగారు నిక్షేపాలు ఉండేవని చరిత్ర చెబుతోంది. బ్రిటీష్ కాలంలో కూడా బంగారు నిక్షేపాల కోసం అన్వేషణ జరిగినట్టు తెలుస్తోంది.

కర్మాగారానికి హంద్రీనీవా నీరు..

నీటి అవసరాల కోసం మినీరిజర్వాయర్‌ను కంపెనీయే నిర్మించింది. ప్రభుత్వం హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా ఏడాదికి 0.021 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అనుమతి ఇచ్చింది. మద్దికెర మండలం ఎడవలి గ్రామంవద్ద హంద్రీనీవా కాలువ నుంచి తూర్పు మండలంలో తాము నిర్మించుకున్న మినీ రిజర్వాయర్‌కు 21 కిలోమీటర్ల మేర కంపెనీ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసుకుంది. హంద్రీనీవా నీటిని మళ్లించేందుకు ఏర్పాటు చేసుకున్న పైప్‌లైన్ పనితీరును పరిశీలించేందుకు ట్రయల్‌రన్ పూర్తిచేశారు.



పరిశోధనల కోసం జరుగుతున్న మట్టి తవ్వకాలు



భారత ఐటీ రంగంపై హెచ్-1బీ పిడుగు!

- రూ.25 లక్షల కోట్ల వ్యాపారంపై ప్రభావం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఐటీ నిపుణులు

బెంగళూరు, సెప్టెంబరు 22: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్-1బీ వీసాల విషయంలో తీసుకున్న నిర్ణయం భారత ఐటీ రంగంపై తీవ్ర ప్రభావం చూపించనుందని నిపుణులు, ఆర్థిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని దశాబ్దాలుగా అమెరికా నుంచి ఐటీ రంగం లబ్ధి పొందిందని, తాజాగా హెచ్-1 బీ వీసాకు లక్ష డాలర్ల రుసుమును నిర్ధారించడంతో ఈ రంగంపై పిడుగు పడినట్లు అయిందని చెబుతున్నారు. అమెరికా వర్క్ వీసా కార్యక్రమాలు, సాఫ్ట్ వేర్ ఔట్ సోర్సింగ్, వ్యాపార సేవలు తదితరాల రూపంలో భారత ఐటీ సెక్టార్ 283 బిలియన్ డాలర్ల(రూ25 లక్షల కోట్లు) వ్యాపారం చేస్తోందని, తాజా పరిణామాలతో దీనిపై తీవ్ర ప్రభావం పడనుందని నిపుణులు తెలిపారు. భారత దేశ మొత్తం ఐటీ రంగం వాటాలో 57శాతం అమెరికా మార్కెట్ నుంచే లభిస్తోందని తెలిపారు. కాగా, గత ఏడాది గణాంకాలను పరిశీలిస్తే హెచ్-1బీ వీసాల విషయంలో భారత్ 71 శాతంతో అతిపెద్ద లబ్ధిదారుగా ఉందని చెబుతున్నారు. కేవలం 11.7 శాతం లబ్ధితో చైనా రెండోస్థానంలో ఉందని నిపుణులు తెలిపారు. మరోవైపు, యాపిల్, జేపీమోర్గాన్, వాల్‌మార్ట్, మైక్రోసాఫ్ట్, మెటా, అల్ఫాబెట్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీలపై ట్రంప్ ఒత్తిడి పెరిగింది. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వడంతోపాటు విదేశీయులను తగ్గించుకోవాలని, ఈ మేరకు మార్పులు చేసుకోవాలని కూడా వైట్‌హౌస్ పేర్కొంది. ఇది కూడా భారత్‌పై తీవ్ర ప్రభావం చూపనుందని నిపుణులు చెబుతున్నారు. అమెరికాలో ఉద్యోగం చేయాలన్న భారతీయుల కల చేజారుతోందని ఐటీ ఔట్ సోర్స్ కంపెనీ జెన్సార్ టెక్నాలజీస్ సీఈవో గణేష్ నటరాజన్ తెలిపారు. ఔత్సాహికుల అమెరికా కల సంక్లిష్టంగా మారిందన్నారు. భారత్, మెక్సికో, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి నిపుణులైన ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీలు పరిమితి పాటించనున్నాయని తెలిపారు. ఇదిలా వుంటే, నాస్కామ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడించింది. హెచ్-1బీ వీసా రుసుము పెంచడంతో అమెరికాను నిపుణుల కొరత వెంటాడుతుందని తెలిపింది. దీని ప్రభావం అమెరికా ఆవిష్కరణలు, ఐటీ రంగంపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. 'ఎంకే' గ్లోబల్ చీఫ్ ఎకానమిస్ట్ మాధవి అరోరా స్పందిస్తూ.. ప్రపంచ వాణిజ్యం సహా సాంకేతిక యుద్ధంలోకి సేవల ఎగుమతులు కూడా చేరే అవకాశం ఉందన్నారు. సప్లయ్ చైన్(సరఫరా వ్యవస్థ)పై ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు. ఇలా చాలా మంది నిపుణులు ట్రంప్ నిర్ణయంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఐటీ ఒప్పందాలు సహా ప్రాజెక్టులపై ప్రభావం పడుతుందన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో భారత్‌కు చెందిన హెచ్-1బీ వీసా హోల్డర్లు కూడా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. ఫలితంగా చెల్లింపులు కూడా తగ్గుతాయన్నారు.

వీసా ఫీజును ఎత్తివేసే యోచనలో బ్రిటన్

కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును ట్రంప్ లక్ష డాలర్లకు పెంచి హడలెత్తిస్తున్న నేపథ్యంలో బ్రిటన్ ప్రభుత్వం ఇందుకు భిన్నమైన పంథాలో ముందుకెళ్లాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను ఆకర్షించే ప్రయత్నాలను బ్రిటన్ ప్రభుత్వం ముమ్మరం చేయాలనుకుంటోంది. ప్రపంచంలోని అగ్రశ్రేణి సైన్స్, టెక్నాలజీ నిపుణులను తమ దేశానికి ఆకర్షించేందుకుగాను వీసా ఫీజును మినహాయించే దిశగా యోచన చేస్తున్నట్టుగా 'ఫైనాన్షియల్ టైమ్స్' కథనం పేర్కొంది. ఇందులో భాగంగా భారతీయులు సహా ప్రపంచ నిపుణులను ఆకర్షించడంపై గ్లోబల్ టాలెంట్ టాస్క్‌ఫోర్స్ దృష్టిసారించినట్టు తెలిపింది. బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమిచ్చే మార్గాలను అన్వేషించేందుకు ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైంది. ఇది ప్రధాని కీర్ స్టార్మర్, చాన్స్‌లర్ రాచెల్ రీవ్స్‌కు నేరుగా నివేదిస్తుంది. వీసా ఖర్చులను సున్నాకు తగ్గించే యోచన చేస్తున్నట్టుగా ప్రభుత్వ అధికారిని ఉటంకిస్తూ ఆ ఆంగ్ల పత్రిక కథనం పేర్కొంది.

దేశంలో మూడింట రెండు వంతులు పనిచేసే వయసువారే

- తొలి మూడు రాష్ట్రాల్లో ఢిల్లీ, తెలంగాణ, ఏపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: దేశ జనాభాలో పని చేసే వయసు ప్రజలు మూడింట రెండు వంతులు ఉన్నారు. మొత్తం జనాభాలో 66 శాతం మంది పని చేసే వయసు (15-59) విభాగంలో ఉన్నారని నమూనా నమోదు సిస్టం గణాంక నివేదిక 2023 వెల్లడించింది. ఈ విభాగంలో ఢిల్లీలో ఎక్కువ మంది ప్రజలు నివసిస్తున్నారు. తర్వాత స్థానాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. ఇక బాలల విభాగంలో జనాభా భారీగా తగ్గిపోయింది. మొత్తం జనాభాలో 0-14 ఏళ్ల విభాగంలో 24.2 శాతం ఉన్నట్లు నివేదిక పేర్కొంది. పని చేసే విభాగంలో ప్రజల సంఖ్య మాత్రం పెరిగింది. నివేదిక ప్రకారం.. ఢిల్లీలో 70.8% వర్కింగ్ ఏజ్‌లో ఉన్నారు. తెలంగాణలో 70.2 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 70.1 శాతం ప్రజలున్నారు. మొత్తం జనాభాలో పట్టణ వర్కింగ్ ఏజ్ గ్రూప్ జనాభా 68 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 64 శాతం ప్రజలు నివసిస్తున్నారు.

కుల రిజర్వేషన్లు పొందకపోవడం బ్రాహ్మణుడిగా నాకు అతిపెద్ద వరం

- నాకు కులమతాలపై విశ్వాసం లేదు: గడ్కరీ

నాగపూర్, సెప్టెంబరు 22: బ్రాహ్మణులకు కుల ఆధారిత రిజర్వేషన్లు లేకపోవడం ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా తనకు దేవుడిచ్చిన అతిపెద్ద వరం అని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. మరాఠా, ఓబీసీ, బంజారా రిజర్వేషన్లపై మహారాష్ట్రలో రాజకీయం వేడెక్కిన తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. నాగపూర్‌లో సోమవారం జరిగిన హల్బా సమాజ్ మహాసంగ్ స్వర్ణోత్సవ కార్యక్రమంలో గడ్కరీ ప్రసంగించారు. తనకు కులమతాల పట్ల విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఎవ్వరు కూడా కులాన్నో, మతాన్నో, భాషనో ఆధారంగా చేసుకొని గొప్పవారు కాలేరని.. కేవలం తమలోని లక్షణాల వల్లే గొప్పవారు అవుతారని నొక్కి చెప్పారు. తాను బ్రాహ్మణుడినని, బ్రాహ్మణులకు కుల ఆధారిత రిజర్వేషన్లు లేకపోవడమనేది తనకు జీవితంలో దేవుడిచ్చిన అతిపెద్ద వరమని వెల్లడించారు.

ఎమ్మెల్సీ జయమంగళ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తూ తాను సమర్పించిన లేఖపై శాసనమండలి చైర్మన్ నిర్ణయం వెల్లడించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది. ఆ పిటిషన్ సోమవారం విచారణకు రాగా.. ఆయన తరఫున న్యాయవాది అజయ్ వాదనలు వినిపించారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా సమర్పించామని.. ఆమోదించడం గానీ, తిరస్కరించడంగానీ చేయలేదన్నారు. తగిన ఉత్తర్వులు జారీ చేసేలా చైర్మన్‌ను ఆదేశించాలని కోరారు. చైర్మన్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'నవంబరు 28న తన ముందు హాజరుకావాలని చైర్మన్ ఈ నెల 8న పిటిషనర్‌కు నోటీసులు ఇచ్చారు. ఫలానా విధంగా చేయండని చైర్మన్‌ను ఆదేశించడం అంటే.. కోర్టులు తమ అధికారి పరిధిని దాటి వ్యవహరించడమే. పిటిషన్‌ను కొట్టివేయండి' అని కోరారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ప్రకటించారు.

కేజీబీవీల్లో నియామకాలపై వివరాలివ్వండి

- కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్ పథకం కింద నడిచే కేజీబీవీ, ఇతర విద్యాసంస్థల్లో శాశ్వత ప్రాతిపదికన బోధనా సిబ్బందిని నియమించడంపై వివరాలు సమర్పించాలని కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. అడిషనల్ సొలిసిటర్ జనరల్ అభ్యర్థన మేరకు తదుపరి విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ బట్టుదేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మ ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. కేజీబీవీల్లో పార్ట్‌టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీలు)గా పనిచేస్తున్నవారు తమను అర్థంతరంగా తొలగించారని పేర్కొంటూ 2023లో హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పిటిషనర్లను కొనసాగించాలన్నారు. దీన్ని సవాల్ చేస్తూ అధికారులు 2024 జనవరిలో ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. సోమవారం అప్పీల్ విచారణకురాగా.. పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి తరఫున ప్రభుత్వ న్యాయవాది రామచంద్రరావు స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్ కారణంగా కేజీబీవీల్లో శాశ్వత ప్రాతిపదికన నియామకాలు జరపలేకపోతున్నామన్నారు. కేంద్రం తరఫున హాజరైన ఏఎస్‌జీ చల్లా ధనంజయ.. ఏటా కాంట్రాక్ట్ పద్ధతిలో సిబ్బందిని నియమించుకోవాలని కేంద్రం సర్క్యులర్ ఇచ్చిందని కోర్టుకు తెలిపారు.

తిరుమల లడ్డూ వ్యవహారం.. సీబీఐ పిటిషన్‌పై 26న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తు అధికారి వెంకట్రావుపై హైకోర్టు ఉత్తర్వులను సీబీఐ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. కల్తీ నెయ్యి ఆరోపణలపై అనేక మంది సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్‌ను నియమించింది. సిట్ విచారణలో భాగంగా తమ ముందు హాజరు కావాలని వెంకట్రావు.. చిన్నప్పన్న అనే వ్యక్తికి నోటీసులిచ్చారు. ఆ నోటీసులను చిన్నప్పన్న హైకోర్టులో సవాల్ చేశారు. వెంకట్రావు నియామకం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా లేదని.. ఆయన దర్యాప్తు నిర్వహించరాదని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని సీబీఐ డైరెక్టర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ సోమవారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. విచారణను వాయిదా వేయాలని.. ఈ నెల 26న తమ వాదనలు వినాలని సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తి చేశారు. దీంతో 26నే లిస్ట్ చేయాలని జస్టిస్ గవాయ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు.

కలకలమా..కకావికలమా!

- మావోయిస్టు పార్టీలో అంతర్గత సంక్షోభం!?
- సోనూ స్థానంలో అధికార ప్రతినిధిగా 'కోసా'
- వికల్ప్‌తో కలిసి 'సాయుధ పంథా'పై తొలి ప్రకటన
- అది వెలుగు చూడకముందే ఇద్దరూ ఎన్‌కౌంటర్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒకరు మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధిగా ఇటీవలే ఎన్నికైన నాయకుడు! మరొకరు పార్టీ అగ్రనేత! 'సాయుధ పోరాటమే మా పంథా' అని తేల్చి చెబుతూ ఇద్దరూ సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే.. అది వెలుగు చూడకముందే వారిద్దరూ ఎన్‌కౌంటర్ అయ్యారనే వార్త బయటి ప్రపంచానికి తెలిసింది. ఆ ఇద్దరు అగ్రనేతలే.. కోసా(కడారి సత్యనారాయణ), వికల్ప్(కట్టా రామచంద్రారెడ్డి). వీరిద్దరూ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులే. 'సాయుధ పోరాటాన్ని వదిలిపెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం' అంటూ ఇటీవల పార్టీ అగ్రనేత సోనూ విడుదల చేసిన ప్రకటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తదుపరి పరిణామాలతో సోనూను పార్టీ అధికార ప్రతినిధిగా తప్పించి... ఆ స్థానంలో కోసా అలియాస్ కడారి సత్యనారాయణను నియమించినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఆయన వికల్ప్ (కట్టా రామచంద్రా రెడ్డి)తో కలిసి 'అభయ్' పేరుతో ఈనెల 20వ తేదీ(శనివారం) ఒక ప్రకటన విడుదల చేశారు. సోనూ ప్రకటనను ఖండిస్తూ లేఖను రాశారు.

అసలేం జరుగుతోంది...

అంతర్గతంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ... మావోయిస్టు పార్టీ 'సాయుధ పోరాటమే' పంథాగా కొనసాగుతోంది. ఇప్పుడు తొలిసారి ఆ ప్రాథమిక సూత్రంపైనే విభేదాలు రాజుకున్నాయి. కొందరు రాజీబాట పట్టగా.. ప్రాణంపోయినా పోరాడాల్సిందే అని మరికొందరు తేల్చిచెబుతున్నారు! స్వయనా కేంద్ర కమిటీలోనే రెండు భిన్న వాదనలు మొదలయ్యాయి. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనూ 'సాయుధ పోరాట విరమణ' వైఖరి తీసుకున్నారు. అధికార ప్రతినిధి హోదాలో 'అభయ్' పేరిట ఆయన దీనిపై ప్రకటన చేశారు. అంతకు ముందు పార్టీకి ఆయన 6 పేజీల లేఖ రాశారు. అందులో పార్టీ వైఫల్యాలను ప్రస్తావించారు. మరో వర్గం అంటే.. గణపతి, మల్లా రాజిరెడ్డి, ప్రసాదరావు, తిప్పిరి తిరుపతి, కోసా(కడారి సత్యనారాయణ), వికల్ప్(కట్టా రామచంద్రారెడ్డి) తదితరులు సాయుధ పోరాట మార్గమే సరైన పంథా అని నమ్ముతున్నారు. ఇటీవలి కాలంలో కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సమావేశాలూ జరుపుకోలేని పరిస్థితుల్లో మావోయిస్టు పార్టీ ఉంది. ఈ నేపథ్యంలో సోనూ తన వాదనను ప్రకటన రూపంలో విడుదల చేసి ఉంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తన వాదనను బలపరిచే మరో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులతో కలిసి సోనూ ప్రత్యేకంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు అనుమానిస్తున్నాయి. మూల సిద్ధాంతానికి విరుద్ధంగా, కేంద్ర కమిటీతో చర్చించకుండా సోనూ చేసిన ప్రకటనను పార్టీ తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ఆయనను అధికార ప్రతినిధి హోదా నుంచి తప్పించారని సమాచారం. ఆయన స్థానంలో కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు కోసాను ఎంపిక చేశారని తెలిసింది. ఈనెల 20వ తేదీతో మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట కోసా, దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీ అధికార ప్రతినిధి హోదాలో వికల్ప్ ఒక ప్రకటన విడుదల చేశారు. తీరా చూస్తే... వారి ప్రకటన ఇంకా మీడియాకు చేరకముందే ఇద్దరు నేతలు ఎన్‌కౌంటర్‌లో మరణించారు.

ఆయుధాలు దించేది లేదు!

- సోనూది ఉద్యమ ద్రోహమే.. మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రకటన

సోనూ ప్రకటనను ఖండిస్తూ అభయ్, వికల్ప్ పేరిట ఈనెల 20వ తేదీన వెలువడిన ప్రకటనలోని ముఖ్యాంశాలివి...

"సాయుధ పోరాటమే పార్టీ విధానం. దానికే కట్టుబడి ముందుకు సాగుతాం. అలాగే... శాంతి చర్చలను కూడా బలంగా కోరుకుంటున్నాం. చర్చలను సులభతరం చేసే ప్రయత్నాలకు ప్రతిస్పందనగా మా పార్టీ ప్రధాన కార్యదర్శి, అమరవీరుడు బస్వరాజు ఆయుధాలు విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నారని సోనూ చేసిన ప్రకటన సత్యాన్ని వక్రీకరించడమే. దీనిపై అందరి అభిప్రాయాలను కోరడం పార్టీని విచ్ఛిన్నం చేయడానికి చేసిన దుష్టకుట్ర. దీనిని విరమించుకోవాలని సోనూను కోరుతున్నాం. పార్టీ సాయుధ విప్లవ పంథా ఓడిపోయిందని, అనేక వ్యూహాత్మక, అతివాద తప్పిదాల వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని సోనూ రాశారు. పార్టీ విధానం తప్పయితే, ఆయన ప్రత్యామ్నాయ విధానాన్ని రూపొందించి అంతర్గత చర్చ ప్రారంభించవచ్చు. కానీ, ఆయన అలా చేయడానికి ఇష్టపడటం లేదు. ఆయుధాలు వీడటం అంటే శత్రువుకు లొంగిపోవడమే. సోనూ, అతని సహచరులు శత్రువుకు లొంగిపోవాలనుకుంటే లొంగిపోవచ్చు. అలా లొంగిపోవాలనుకుంటే వారి వద్ద ఉన్న ఆయుధాలను పార్టీకి అప్పగించాలి. లేదంటే వాటిని స్వాధీనం చేసుకోవాలని పీఎల్‌జీఏను కోరుతున్నాం."

ఒకే చోట ఎలా?

తీవ్ర నిర్బంధ పరిస్థితుల్లో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు ఒకేచోట చేరడం జరిగే పని కాదని కొందరి అభిప్రాయం. అంటే... వారి కదలికల గురించి పోలీసు బలగాలకు ముందే తెలిసి ఉంటుందని, పార్టీలో ప్రస్తుతం నెలకొన్న 'అలజడి'కీ, ఇద్దరు అగ్రనేతల కదలికలు బయటికి పొక్కడానికీ మధ్య సంబంధం ఉండొచ్చునని అనుమానిస్తున్నారు. కాగా, కోసా, వికల్ప్‌లను కోవర్టు ఆపరేషన్‌లో భాగంగా చంపేశారని రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ఆరోపించింది. ఆ ఎన్‌కౌంటర్ బూటకమని కమిటీ ప్రధాన కార్యదర్శి బల్లా రవీంద్రనాథ్ పేర్కొన్నారు.

అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్

- కేంద్రకమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డి మృతి



కాల్పుల్లో మృతిచెందిన కట్టా రామచంద్రా రెడ్డి, కడారి సత్యనారాయణ రెడ్డి


చర్ల, చింతూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వరుస ఎన్‌కౌంటర్లలో అగ్ర నాయకత్వాన్ని కోల్పోతున్న మావోయిస్టు ఉద్యమానికి మరో ఎదురుదెబ్బ. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీకి చెందిన కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి(రాజుదాదా, వికల్ప్, ఉసెండీ)(63), కడారి సత్యనారాయణ రెడ్డి(కోసాదాదా, గోపన్న, బుచ్చన్న)(67) మృతిచెందారు. వీరిద్దరూ తెలంగాణలోని కరీంనగర్ జిల్లా. వీరిద్దరిపై రూ.40 లక్షలు చొప్పున రివార్డు ఉంది. ఘటనాస్థలం నుంచి ఏకే 47, ఇన్సాస్ రైఫిల్, బీజీఎల్ లాంచర్, భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. గత పాతికేళ్లలో ఒకరి కంటే ఎక్కువ మంది కేంద్రకమిటీ సభ్యులు ఒక ఎన్‌కౌంటరులో చనిపోవడం ఇదే తొలిసారి. 1999లో జరిగిన కొయ్యూరు ఎన్‌కౌంటరులో కేంద్ర కమిటీ సభ్యులు నల్లా ఆదిరెడ్డి(శ్యామ్, రఘు), ఎర్రంరెడ్డి సంతోశ్‌రెడ్డి(మహేశ్) చనిపోయారు. ఇక..ఈ ఒక్క నెలలోనే నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు మరణించగా, మరో సీసీ మెంబరు, పశ్చిమ బెంగాల్‌లో ఎన్‌కౌంటర్ అయిన మల్లోజుల కోటేశ్వర్‌రావు(కిషన్‌జీ) భార్య పోతుల కల్పన(సుజాత) తెలంగాణ పోలీసులకు లొంగిపోయారు. పోలీసు వర్గాల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లోని అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు కేంద్ర బలగాలకు సమాచారం అందింది. దీంతో కూంబింగ్ చేపట్టాయి. సోమవారం ఉదయం నుంచి కాల్పులు జరిగాయి. అనంతరం ఘటనాస్థలంలో గాలించగా, ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు కనిపించినట్లు నారాయణపూర్ ఎస్పీ రాబిన్‌సన్ తెలిపారు.

టార్గెట్ కేంద్ర కమిటీ.. మిగిలింది ఎనిమిది మందే

వచ్చే ఏడాది మార్చి 31నాటికి ఆపరేషన్ కగార్‌ను ముగించాలన్న కేంద్రం ఆదేశాలతో బలగాలు కూంబింగ్ ముమ్మరంగా చేస్తున్నాయి. కేంద్ర కమిటీ సభ్యులే లక్ష్యంగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నాయి, ఇందుకోసం ప్రత్యేక శాటిలైట్ టెక్నాలజీని బలగాలు వినియోగించుకుంటున్నట్టు తెలుస్తోంది. గతేడాది నుంచి చూస్తే కేంద్రకమిటీ సభ్యులు చలపతి, మాంఫీ, గణేశ్, మోడెం బాలకృష్ణ, సహదేవ్, తాజాగా రాంచంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి.. మొత్తం 8మంది మృతి చెందారు. ఈ ఏడాది మే 25న ఎన్‌కౌంటర్ అయిన కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ కేశవరావు అలియాస్ బస్వరాజ్‌ను కలుపుకొంటే ఈ సంఖ్య తొమ్మిదికి చేరింది. మొత్తం కేంద్ర కమిటీలో ప్రస్తుతం 8 మందే ఉన్నట్టు పోలీసువర్గాలు భావిస్తున్నాయి. కాగా, తాజా ఎన్‌కౌంటర్‌పై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నా యి. కేంద్రకమిటీ సభ్యులు ఉన్నచోట మూడంచెల భద్రత ఉంటుందని, అందులో ఎవరూ చనిపోకుండా కేవలం ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు ఎలా చనిపోతారని ప్రజాస్వామిక, పౌర హక్కుల సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. లొంగిపోయిన వారు ఇచ్చిన సమాచారంతో పట్టుకుని చంపి ఉంటారని ప్రచారం జరుగుతోంది.

నోటికి ప్లాస్టర్.. ముక్కుకు క్లిప్పు!

- ఇంజనీరింగ్ విద్యార్థిని బలవన్మరణం.. గుంటూరులోని ప్రైవేటు హాస్టల్‌లో ఘటన



మృతురాలు శ్రావ్య

గుంటూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె ఆత్మహత్య చేసుకుంటానన్న విషయం ముందుగా స్వగ్రామంలో తల్లిదండ్రులకు తెలియగా, వారు కూతురిని కాపాడుకోవాలని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నోటికి టేపు, ముక్కుకు క్లిప్పు పెట్టుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆత్మహత్యకు దారితీసిన కారణాలు తెలియరాలేదు. పట్టాభిపురం పోలీసుల కథనం మేరకు.. ఏలూరు జిల్లా దెందులూరుకి చెందిన కమ్మ రాజు, రాధిక దంపతుల కుమార్తె శ్రావ్య(20) నంబూరు సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతోంది. గుంటూరు అశోక్ నగర్‌లోని ఓ ప్రైవేటు ఉమెన్స్ హాస్టల్లో ఉంటోంది. ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో శ్రావ్య విజయవాడలో ఉన్న తన స్నేహితురాలు జాగృతికి ఫోన్ చేసి.. ఆత్మహత్య చేసుకోవాలని ఉందని చెప్పింది. దీంతో కంగుతిన్న జాగృతి.. శ్రావ్య అన్నయ్యకు, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి..విషయం చెప్పింది. వెంటనే వారు శ్రావ్యకు ఫోన్ చేసి మాట్లాడారు. అయితే, మనసు బాగోలేక అలా అన్నానని, ఆత్మహత్య చేసుకోనని చెప్పింది. అయినప్పటికీ తల్లిదండ్రులు.. వెంటనే శ్రావ్య ఉంటున్న హాస్టల్ గదిలోని తోటి విద్యార్థినులకు ఫోన్ చేశారు. జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. అయితే రాత్రి సమయంలో శ్రావ్య గది బయట కుర్చీ వేసుకొని కూర్చుని ఉంది. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఇన్‌స్టా మార్ట్‌లో టేపు, క్లిప్స్ ఆర్డర్ పెట్టింది. పది నిమిషాల్లో డెలివరీ బాయ్ ఆర్డర్ ఇచ్చి వెళ్లాడు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో బయట వరండాలోనే శ్రావ్య నోటికి ప్లాస్టర్, ముక్కుకు క్లిప్పు పెట్టుకొని చలనంలేకుండా పడిపోయి కనిపించింది. శ్రావ్య ఆత్మహత్య విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన హాస్టల్ వద్దకు చేరుకున్నారు. పట్టాభిపురం సీఐ ఘటనా స్థలికి వచ్చి పరిశీలించారు. కుటుంబ సభ్యులకు శ్రావ్య మృతదేహాన్ని అప్పగించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.